
ఏదా హిమ వస యవ్వనశోభ కావలెనా ?
అయితే మీరు సదా అశోకా
శాండల్‌వుడ్ ఫేస్‌పౌడర్నునే
ఉపయోగింపుడు
విజయా కెమికల్స్
మద్రాసు - 7
ASOKA
ALL PURPOSE SANDAL Powder

VISALAANDHRA Phone No. 5301 ఉదయం ★ ★ Regd No. 203

విశాలాంధ్ర

703626

సంపుటి 21 సంచిక 98

విజయవాడ 4-7-71 ఆదివారం

8 పేజీలు 18 పై.

రండి ! రుచికి - శుచికి మారండి !!
హోటల్ రోజ్‌లాండ్
లాడ్జింగ్ అండ్ బోర్డింగ్
కాఫీ అండ్ టిఫిన్
అధునాతనమైన పరికరములతో కనుల కింపుగా ఉండే
హోటల్ రోజ్‌లాండ్
జిన్నాటవర్ - గుంటూరు

విశ్వవిద్యాలయాల సెనేట్లలో విద్యార్థులకు ప్రాతినిధ్యం

పరిపాలనా వ్యవహారాల సంఘం సూచనకు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ స్థూలంగా ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 3

విశ్వవిద్యాలయాల సెనేట్లలో విద్యార్థులకు ప్రాతినిధ్యం కల్పించాలని విశ్వవిద్యాలయాల పరిపాలనా వ్యవహారాల సంఘం సూచించింది.

ఈసూచనను విశ్వవిద్యాలయ గ్రాంట్సు కమిషన్ స్థూలంగా ఆమోదించింది.

విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటుచేసిన పరిపాలనా వ్యవహారాల సంఘం ఒక నివేదిక సమర్పిస్తూ యీ సూచన చేసింది.

సుప్రీంకోర్టు మాజీప్రధాన న్యాయమూర్తి డాక్టర్ గజేంద్రగడ్కర్ అధ్యక్షతన 1969 జూన్‌లో యీ సంఘం ఏర్పాటయింది.

విశ్వవిద్యాలయ ఎకడమిక్ కౌన్సిల్స్‌లో విద్యార్థులకు ప్రాతినిధ్యం కల్పించవలసిన అవశ్యకత లేనప్పటికీ సెనేట్లలో ప్రాతినిధ్యం వుండాలని యీ సంఘం తన నివేదికలో పేర్కొన్నది.

విశ్వవిద్యాలయాల పరిపాలన వ్యవహారాలు, విశ్వవిద్యాలయాల నిర్మాణం, చట్టబద్ధమైన సంస్థలలో విద్యార్థులకు ప్రాతినిధ్యం, విశ్వవిద్యాలయాలకు, అనుబంధ కళాశాలలకు మధ్య వుండవలసిన సంబంధాలను యీ సంఘం పరిశీలన జరిపింది.

విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ సమావేశం నిన్న జరిగింది. గజేంద్ర గడ్కర్ సంఘం నివేదికను సమావేశం స్థూలంగా ఆమోదించింది.

కళాశాలల పరిపాలన వ్యవహారాల పరిశీలనపై ఏర్పాటైన సంఘం తన నివేదికను

(మిగతా 2వ పేజీలో)

భారత-సోవియట్ ఆర్థిక సంబంధాల అభివృద్ధికి కృషి

షెల్వాంకర్ హామీ

మద్రాసు, జూలై 2

భారత-సోవియట్ యూనియన్‌ల మధ్య ఆర్థిక సంబంధాల అభివృద్ధిలో మరింత కృషి చేయగలమని సోవియట్‌లో భారత రాయబారిగా నియమింపబడనున్న డాక్టర్ కె. యన్. షెల్వాంకర్ ఇక్కడ అన్నారు.

దక్షిణ భారత "చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ" సమావేశాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గతంలోమనం ఆర్థిక వాణిజ్య కార్యకలాపాల ప్రాధాన్యతను విస్మరించవచ్చునేమో, లేక తక్కువ ప్రాముఖ్యత నివ్వడమో జరిగేది. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఆర్థిక సంబంధాలను పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని విదేశాంగ శాఖ గుర్తించింది అని శ్రీ షెల్వాంకర్ అన్నారు.

మొసాయిర్ రహ్మాన్ అరెస్ట్

జల్పాయిగురి, జూలై 2

రంగపూర్ జిల్లా డిమ్లా పోలీసు స్టేషన్ ప్రాంతంలో ఖోగాఖారిబారి వద్ద నేషనల్ అవామీ పార్టీ (భషానీ వర్గం) ప్రధాన కార్యదర్శి మొసాయిర్ రహ్మాన్‌ను ఆ గృహం వద్దనే మార్షల్‌లా అధికార్లు అరెస్టు చేశారు. జూన్ 29 రాత్రి ఈఅరెస్టు జరిగిందని బంగ్లాదేశ్ నుండి అందిన వార్తలు తెలుపుతున్నాయి.

రహ్మాన్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులందరినీ పాక్ సైనికులు తీసుకుపోయారు. ఆయన ఇంటిపై దాడి జరిపి, ఆసాంతా లూటీచేశారు. పాక్ సైనికులు రహ్మాన్‌ను దారుణంగా కొట్టినట్లు తెలుస్తుంది.

మాంటెర్రీకి టెక్సాస్ విమానం మళ్ళింపు

మాంటెరీ (మెక్సికో), జూలై 2

టెక్సాస్‌కు వెళుతున్న ఒక జెట్ విమానాన్ని ఒక పురుషుడు, ఒక స్త్రీ కలిసి బలవంతంగా దారి మళ్ళించి మాంటెరీలో దింపారు.

తుపాకి ప్రేలుడు పదార్థాలను చూపి బెదిరించి ప్రయాణీకుల నుండి లక్ష డాలర్లను (రు. 7.5 లక్షలు) వసూలు చేశారు. ఈ విమానంలో 108 మంది ఉన్నారు.

పంజాబ్ గవర్నర్‌కు కమ్యూనిస్ట్ కార్యవర్గం మెమొరాండం

మాజీ మంత్రుల అవినీతిపై

చండీఘర్, జూలై 2

పంజాబ్ మాజీ మంత్రులపైనా, ఉన్నతాధికారులపైనా 33 అభియోగాలు చేస్తూ పంజాబ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గం త్వరలోనే రాష్ట్ర గవర్నర్‌కు ఒక మెమొరాండం సమర్పిస్తుంది.

అకాలీదళ్ ప్రభుత్వ విచ్ఛిన్నమైనపట్ల, శాసనసభ రద్దుపట్ల కార్యవర్గం హర్షం వ్యక్తం చేసింది. శాసనసభకు వచ్చే ఫిబ్రవరి మాసంలో ఎన్నికలు జరపడం సముచితంగా వుంటుందని కార్యవర్గం భావించింది.

కేరళ మంత్రివర్గంలో చేరికకు కాంగ్రెస్ ఆమోదం

కొచ్చిన్, జూలై 3

తప్పనిసరి పరిస్థితి ఏర్పడినపుడు కేరళ మంత్రివర్గంలో చేరడానికి తన లెజిస్లేచర్ విభాగాన్ని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ అనుమతించింది.

రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం, లెజిస్లేచర్ పార్టీ సంయుక్త సమావేశంలో ప్రస్తుతం రాష్ట్రంలోవున్న మంత్రివర్గ సుస్థిరతకు కాంగ్రెస్ మంత్రివర్గంలో చేరవలసిన అవసరమేర్పడితే చేరే అవకాశం ఇవ్వాలని శ్రీ కె. కె. విశ్వనాథన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమావేశానంతరం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శ్రీ ఎ. కె. ఆంటోని ఈ విషయం పత్రికలవారికి తెలియచేశారు.

ఈ విషయంపై కాంగ్రెస్‌లో గతంలో వున్న విభేదాలు ఏమైనప్పటికీ, కాంగ్రెస్ వాదులంతా సమైక్యంగా వుండాలనేది సమావేశం అభిప్రాయమని శ్రీ ఆంటోని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ మంత్రి వర్గంలో చేరే విషయమై యువజన కాంగ్రెస్‌కు, కాంగ్రెసు సీనియర్ నాయకులకు వున్న భిన్నమైన అభిప్రాయాన్ని ప్రస్తావిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

మంత్రివర్గంలో కాంగ్రెస్ పార్టీ చేరటం పై వున్న ఆంక్షను తొలగించటం ఈ సమావేశ నిర్ణయమని కాంగ్రెస్ శాసనసభా పార్టీ నాయకుడు శ్రీ కరుణాకరన్ అన్నారు.

రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితిని సమావేశం సమీక్షించిందని యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీ వయలార్ రవి అన్నారు.

రక్త ప్రసరణ ఆగిపోయి సోయుజ్ వీరుల మృతి

మాస్కో, జూలై 2

సోయుజ్ వ్యోమగాముల రక్తనాళాల్లో గాలి బుడగలు అడ్డు వచ్చినందువల్ల (ఎంబాలిజమ్) రక్తప్రసరణకు ఆటంకం కలిగిందనీ అందువల్లనే వారు మరణించారనీ తెలియవస్తున్నది.

నౌకపై వత్తిడిలో హఠాత్తుగా పెద్ద మార్పు సంభవించగా గాలిబుడగ ఏర్పడి సంభవించడంవల్ల వారు మరణించారని కొందరు సోవియట్ శాస్త్రజ్ఞులు భావిస్తున్నట్లు అనధికారవర్గాలు తెలిపాయి.

సర్వీస్ మాడ్యూల్ నుండి డిసెంట్ క్యాప్స్యూల్ విడివడి క్రిందికి వచ్చేటప్పుడు ఆ వత్తిడిలో హఠాత్ పరిణామం సంభవించిందని ఆ వర్గాల భావన. అయితే ఈ అంచనాకు ధృవీకరణ లభించలేదు. వీరి మరణానికి గల కారణాల విచారణకై నియమించబడిన కమిషన్ యింకా వివరమైన పరిశోధనలు సాగిస్తోంది.

ఈ ప్రక్రియలో (ఎంబోలిజమ్) లో రక్తనాళంలో తిరుగాడుతున్న గాలిబుడగ వంటివి హఠాత్తుగా అడ్డు రావడం జరుగుతుంది.

24 రోజుల శ్రమ అనంతరం వారిగుండె కొట్టుకోవడం హఠాత్తుగా ఆగిపోయి వుండవచ్చునే విషయాన్నికూడా యింకా త్రోసిపుచ్చడంలేదు.

ఫక్రుద్దీన్‌కు అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి హస్సౌనా హామీ

కైరో, జూలై 3

తూర్పు బెంగాల్ ఉద్రిక్తత సడలింపుకై అరబ్ లీగ్ సభ్య దేశాలతో చర్చించగలనని అరబ్ లీగ్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ఖాలేక్ హస్సౌనా నిన్న భారత వ్యవసాయ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్‌కు చెప్పినట్లు తెలుస్తున్నది.

శరణార్థుల సమస్య తీవ్రతను శ్రీ ఫక్రుద్దీన్ వివరించిన అనంతరం తాను ఈ పరిస్థితిని అవగాహన చేసుకున్నానని హస్సౌనా తెలియ చేసినట్లు తెలుస్తోంది.

ఈజిప్టు ప్రధాని మహమ్మద్ ఫౌజీని శ్రీ ఫక్రుద్దీన్ నేడే కలుసుకోనున్నారు.

ఈజిప్టులోని భారతీయులనుద్దేశించి శ్రీ ఫక్రుద్దీన్ నిన్న ప్రసంగించారు.

తూర్పు బెంగాల్లో పాక్‌సేన దారుణాలు స్వాతంత్ర్యానికి పూర్వం భారత్‌లో బ్రిటిష్ పాలకుల హింసలను మరిపిస్తున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా ఇంకా ఈ సమస్యను పాక్ అంతరంగిక సమస్యగా గుర్తించి ఈ పరిస్థితి నుండి తప్పించుకోజాలని కొన్ని దేశాలు అనుకోవడం విచారకరమన్నారు.

నిన్న ఉదయం శ్రీ ఫక్రుద్దీన్ నాజర్ సమాధిపై పుష్పగుచ్ఛాలుంచారు. అనంతరం మసీదువద్ద శుక్రవారం ప్రార్థనలో పాల్గొన్నారు.

కమ్యూనిస్టు కార్యకర్తల నిరసన ప్రదర్శన

మద్రాసులో అమెరికా రాయబార కార్యాలయంముందు

మద్రాసు, జూలై 3

పాక్ నరహంతకులకు అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆయుధ సరఫరాను నిరసిస్తూ ఇక్కడి అమెరికా రాయబార కార్యాలయంముందు వందలాది మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు ప్రదర్శన జరిపారు.

అరుణపతాకాలు చేబూనిన కార్యకర్తలు ఉద్రిక్త స్వరాలతో అమెరికన్ ప్రభుత్వాన్ని ఖండించారు. ఆయుధాల సరఫరాను నిరసించే బ్యానర్లు, ప్లేకార్డులతో ప్రదర్శకులు ముందుకు సాగారు.

కమ్యూనిస్టు శాసనసభ్యులు శ్రీ కె టి. కె. తంగమణి, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ ఎ. యస్. కె. అయ్యంగార్ ప్రదర్శనకు నాయకత్వం వహించారు. "అమెరికన్ సామ్రాజ్యవాదులు నశించాలి; పాకిస్తాన్‌కు ఆయుధ సరఫరా నిలిపివేయాలి" అని ప్రదర్శకులు నినాదాలిచ్చారు.

దాదాపు గంటకు పైగా అమెరికన్ రాయబార కార్యాలయం ముందు జరిగిన ఈ ప్రదర్శన ఆ ప్రాంత ప్రజలను ఆకర్షించింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో కమ్యూనిస్టు నాయకులు ప్రసంగించారు.

అమెరికా ప్రభుత్వ నమ్మక ద్రోహాన్ని తీవ్రంగా ఖండిస్తూ బహిరంగ సభలో ఒక తీర్మానాన్ని ఆమోదించారు.

ఆచూకీ తెలియని జపాన్ విమానం

టోక్యో, జూలై 3

68 మంది ప్రయాణీకులను తీసుకెళ్తున్న ఒక జపాన్ విమానం ఆచూకీ తెలియడం లేదు.

ఈ విమానం కూలిపోయి వుండవచ్చని భావించబడుతున్నది.

శ్రీ త్రిపాఠీ రాజీనామా ఆమోదం

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి

లక్నో, జూలై 3

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కమలాపతి త్రిపాఠీ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఇచ్చిన రాజీనామా నేడు ఆమోదింపబడింది.

శ్రీ త్రిపాఠీ రాజీనామాను ఆమోదిస్తూ కాంగ్రెస్‌పార్టీ మాజీ ప్రధానకార్యదర్శి ప్రతిపాదించిన తీర్మానాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆమోదించింది. అయితే నూతన అధ్యక్షుని నియమించే అధికారం ప్రధాని శ్రీమతి గాంధికి, శ్రీ త్రిపాఠీలకు ఇస్తూ సమావేశం తీర్మానించింది.

నూతన అధ్యక్షుని ఎన్నుకునే వరకు అధ్యక్ష పదవిలో కొనసాగవలసిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శ్రీ త్రిపాఠిని కోరింది.

సిటీ ట్రేడ్‌యూనియన్ సమావేశం నేడే

హైదరాబాద్, జూలై 3

పారిశ్రామిక సంబంధాల కమిషన్‌పై చట్టం కాబోతున్న బ్లాకు బిల్లును ప్రతిఘటించేందుకు సిటి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఒక సమావేశాన్ని ఏర్పరచింది.

భవిష్యత్ కార్యాచరణపై సమావేశం చర్చిస్తుంది.

సమావేశం హిమాయత్ నగర్‌లోని ఏ. పి. టి. యు.సి. ఆఫీసులో జరుగుతుంది.

ఎ. ఐ. టి. యు. సి. అనుబంధ సంస్థలను ఇతర సోదరసంస్థలను ఆహ్వానించారు.

సమావేశం రేపు ఉదయం 10 గంటలకు జరుగుతుంది.

ఇటీవలి ఉద్యోగుల సమ్మెను సమీక్షిస్తుంది.

డాక్టర్ రాజబహదూర్ గౌడ్, శ్రీ కె. యల్. మహేంద్ర నివేదికలు సమర్పించి చర్చను ప్రారంభిస్తారు.

పూలమొక్కలకు వ్యోమగాముల పేర్లు

బెంగుళూరు, జూలై 3

సోయుజ్-11 అమరవీరుల స్మృతి చిహ్నంగా ఇక్కడి లాల్‌బాగ్‌లోని నాలుగు మందార మొక్కలకు సోయుజ్-11 పేరును, అమరవీరుల పేర్లను పెట్టారు.

M.B.B.S.కు ప్రవేశ పరీక్షల శిక్షణతరగతులు జూలై 5నుండి
గత సంవత్సరం 92 మందికి 26 గురు ఎన్నికైనారు.
పి.యు.సి. లేక ఇంటర్ పాసై గ్రూపులో 50% రావాలి.
కాలేజీ సంఖ్య ఎంతో? - ప్యాసులెన్నో? - క్లాసులెన్నో?
చదివిన వారైనా, విన్న వారైనా చెప్పొచ్చు నిజం!
- 1971 మార్చి పి.యు.సి.లో 99కి 77 మంది కృతార్థులు. అందు 5 ఫస్టు, 21 సెకండు, 51 థర్డుక్లాసులు.
- మ్యాట్రిక్‌లో 126 గురికి ఉత్తీర్ణులు 89. అందు క్లాసులు 27.
అడ్మిషన్లు జరుగుచున్నవి. డిగ్రీతరగతులవరకు శిక్షణ. హాస్టల్సు, లేబొరేటరీలు, రిక్షా వసతులు కలవు. ప్రాస్పెక్టసు ఉచితం.
ఫోను : 21522 పి. శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్.
శాంతా ట్యుటోరియల్ కాలేజి, గుంటూరు-2


రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్
తప్పక చూడండి!
సిండ్రెల్లా చిట్టిబాబు
కరుణామయపాత్రలుధరించే ఊర్వశి శారద
పల్లెటూరి అల్లరిపిల్లగా మిషారైనపాత్ర ధరించిన వినూత్నకథా చిత్రం!
నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి
టి.ఎల్.బాబు ఎ.సంజీవి
లక్ష్మీ ఫిలింస్
LAKSHMI


దేవుడు సృష్టించాడూ లోకాల్లూ..
యీ-మనిషే కల్పించాడు తేడాల్లూ..
రచన: శ్రీకొసరాజు
పాడినవారు: ఘంటసాల & కోరస్
లక్ష్మీకళా చిత్ర వారి
రైతుబిడ్డ
దర్శకత్వం: బి.ఏ.సుబ్బారావు
నిర్మాత: కోట్ల వెంకటామయ్య
నిర్వహణ: మేడా వెంకటరమణ మూర్తి
సంగీతం: ఎస్.హనుమంతరావు.
VIJAYA


టార్జాన్..జింబో చిత్రాలను మరిపించే ఉత్కంఠభరితమైన తెలుగు జంగిల్ చిత్రం! పిల్లలతోసహా పెద్దలు కూడా చూడదగ్గ చిత్రం!
ఒక పసిబాలుడిని క్రూరమృగాలబారినుండి అంతకంటే క్రూరులైన మనుషులబారినుండి కాపాడి పెంచి పెద్ద చేసిన విచిత్రమైన ఏనుగును ఈచిత్రంలో చూడండి!
నీలా ప్రొడక్షన్స్ సమర్పించు
అడవివీరులు
కథ,దర్శకత్వం: సుబ్రహ్మణ్యం, సంగీతం: కె.వి.మహదేవన్
ఈస్ట్‌మన్‌కలర్
పూర్ణా రిలీజ్


పి.ఎన్.ఆర్. పిక్చర్స్ వారి
రాజులకు రాజులు
VIJAYA
నిర్మాత: పింజల నాగేశ్వరరావు దర్శకత్వం: కె.ఎస్.ఆర్.దాస్
గుండెల్ని దూసుకుపోయే తుపాకిగుళ్ళు, హృదయాన్ని జలదరింపచేసే థ్రిల్స్-అడుగడుగునా ఉత్సాహం కలిగించే సస్పెన్స్.
మళ్ళీ, మళ్ళీ వినాలనిపించే పసందయిన పాటలు, ఎన్ని సార్లు చూసినా తనివి తీరని నృత్యాలు-ఫైటింగ్‌లు-
చిత్రాలలోనే ఒక అద్భుత ప్రయోగం.
నేడే చూడండి!

మీవేనండీ...
మీకు ఆనందం
ఇచ్చేవండీ!
ఎంతో మృదువైన, ఎంతో ఊరట గూర్చే, వర్జీనియా పొగాకుల మేలైన మిశ్రమం
ఎస్క్వైర్
ఫిల్టరు సిగరెట్లు
ఎస్క్వైర్ త్రాగండి, విదేశ ద్రవ్యం ఆదాచేయండి.
విదేశ ద్రవ్యపు ఆదాయే విదేశ ద్రవ్యపు ఆర్జన.
Esquire
Esquire
Filter Tipped
CIGARETTES
MADE IN INDIA

మన రాజకీయాలు

అమెరికా తిరస్కారం: బ్రిటన్ నమ్మకద్రోహం

అమెరికా, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎప్పటికప్పుడు మనపై చేసే అన్యాయాలపట్ల సహించే అవమానాలపట్ల, దేనికి దానికి విడిగా ఆలోచిస్తూ, ఏదో పధంగా సర్దుకుపోయే ధోరణి ప్రభుత్వం ప్రదర్శిస్తున్నది. నిజానికిది లొంగుబాటు ధోరణి. మన స్వాతంత్ర్యాన్ని సార్వభౌమత్వాన్ని కించపరచి, ఆర్థికంగా, రాజకీయంగా మనలను చిక్కులలో పెట్టటానికి, చక్రబంధంలో ఇరికించటానికి సామ్రాజ్యవాదులు చేస్తున్న కుట్రలను గుర్తించకపోవటం

స్వరణ్‌సింగ్ అమెరికా యాత్ర విఫలం కావటమే కాదు మనలను ఏ మాత్రం ఖాతరుచేయనివైఖరిఅమెరికా ప్రదర్శిస్తున్నది. పాకిస్తాన్‌కు అమెరికా ఆయుధాలు సరఫరా అవుతూనే ఉన్నాయి. మార్చి 25కు పూర్వం జరిగినఒప్పందం అని మొదట అన్నారు. ఆ ఒప్పందాన్ని సైతం అమలుచేయ వద్దని భారత్ విజ్ఞప్తి చేసింది. అందుకు సమాధానంలేదు. మొదట్లో ఒక నౌక బయలుదేరిందన్నారు. తరువాత, రెండు, మూడై, నాలుగైదుకు ఈ సంఖ్య పెరుగుతున్నది. ధారాప్రవాహంగా పాకిస్తాన్‌కు ఆయుధాలివ్వటానికే అమెరికా నిశ్చయించింది. స్వరణ్‌సింగ్ విజ్ఞప్తులు, అభ్యర్థనలు, అన్నీ చిత్తు కాగితాల బుట్టలోకి పోయాయి

ఇందుకు ప్రతిగా భారత ప్రభుత్వం ఏమి చేస్తున్నది.

కరాచీకి అమెరికా నౌకలు చేరకుండా సముద్రం మధ్యలో అటకాయించండి అని ఒక సూచన వచ్చింది. సాధక బాధకాలు పూర్తిగా విచారించనిదే ఆ చర్య చేపట్టరాదని స్వరణ్‌సింగ్ సమాధానం. ఈవిచారణ పూర్తయ్యేసరికిఆ నౌకలన్నీ పాకిస్తాన్ చేరుకుంటాయి బంగ్లాదేశ్‌లో ఊచకోత మరింత తీవ్రమౌతుంది.

కింకర్తవ్యతామోఢ్యం

అమెరికా నిర్ణయం అమిత్ర చర్య అనైనా ప్రకటించండి అని ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలవారు కోరారు. అందుకూ ప్రభుత్వం సిద్ధంగా లేదు. నిక్సన్ సలహాదారు కిసింగర్‌కు భారత ప్రభుత్వం ఇచ్చిన ఆహ్వానాన్ని ఉపసంహరించి కనీసం ఆత్మగౌరవాన్నైనా కాపాడుకోండి అని కమ్యూనిస్టు నాయకుడు హిరేన్ ముఖర్జీ డిమాండ్ చేశారు. అందుకూ ప్రభుత్వం సిద్ధంగా లేదు

అమెరికాపట్లపెట్టుకున్న ఆశలన్నీ భగ్నమై అవమానాలు ఎదురౌతుండగా, ప్రభుత్వం కరుకుదనాన్ని ప్రదర్శించటానికిబదులుమరింత మెతకదనాన్ని ప్రదర్శిస్తున్నది

బంగ్లాదేశ్‌ప్రభుత్వాన్ని ఇదిగో నేడో రేపో గుర్తిస్తున్నామని రెండు నెలల క్రితం ప్రకటనలు చేసిన ప్రధాని, ఇప్పుడామాటే పలకడంలేదు. పైగా అలా చేయడం సాహసిక చర్య అని, అందువలన మేలుకంటే కీడు ఎక్కువ అని ఏవో సాకులు చెబుతున్నారు. స్వరణ్‌సింగ్ అదే మాటలు పునశ్చరణ చేస్తున్నారు.

బంగ్లాదేశ్‌కు ఇంతకంటే ద్రోహం ఏముంటుంది. మనకు మనమై ద్రోహం చేసుకుంటున్నాము.

బంగ్లాదేశ్ పాకిస్తాన్ అంతరంగిక సమస్యకాదు. భారతదేశానికి అతిముఖ్యమైన సమస్య. త్వరలో శరణార్థులసంఖ్య 1 కోటి సంఖ్యను చేరుకోవచ్చు. ప్రతి సెకనుకు 1 వ్యక్తి చొప్పున సరిహద్దును దాటి మన భూభాగంలో శరణార్థులు అడుగు పెడుతున్నారు.

ఈ ప్రవాహం ఎప్పుడు ఆగుతుంది? అసలు ఆగుతుందా? ఉద్దేశ్యపూర్వకంగా, భారత్‌పై సవాలుగా, పాక్ నియంతలు, బంగ్లాదేశ్ ప్రజలను సరిహద్దుల అవతలకు తోసివేస్తుండగా, దీన్నొక రాజకీయ సమస్యగా తీసుకోక ఎంతకాల మీనాగు?

యాహ్యాఖాన్ తాజా రేడియో ప్రసంగం తర్వాత, కీలుబొమ్మలకై యత్నించటం మినహా, బంగ్లాదేశ్ రాజకీయ పరిష్కారం పట్ల వారికి అభిలాషలేదని స్పష్టమైంది

పాకిస్తాన్ తన మొత్తం ఆదాయం 600 కోట్లలో, 340 కోట్లు సైనిక బడ్జెటుకు కేటాయించింది. ప్రపంచంలో ఏ దేశమూ, ఇంతగా సైనిక బడ్జెటుకు వ్యయం చేయడం లేదు పాక్ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమౌతున్నది కూలిపోతున్న పాకిస్తాన్ ఆర్థికవ్యవస్థను నిలబెట్టేందుకు అమెరికా ఆయుధాలిస్తున్నది. బ్రిటన్ ఆర్థిక సాయం చేస్తూ వెళ్తున్నది. కొత్త ఒప్పందాలు లేవుగాని, పాత ఆర్థిక ఒప్పందాలు అమలు చేస్తూనే ఉంటామని బ్రిటన్ ప్రకటించింది.

పాకిస్తాన్ పట్ల ఇంత--మక్కువ ప్రదర్శిస్తున్న బ్రిటన్, భారత్‌పై సరికొత్త దాడి ప్రారంభించింది.

జౌళి ఎగుమతులపై సుంకం

భారత్ నుండి ఎట్టి సుంకాలు లేకుండా సుమారు 30 సంవత్సరాలుగా దిగుమతి చేసుకుంటున్న జౌళి వస్త్రాలపై 15 శాతం సుంకం విధించాలని బ్రిటన్ నిశ్చయించింది ఇందుకు దొలిపర్యగా 1939 లో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి. అందుకు ఆరు నెలల నోటీసు జులై 1 బ్రిటన్ యిచ్చింది. 1972 జనవరి 1 నుండి బ్రిటన్‌కు ఎగుమతి అయ్యే జౌళి వస్త్రాలపై సుంకం విధించబడుతుంది.

ఈ చర్య భారత జౌళి ఎగుమతులకు నష్టం. కామన్వెల్తు సభ్య దేశమైన భారత్‌కు కలిగిస్తున్న సౌకర్యాలు దీంతో ఆఖరు. భారతదేశంతో స్నేహంకంటే యూరోపియన్ కామన్ మార్కెట్ సభ్యత్వం తన కెక్కువ లాభకరమని బ్రిటన్ భావిస్తున్నది. భారత్‌కు ఇదొక చెంపపెట్టు.

1939 లో ఈ ఒప్పందం జరిగింది అమెరకు బ్రిటన్‌కు జౌళి ఎగుమతులపై ఒక పరిమితిని భారత్ తనకు తానై విధించుకున్నది. ఆ పరిమితికి లోబడి జరిగే ఎగుమతులపై సుంకం ఏదీ బ్రిటన్ విధించరాదని నిర్ణయం

ఇప్పుడా నిర్ణయం రద్దవుతున్నది. బ్రిటన్ ఒక ఆశ పెడుతున్నది. సుంకం విధింపుకులోబడి భారత్ ఎంత మొత్తమైనా జౌళి వస్త్రాలను ఎగుమతి చేసుకోవచ్చునని సుంకం విధిస్తే భారత్ జౌళి వస్త్రాల ధరలు పెరుగుతాయి. బ్రిటన్‌లో మన సరుకులు ఏడుదలే కావు, ఏపుదలకాని సరుకులకు పరిమితి ఉంటే ఏమి? లేకపోతే ఏమి

తనకుతానై భారత్ గనక, 1939 ఒప్పందంలోని సౌకర్యాన్ని వదులుకుంటె, 18 కోట్ల రూపాయలు వెన్వెంటనే అప్పుగా ఇస్తామని బ్రిటన్ మరొక ఆశ పెట్టింది. ఇది మరీ అవమానకరం. తన గొంతును తానే పిసుక్కోవటానికి భారత్ అంగీకరిస్తే అందుకు బ్రిటన్ ఇంతమిస్తుందన్నమాట

రెండేండ్లుగా ఈ సమస్యపై భారత్ బ్రిటన్‌ల మధ్య చర్చలు జరిగాయి, విఫలమయ్యాయి ఇప్పుడు బ్రిటన్ ఏకపక్షంగా ఒప్పందం రద్దుకు నోటీసు యిచ్చింది. ఇక భారత్ ఏం చేయాలి?

భారత్‌కు ఆత్మగౌరవం, దూరదృష్టి ఏమైనా ఉంటే కామన్వెల్తు నుండి నిష్క్రమించటంతోపాటు, మన విదేశీ వాణిజ్యాన్ని ఇతర దేశాలకు మళ్ళించటానికి తీవ్రప్రయత్నాలు చేయాలి. భారతదేశంలోని బ్రిటిష్ కంపెనీలన్నిటినీ జాతీయం చేయాలి. ఈ కంపెనీయజమానులు రాయల్టీలపేరుతో ఏటా కోట్లకొలది ధనం తరలించుకు పోతున్నారు. బ్రిటన్ ఇంత నమ్మకద్రోహం చేసిన తర్వాత కూడా భారత ప్రభుత్వం ఈ చర్య తీసుకోకపోతే, ఇక మన ఆర్థిక ప్రయోజనాలు ఏమౌతాయి?

విదేశీ వాణిజ్యమంత్రి యల్.యన్. మిశ్రా పై చర్యలకు సుముఖుడుగా లేడు. అన్నిటినీ పరిశీలిస్తామనే మాటతప్ప నిర్దిష్టమైన వాగ్దానం ఏదీ లేదు ఇంకా ఆరు నెలల గడువుంది కదా, ఈ లోగా బ్రిటన్ తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుంటుందేమోనని మరొక ఆశ, గొర్రె, కసాయి వానినే నమ్ముతుందట! భారత ప్రభుత్వం బ్రిటన్‌పై పెట్టుకుంటున్న ఆశలు అలా ఉన్నాయి.

పెట్టుబడిదారీ సంక్షోభంలో భాగం

ఈ రోజు జౌళి వస్త్రాలపై సుంకం వేస్తున్నారు. రేపు ఇతర వస్తువులపైన కూడా సుంకాలు వేయవచ్చు కాదు. వేసితీరుతారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో భాగంగా బ్రిటన్ తీవ్ర సంక్షోభానికి గురవుతూంది. యూరప్‌లో ఉమ్మడిమార్కెట్ పోటీకి తట్టుకోలేకుండా ఉన్నది. తన ప్రయోజనాలు తాను చూసుకోవాలనుకొనే బ్రిటన్, భారత్ అభివృద్ధి పట్ల శ్రద్ధ వహిస్తుందనుకోవటం పొరపాటు. ఉదారత్వానికి సంబంధించిన అంశం కాదిది. పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభంతో ముడిపడి ఉన్న అంశం. ప్రభుత్వం ఈ వాస్తవం గ్రహించక దింపుడు కళ్ళెం ఆశలు బ్రిటన్‌పై పెట్టుకోవటం, మన ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలో నెట్టటమే అవుతుంది.

ప్రభుత్వమే ఈ [illegible] ప్రదర్శిస్తుంటే స్వతంత్రపార్టీ సభ్యులు ఊరుకుంటారా?

బ్రిటన్ చర్యతో రెచ్చిపోవద్దు, మనకే నష్టమంటూ స్వతంత్రపార్టీ సభ్యుడు హెచ్. యం. పటేల్ అంటున్నారు. ఒప్పందం రద్దయితే రు. 150 కోట్లు వ్యాపారం నష్టమౌతుందని, కనుక అవమానాన్ని భరించైనాసరే 18 కోట్ల అప్పుపుచ్చుకొని, బ్రిటన్ అడిగిన మినహాయింపు ఇవ్వవలసిందని. స్వతంత్రపార్టీ సభ్యుల వాదన.

గుంటూరు పొగాకు ఎగుమతి దెబ్బతింటుంది గనుక, బ్రిటన్ పెట్టిన షరతులకు అంగీకరించి ఎలాగైనాసరే, బ్రిటన్‌తో కుదుర్చుకున్న వ్యాపారఒప్పందం రద్దు గాకుండా చూడమంటారు. కాంగ్రెసుసభ్యుడు శ్రీ మద్ది సుదర్శనంగారు.

ఇప్పటికి, ఈ వాదనను ప్రభుత్వం తిరస్కరించినా, ఖచ్చితంగా నిలుస్తుందనే నమ్మకంలేదు ఏదోవిధంగా బ్రిటన్‌తో రాజీపడాలనే ధోరణి ప్రభుత్వ వర్గాలలో ఉంది.

ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని జాతీయం చేసే ఉద్దేశంకాని, విదేశీ కంపెనీలను స్వాధీనం చేసుకునే ఆలోచన కాని లేదని లోగడ ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకటనలు చేసింది, యల్. యన్. మిశ్రా, అదే మంత్రి ఇప్పుడు గత్యంతరం లేక, బ్రిటన్‌పై ఏవో తిరుగు చర్యలు తీసుకుంటామని, చేసిన ప్రకటనను ఎవరు నమ్మగలరు

అమెరికా, బ్రిటన్లు రెండూ భారత రాజకీయ ఆర్థిక వ్యవస్థపై దాడిచేసి, చక్రబంధంలో ఇరికించచూస్తున్నాయి సమగ్రంగా ఆలోచించే ఎవరికైనా ఇది బోధపడుతుంది. ఈ దాడిని తిప్పికొట్టాలంటే అన్నిరంగంలో ఖచ్చితమైన గట్టి వ్యతిరేక చర్యలు తీసుకోవాలి, ఎన్నికల వాగ్దానాలను అమలు జరపాలి. రాజకీయ రంగంలో బంగ్లాదేశ్‌ను గుర్తించి ఆ యోధులకు సర్వవిధాలైన ఆయుధ సహాయం చేయాలి.

ఈ రెండు కర్తవ్యాలను నెరవేర్చక, వెనకడుగు వేసినకొద్దీ ప్రభుత్వం ఏ సమస్యను పరిష్కరించలేదు. అన్ని రంగాలలోనూ సంక్షోభంతీవ్రమౌతూంది సామ్రాజ్యవాదులకు ఇప్పటికే మనం ఆలుసైపోయాము. వారింకను దాడులను తీవ్రతరం చేస్తారు. సర్దుబాటు, లొంగుబాటై - లొంగుబాటు దాసోహమనే స్థితికి దారితీస్తుంది.

భారతప్రభుత్వాన్ని ఆర్థిక, రాజకీయరంగాలలో లొంగదీయటానికి సామ్రాజ్యవాదులు సాగిస్తున్న దాడి ఇది. ఈ రీతిలో దానిని అర్థం చేసుకోబట్టే వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ, ఈ దాడిని ప్రతిఘటించవలసిందిగా ప్రభుత్వంపై వత్తిడి చేస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అనాటి కానాడు జావగారిపోతున్నది.

ఈ దిగజారుడం ఆత్మహత్యాకరం,

బియ్యంతో సోవియట్ నౌకరాక

శరణార్థులకై

కలకత్తా, జూలై 2

బంగ్లాశరణార్థుల సహాయార్థం సోవియట్ యూనియన్ మొదటివిడతగాపంపినబియ్యంతో నిన్న "రెద్వా" నౌక కలకత్తా రేవుకు వచ్చింది.

ప్రస్తుతం ఈ నౌకలో 3576 టన్నుల బియ్యంతో వచ్చింది. మొత్తం సోవియట్ యూనియన్ నుండి 50 వేల టన్నుల బియ్యం వస్తుంది.

'రెద్వా' రాక సందర్భంగా రేవులో ఏర్పాటు చేసిన చిన్నసభలో కలకత్తాలోని సోవియట్ కాన్సల్ డ్యూలిన్ పునరావాసశాఖ సహాయ కార్యదర్శి శ్రీ ల్యూథా పాల్గొన్నారు. ఒక వారం లోపులో సోవియట్ నుండి మరో నౌక వస్తుంది.

4 కోట్ల డాలర్ల సాయం

న్యూఢిల్లీ, జూలై 2

శరణార్థుల సాయానికై జూన్ 29 వరకు ఐరాస శరణార్థుల హైకమిషనర్‌కు 42,304900 డాలర్లు అందాయి.

ఆస్ట్రేలియా క్షుద్బాధ విముక్తి ఉద్యమం నేడు 73.7-0 ఆస్ట్రేలియన్ డాలర్లు విరాళమిచ్చింది.

65వేలమంది రాక

భోపాల్, జులై 2

రాయపూర్ వద్దనున్నమానా శరణార్థులశిబిరాలకు నిన్నటివరకూ 65,436 మంది శరణార్థులు వచ్చారు.

ఈలోగా బిలాస్‌పూర్ జిల్లాలో రెండు శిబిరాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి, ఈ శిబిరాలలో లక్ష మందికి సౌకర్యాలు కలుగుతాయి.

కలరా వ్యాప్తి

న్యూఢిల్లీ, జూలై 2

పశ్చిమ బెంగాల్లోని శరణార్థుల శిబిరాలలో కలరా మరల వ్యాపిస్తున్నది.

జులై 1 న 2,368 మందికి కొత్తగా కలరా సోకిందని ప్రభుత్వప్రతినిధి చెప్పారు. జులై నాటికి మొత్తం 28,959 మంది కలరా వ్యాధికి గురికాగా 4,147 మంది మరణించారు.

పరిస్థితిని అదుపులో పెట్టేందుకు కేంద్రం అదనంగా 50 మంది వైద్యులను పంపుతున్నదనీ ఇతర ఏర్పాట్లు కూడా సాగుతున్నాయని ఆయన చెప్పారు,

ప్రజాభీష్టానికి అనుగుణంగా నూతన రాజ్యాంగం

మిజానుర్ రహ్మాన్ హామీ

అగర్తాలా, జూలై 1

బంగ్లా ప్రజల వాంఛలను ప్రతిబింబిస్తూ ఒక రాజ్యాంగాన్ని రూపొందించగలమని అవామీలీగ్ ప్రధాన కార్యదర్శి మిజానుర్ రహ్మాన్ చౌదరి ప్రకటించారు.

త్రిపుర సరిహద్దులో విముక్త ప్రాంతం నుండి నిన్న ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు. యాహ్యా దురాక్రమణ సేనలను పారద్రోలినఅనంతరం ఈరాజ్యాంగాన్ని పార్లమెంటుకుసమర్పించగలమనిఆయనఅన్నారు.

యాహ్యాఖాన్ రేడియో ప్రసంగంపై మిజానూర్ రహ్మాన్ వ్యాఖ్యానించారు,

బంగ్లా ప్రజలు కులమత వివక్షతలేకుండా బంగ్లా ప్రజా రిపబ్లిక్ ప్రభుత్వంపట్ల విశ్వాసం ప్రకటించారు. యాహ్యాఖాన్ నియమించిన నిపుణులు తయారుచేసే ఏ రాజ్యాంగాన్నయినా వారు చెత్త బుట్టలో వేయడం ఖాయం అన్నారు.

యాహ్యా ఇచ్చే రాజ్యాంగం కొత్త సీసాలో పాత సారా వంటిదన్నారు.

వియత్నాంలో అమెరికా సైన్యాల పెంపు

—రహస్య పత్రాల వెల్లడి

న్యూయార్క్, జూలై 2

అమెరికాలోని ముఖ్య పత్రికలన్నీ పెంటగన్ రహస్య పత్ర కథనాల ముద్రణను నిన్నటి నుండి తిరిగి విస్తృతంగా ప్రారంభించాయి.

1967 లో వియత్నాంకు 2 లక్షల మంది దాకా అదనపు సైన్యాలు పంపాల్సిందిగా వచ్చిన అమెరికా సైనికాధికార విజ్ఞప్తిపై సైనికశాఖకు, పౌర అధికార్లకు తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడ్డట్టు సెయింట్ లూయిస్ పోస్టు నిన్న తెలిపింది.

ఇంకా సైన్యాలను పంపడం అంటే ప్రజలలో మరింత వ్యతిరేకత పెంచడమేనని మెక్ నాటన్ అనే ఉన్నతాధికారి అప్పటి అధ్యక్షుడు జాన్సన్‌కు ఒక మెమొరాండంలో తెలిపారు

ఆ సమయానికి వియత్నాంలో 4 లక్షల 70 వేల నుండి 4 లక్షల 80 వేల దాకా అమెరికా సైన్యాలున్నాయి. ఆ తరువాత రక్షణ మంత్రి మెక్నమారా, వెస్ట్ మోర్ లాండ్‌కు 50 వేల మందిని అమెరికన్ సైన్యాన్ని అదనంగా పంపాడు. దానితో దక్షిణ వియత్నాంలో అమెరికా సైన్యం 5 లక్షల 25 వేలకు పెరిగింది అని ఆ పత్రిక తెలిపింది.

ఇదేవిధంగా వియత్నాం యుద్ధానికి సంబంధించిన అనేక రహస్య పత్రాలను యితర పత్రికలుకూడా ప్రచురించాయి.

బాంబు దాడుల్ని ఎదిరి నిలిచిన వీర వియత్నాం

వాషింగ్టన్, జూలై 2

1965 లో అమెరికా తన సకలబలంతో అధునాతన విమానాలనుండి విచక్షణారహితంగా, నిర్దాక్షిణ్యంగా కురిపించిన బాంబులనుతట్టుకొని వియత్నాం సోషలిస్టు గడ్డ వీరోచితంగా ప్రతిఘటించిన తీరును పెంటగన్ రహస్య పత్రాలు బయటపెట్టాయి

సెనెటర్ మైక్ గ్రావెల్ నేడు మరికొన్ని రహస్య పత్రాలను బయట పెట్టారు. ఉత్తర వియత్నాం ప్రతిఘటనకు బెదిరి, మరింత సాయుధ సంపత్తి వత్తాసుతో ఇంకా క్రూరంగా వ్యవహరించాలని అప్పటి రక్షణ సహాయ కార్యదర్శి జాన్ మెక్‌నాటన్ అప్పటి అధ్యక్షుడు లిండన్ జాన్సన్‌కు సిఫార్సు చేసిన తీరును ఈ పత్రాలు వెల్లడించాయి.

యుద్ధ వినాశంనుండి కోలుకుని సోషలిస్టు ఆర్థిక వ్యవస్థపై పురోగమిస్తూ వియత్నాం శ్రామిక ప్రజ నిర్మించుకున్న ఆనకట్టలు. లాకులనుసర్వనాశనం చేయడానికి సామ్రాజ్యవాదులు పన్నిన కుట్రలన్నీ యీ పత్రాలలో తిరుగులేని విధంగా లిఖితపూర్వక సాక్ష్యాధారాలతో ఉన్నాయి

వరి చేలను, గ్రామాలను ముంపుకు గురిచేయడానికై వరదలు సృష్టించి కృత్రిమ కరువు తెచ్చి వియత్నాం ప్రజలను మలమల మాడ్చి చంపడానికి జాన్సన్ పన్నిన వల ఈ పత్రాలలో ఉంది

అంతర్ రాష్ట్ర మండలి నిర్ణయం వాయిదా

న్యూఢిల్లీ, జులై 2

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాల విషయమై అంతర్‌రాష్ట్ర మండలి నొకదానిని ఏర్పాటుచేయాలన్న ప్రతిపాదనపై కేంద్ర మంత్రివర్గం ఈరోజు ఎట్టి నిర్ణయం తీసుకోలేదు.

రాజమన్నార్ కమిషన్ చేసిన అనేక సిఫారసులలో అంతర్‌రాష్ట్ర మండలి కూడా ఒకటి.

దాదాపు 34 లక్షల హెక్టార్లలో వరిపంట ఉత్పత్తి

1970-71 సంవత్సరంలో

హైదరాబాద్, జూలై 2

1970-71 సంవత్సరంలో 33,95,700 హెక్టార్లలో వరిపంట పండించబడుతుందని అధికార అంచనా వేయబడింది. 1969-70 సంవత్సరంలో 34,69000 హెక్టార్లలో వరి పంట పండించబడింది.

1969-70 సంవత్సరంలో 43,29,700 టన్నులు వరి ధాన్యం ఉత్పత్తికాగా, 70-71 సంవత్సరంలో 46,60,100 టన్నులుత్పత్తి చేయబడుతుందని అంచనా వేయబడింది. ఇది గత సంవత్సరంకంటే 7 శాతం ఎక్కువ.

యం.బి.బి.యస్ ప్రవేశ పరీక్షలు

హైదరాబాద్, జులై 2

యం. బి. బి. యస్. ప్రవేశ పరీక్షలు ఆగస్టులోగాని సెప్టెంబరులోగాని జరుగవచ్చు.

ఇంటర్‌మీడియట్ పరీక్షల ఫలితాల ప్రకటన వెంటనే యీ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి.

ఆరోగ్య, వైద్య సర్వీసుల డిప్యూటీ డైరెక్టర్ శ్రీ సయ్యద్ మహదీహసన్ జఫారీ తమను కలుసుకున్న విద్యార్థులకు నిన్న యీ విషయాన్ని తెలియజేశారు.

వాజ్‌పాయ్ వాగాడంబరం

విజయం తమ భావాలదేనట!

ఉదయపూర్, జులై 3

జనసంఘ్ జనరల్ కౌన్సిల్ సమావేశం నేడు ప్రారంభమైంది. వాజ్‌పాయ్ అధ్యక్షోపన్యాసంలిస్తూ బంగ్లాదేశ్‌కు వీలైన సాయం అందచేయడంతప్ప మరోమార్గం లేదన్నారు.

అవసరమైతే పాక్‌తో యుద్ధానికి కూడా సిద్ధంగా ఉండాలన్నారు

నూతన పదవీ కాలానికి కూడా శ్రీ వాజ్‌పాయ్ తిరిగి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు.

ఆయన తన ప్రసంగంలో హెచ్చు మొత్తం బంగ్లాదేశ్ విషయమై మాట్లాడారు.

ఎన్నికలనుగురించి మాట్లాడుతూ ఈ ఎన్నికలు న్యాయంగా జరగలేదేమో అని అనుమానం ప్రకటించారు

గోలక్ నాథ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పుపై విమర్శలు రావడంపట్ల ఆయన విచారం వ్యక్తపరిచారు. అలా విమర్శించిన వారిలో చాలామంది ప్రజాస్వామ్యవాదులుకాదన్నారు.

పార్లమెంటుసార్వభౌమత్వం నిలుపుకోటం యిప్పుడు ప్రధాన సమస్య కాదన్నారు. కేంద్రంలో పదవిని స్వీకరించే ప్రత్యామ్నాయ పార్టీగా సమర్థవంతంగా కృషిచేసే సమయం తమ పార్టీకి వచ్చిందన్నారు.

ఎన్నికల ఫలితాన్నిబట్టి ప్రజలు వామపక్షం దిశగా మొగ్గుచూపారని అనుకోటం పొరపాటన్నారు

కాంగ్రెస్‌పార్టీ మధ్యతరగతి ప్రజల పార్టీగా ప్రజలముందు నిల్చిందితప్ప, వామపక్షపార్టీగాకాదన్నారు. అసలు ఈభావాలన్నీ జనసంఘ్‌వేననీ, అందువల్ల ఈ విజయం జనసంఘ్ భావాలదేనని చెప్పుకున్నారు.

అయితే ఎన్నికలలో "ఓటమి పొందిన కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోనున్న వారితోటి వారు ప్రభుత్వంపై వత్తిడితెచ్చి మరింత వామపక్షం దిశగా తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నించే అవకాశం లేకపోలేదని ఆయన 'భయం' వ్యక్తపరిచారు.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులు ప్రమాదకరమట

కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై రాజమన్నార్ కమిటీ సిఫార్సులు ప్రమాదకరమైనవనీ, అవి ప్రాంతీయ తత్వంతో కూడుకున్నాయనీ వాజ్‌పాయ్ అన్నారు. భారత్ ఒక జాతిగా ఉండడానికి ఈ సిఫార్సులు చరమదశ అని ఆయన అన్నారు.

ఇప్పుడు కేంద్రాన్ని మరింత దృఢపర్చుకోవాలన్నారు.

అంటే అంతమాత్రంచేత రాష్ట్రాలు బలహీనంగా ఉండాలనేది తన అభిప్రాయం కాదన్నారు.

ప్రభుత్వరంగాన్ని సగం ప్రైవేటుపరం చేయాలట!

ఉదయపూర్, జులై 3

దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలన్నిటిలోనూ 49 శాతం వాటాలను ప్రైవేటు వ్యక్తులకివ్వాలని జనసంఘ్ కార్యవర్గం తీర్మానంలో కోరింది.

ఇది జాతీయకరణను రద్దు చేయటం మాత్రం కాదనీ, ఇందువల్ల మరింత సమర్థవంతంగా నడుస్తాయని జనసంఘ్ కార్యదర్శి భాయి మహావీర్ అన్నారు.

కార్యవర్గం నిన్న ప్రారంభమైంది.

31 మందిలోను 26 మంది మాత్రం హాజరయ్యారు.

వాజ్‌పాయ్ అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ యజ్ఞనారాయణ గైరుహాజరయ్యారు.

ఈ కార్యవర్గం ఆమోదించిన తీర్మానంలో మరోముఖ్యమైంది "దిగుమతి లైసెన్సులను బహిరంగంగా వేలంవేయాలి" అనేది. ఈవేలంలో అతి హెచ్చుపాట ఎవరు పాడితే వారికే లైసెన్సులు ఇవ్వాలని తీర్మానం పేర్కొన్నది.

మధ్యాహ్నం జరిగిన కార్యవర్గ సమావేశంలో దేశంలో, గత లోక్‌సభ రద్దయిన అనంతరం రాజకీయ పరిస్థితిని గురించి సమీక్షించారు.

నక్సలైట్ల నుంచి 650 ఆయుధాలు స్వాధీనం

హైదరాబాద్, జులై 2

1968 సంవత్సరంలో నక్సలైట్లపై పోలీసు దాడులు ప్రారంభమైన నాటి నుంచి ఇంతవరకు 650 ఆయుధాలు స్వాధీనం చేసుకోబడినవని ఒక సీనియర్ పోలీసు అధికారి నేడిక్కడ చెప్పారు.

నక్సలైట్ల నుంచి ఇంతపెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం వల్ల రాష్ట్రంలో వారి ఉద్యమం దాదాపు సమసి పోయేదశలో వుందని పోలీసు వర్గాలు తెలిపాయి.

ఆ ఆయుధాలు నష్టపోవటంతో పాటు, నక్సలైట్ నాయకులు అనేకమంది మరణించటంగాని, పోలీసులకు పట్టుపడటంగాని జరిగినందువల్ల భవిష్యత్ కార్యాచరణపై నక్సలైట్ కార్యకర్తలలో తీవ్ర విభేదాలు వున్నాయని ఆ వర్గాలు తెలియచేశాయి.

హైదరాబాద్ జిల్లాలో ఆయుధాలస్వాధీనం

సి. ఐ. డి. పోలీసులచే

హైదరాబాద్, జులై 2

హైదరాబాద్‌జిల్లా ధారూర్‌లో రాష్ట్ర నేరపరిశోధకశాఖ పోలీసులు ఇటీవల దాడి చేసి అనేక ఆయుధాలను, స్వాధీనం చేసుకున్నారు

ఈ ఆయుధాలను తయారుచేస్తున్న వ్యక్తి మహారాష్ట్రకు చెందినవాడనీ, గత 6 సంవత్సరాలుగా ధారూర్‌లో నివసిస్తున్నట్లు చెప్పబడుతూంది.

ఈ వ్యక్తి, పోలీసులు దాడిచేసిన సందర్భంలో ఒక పిస్టల్‌ను తయారు చేస్తున్నాడని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ నారాయణరావు పత్రికలవారికి చెప్పారు. ఆ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి, తయారు చేసిన అనేక ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆయన చెప్పారు.

మరికొంత సమాచారం ఆధారంపై దర్యాప్తు జరిపి హైదరాబాద్ జిల్లాలోనూ, మైసూర్‌లోని గుల్బర్గా జిల్లాలోను 23 మంది వ్యక్తులను అరెస్టు చేయటం జరిగిందని 23 ఆయుధాలు స్వాధీనం చేసుకోబడినవని ఆయన తెలియచేశారు.

వీటిలో 12 పిస్టళ్లు, 11 తుపాకులు వున్నవి.

మున్సిపల్ ఎన్నికల నామినేషన్లపై హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూన్ 30

మున్సిపాలిటీలకు జరిగే ఎన్నికలలో ఏక సభ్య నియోజక వర్గంలో పోటీ చేసే ఒక అభ్యర్థి, మరొక అభ్యర్థి పేరును ప్రతిపాదిస్తే ఆ ఇద్దరి నామినేషన్లు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కౌన్సిళ్ళ నిబంధనల (1915) ప్రకారం చెల్లనేరవని రాష్ట్ర హైకోర్టు నేడు తీర్పు ఇచ్చింది.

అభ్యర్థి ప్రతిపాదించకుండా, ఒక ఓటరు ప్రతిపాదించినట్లయితే రెండవ అభ్యర్థి పోటీ చేయవచ్చునని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

బ్రిటిష్ వాణిజ్య సంస్థల జాతీయంపై పరిశీలన

ఒప్పందం రద్దుకు ప్రతీకార చర్యలు : లోక్ సభలో శ్రీ మిశ్రా హామీ

న్యూఢిల్లీ, జూలై 2

కామన్‌వెల్తు దేశాల జౌళి దిగుమతులపై టారిఫ్ విధించేందుకు బ్రిటన్ తీసుకున్న నిర్ణయానికి ప్రతీకార చర్యగా భారతదేశంలోని బ్రిటిష్ వాణిజ్య సంస్థలను జాతీయం చేసే విషయమై ప్రభుత్వం పరిశీలిస్తుందని విదేశీ వాణిజ్యమంత్రి శ్రీ మిశ్రా ఈ రోజు లోక్‌సభలో చెప్పారు.

1939 సంవత్సరపు ఇండియా - బ్రిటిష్ ఒప్పందాన్ని రద్దుచేస్తూ 6 నెలల గడువు నోటీసును బ్రిటిష్ ప్రభుత్వం భారత్‌కు పంపిన విషయంపై లోక్‌సభలో ప్రవేశపెట్టిన సావధాన తీర్మానానికి సమాధానమిస్తూ మంత్రి పైవిధంగా అన్నారు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ మధుకర్, మార్క్సిస్టు సభ్యురాలు శ్రీమతి బి. జి. గోస్వామి, కాంగ్రెస్ సభ్యుడు శ్రీ విభూతి మిశ్రా ప్రభృతులు పై సావధాన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

1939 నాటి ఒప్పందాన్ని బ్రిటన్ ఏకపక్షంగా రద్దుచేయడానికి భారతప్రభుత్వం తన హక్కును వదులుకోదని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ మధుకర్ ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

బ్రిటన్ చర్యకు ప్రతీకార చర్యగా భారత ప్రభుత్వం కామన్వెల్తు నుంచి ఉపసంహరించుకోవాలని మార్క్సిస్టు సభ్యురాలు శ్రీమతి గోస్వామి కాంగ్రెస్ సభ్యులు శ్రీ విభూతిమిశ్రాలు గట్టిగా డిమాండ్ చేశారు.

బ్రిటన్ చర్యపట్ల భారత ప్రభుత్వం తన నిరసనను వ్యక్తం చేసిందని, అయితే ప్రతీకారంగా ఏ చర్యలు తీసుకొనబోయేదీ తాము చెప్పజాలమని విదేశీ వాణిజ్యమంత్రి శ్రీ మిశ్రా సమాధానమిచ్చారు. అయితే భారత్‌లోని బ్రిటిష్ వాణిజ్య సంస్థలను జాతీయం చేసే విషయమై ప్రభుత్వం తప్పక పరిశీలిస్తుందని మాత్రం ఆయన చెప్పారు.

సభ్యులు విమర్శించినట్లు ఈ విషయంలో బ్రిటన్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నమాట నిజమేనని, సభ అభిప్రాయాన్ని ప్రభుత్వం మన్నిస్తుందనికూడా ఆయన చెప్పారు.

బ్రిటన్ తీసుకున్న నిర్ణయంపట్ల హాంకాంగ్ ప్రభుత్వం కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నదని మంత్రి మరొక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఈ విషయమై బ్రిటిష్ ప్రభుత్వం పునరాలోచిస్తుందన్న ఆశాభావం తమ కున్నదని ఆయన అన్నారు.

జౌళి ఒప్పందం రద్దు విషయంలో భారత ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వాన్ని బుజ్జగిస్తున్నదని మార్క్సిస్టు సభ్యులు చేసిన విమర్శను మంత్రి తిరస్కరించారు.

రాజమండ్రి మున్సిపాలిటీకి ఉప ఎన్నిక

నామినేషన్లు దాఖలు

రాజమండ్రి జులై 2

రాజమండ్రి మున్సిపాలిటీ 3 వ వార్డుకు జరుగుతున్న ఉపఎన్నికలో నేడు శ్రీయుతులు వరదా బ్రహ్మానందం, చింతలూరి రామారావు, పెదిరెడ్ల వీరన్న, యస్. వి. చౌదరి నామినేషన్లు దాఖలు చేశారు.

ఈనెల 25 వ తేదీ ఈ ఉప ఎన్నిక జరుగుతుంది. మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీ విడమర్తి వెంకట నరసింహం మృతివల్ల ఈ ఉపఎన్నిక జరుగుతుంది.

కిసింగర్ పర్యటన సందర్భంగా

భారత ప్రభుత్వం ఆత్మగౌరవం నిలుపుకోవాలి

శ్రీ హిరేన్‌ముఖర్జీ డిమాండ్

న్యూఢిల్లీ, జూలై 2

అమెరికానుంచి పాకిస్తాన్‌కు వస్తున్న ఆయుధ నౌకలను వెంటనే ఆపకపోతే నిక్సన్‌కు ప్రముఖ సలహాదారుడైన హెన్రీ కిసింగరి "ఆహ్వాన యోగ్యత"ను కోల్పోతాడని భారత ప్రభుత్వం అమెరికా అధ్యక్షునికి తెలియచెప్పాలని ఈ విషయంలో భారత ప్రభుత్వం ఆత్మగౌరవాన్ని నిలుపుకోవాలని కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ హిరేన్ ముఖర్జీ నేడిక్కడ భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిక్సన్‌కు అగ్రసలహాదారుడైన డాక్టర్ కిసింగర్ జులై 6 వ తేదీన భారత్‌లో పర్యటించనున్న సందర్భంగా శ్రీ ముఖర్జీ యిప్పుడు విడుదలచేసిన ప్రకటనలో పై విధంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం పైవిధంగా చేయలేక పోయినట్లయితే తన విద్యుక్తధర్మ నిర్వహణలో అది దారుణ వైఫల్యం చెందినట్లవు తుందని ఆయన హెచ్చరించారు.

మనం ప్రపంచంముందు సార్వభౌమాధికార దేశంగా నిలబడాలి తప్ప, వ్యక్తిత్వం లేని, గుండెల్లేని గౌరవహీనమైన దేశంగా వ్యవహరించరాదని శ్రీ హిరేన్ హెచ్చరించారు.

మాయమాటలతో భారత ప్రభుత్వాన్ని మోసగించే దురుద్దేశంతో డాక్టర్ కిసింగర్ భారత్‌లో పర్యటించబోతున్నారని ఆయన ఆప్రకటనలో పేర్కొన్నారు.

తన సహనానికి హద్దున్నాయన్న విషయాన్ని అమెరికా ప్రభుత్వానికి భారత్ స్పష్టీకరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాన మంత్రితో బ్రహ్మానందరెడ్డి భేటీ

తెలంగాణా సమస్య ప్రస్తావన

న్యూఢిల్లీ, జూలై 2

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీని నేడుకలుసుకున్నారు. తెలంగాణా సమస్యకు సత్వర పరిష్కార మార్గాన్ని సాధించవలసిన అవసరాన్ని గురించి ప్రధాని శ్రీ రెడ్డికి వివరించినట్లు తెలుస్తున్నది.

30 నిమిషాలపాటు జరిగిన చర్చల సందర్భంగా, ప్రధానమంత్రి నిర్దిష్టంగా ఎలాంటి ప్రతిపాదనను సూచించలేదని తెలుస్తున్నది.

అనంతరం శ్రీ రెడ్డి ప్రణాళికాశాఖ మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ కె. సి. పంత్‌లను కలుసుకున్నారు.

రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక సమస్యలను గురించి ముఖ్యమంత్రి మంత్రులతో చర్చించారు.

తెలంగాణా ప్రాంతం అభివృద్ధికి ప్రధాన మంత్రి సూచించిన అష్టసూత్ర పథకం అమలులో సాధించిన ప్రగతిని గురించి శ్రీ రెడ్డి మంత్రులకు వివరించినట్లు తెలుస్తున్నది.

ఆరబ్ సోషలిస్టు యూనియన్ ఎన్నికలు

కైరో, జూలై 1

ఈజిప్టు అంతటా నేడు అరబ్ సోషలిస్టు యూనియన్‌ను బలోపేతం చేసేందుకు ఎన్నికలు జరుగుతున్నాయి.

60 లక్షల మందికి ఓటు హక్కు వున్నది. 10 మంది చొప్పున సభ్యులుగా ఉండే ప్రాథమిక యూనిట్లకు ప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. ఈ నెల తర్వాత ఈ ప్రాథమిక యూనిట్ల సభ్యులు జిల్లా సభల ప్రతినిధులను ఎన్నుకుంటారు, వారు మరింత ఉన్నతాధికార సంస్థకు నాయకులను ఎన్నుకుంటారు.

గత మేనెలలో అరబ్ సోషలిస్టు యూనియన్ నాయకత్వ సంస్థలన్నీ రద్దుచేయబడ్డాయి. క్రిందినుండి పైవరకూ మరల ఎన్నికలు జరగాల్సి ఉందని అధ్యక్షులు సాదత్ మే నెలలో చెప్పారు.

విద్యార్థులకు ప్రాతినిధ్యం

(1 వ పేజీ తరువాయి)

యింకా సమర్పించలేదు.

విశ్వవిద్యాలయ ఎకడమిక్ కౌన్సిల్స్‌లో ప్రాతినిధ్యం యివ్వక పోయినప్పటికీ, కౌన్సిల్స్ కార్యవర్గాలకు, కోర్సుల విధానానికి సంబంధించిన వ్యవహారాలలో విద్యార్థుల సలహాలను స్వీకరించవచ్చని యీ సంఘం అభిప్రాయపడింది'

వైస్ ఛాన్సలర్‌కుగాని లేక విశ్వ విద్యాలయ అధికారికిగాని తమ అభిప్రాయాలను. సూచనలను చేసే హక్కు విద్యార్థి సంఘాలకు వుండాలని యీ సంఘం సిఫార్సుచేసింది.

విశ్వవిద్యాలయాల కోర్టు (సెనేట్)లో 100 నుండి 150 వరకు సభ్యులుండవచ్చని, యూనివర్సిటీ స్థాయి, శాఖలు, కళాశాలల సంఖ్య ప్రాతిపదికపై యీ సభ్యులుండాలని కమిటీ సూచించింది.

సెనేట్‌లో విద్యార్థులు 10 నుండి 15 శాతం వరకు వుండాలని సిఫార్సు చేసింది, దీని వలన విశ్వ విద్యాలయానికి సంబంధించిన పెక్కు వ్యవహారాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చు. అంతేగాక దామాషా ప్రాతినిధ్యంపై కార్యవర్గ మండలులకు ఎన్నికలు జరుగుతున్నందున, 15 శాతం వున్న విద్యార్థులు ఎన్నికలలో కీలకమైన పాత్రను నిర్వహించవచ్చు.

విశ్వవిద్యాలయాలలో విద్యార్థుల అడ్మిషన్లకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేయాలి. అడ్మిషన్ల వ్యవహారాలు ప్రజలకు ఎంతో అసంతృప్తికరంగా వున్నందున యీ చర్య ఎంతో అవసరం ఒక ఆర్డినెన్సు ద్వారా యీ అడ్మిషన్ కమిటీలను ఏర్పాటు చేయాలి. కళాశాలలో విద్యార్థులకు సీట్లు యిచ్చే విషయమై యీ కమిటీలు ఒక విధానాన్ని రూపొందించాలి సీట్లుతక్కువై విద్యార్థుల సంఖ్య ఎక్కువవుతున్నందున యీ కమిటీల అవశ్యకత ఎంతైనా వున్నది.

వైస్‌ఛాన్సలర్, కొందరు డీన్లు, కొందరు ప్రిన్సిపాల్స్, వైస్ ఛాన్సలర్ నామినేట్‌చేసే కొందరు ఉపాధ్యాయులతో యీ కమిటీ ఏర్పడాలి. రిజిస్ట్రార్ కార్యదర్శిగాను, వైస్ ఛాన్సలర్ అధ్యక్షుడిగాను వుండాలి,

విద్యార్థుల అడ్మిషన్లు నిష్పక్షపాతంగాను, అందరికీ ఆమోద యోగ్యంగాను వుండాలి, ఎలాంటి పలుకుబడికి, ఆశ్రిత పక్షపాతానికి యిందులో చోటివ్వరాదని యీసంఘం స్పష్టంచేసింది,

స్వయంప్రతిపత్తిగల కళాశాలలు

కళాశాలలకు స్వయం ప్రతిపత్తిని యివ్వాలని ఈ సంఘం సూచించింది.

కొన్నికళాశాలలనుఎన్నుకొనిఈవిధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టాలని కోరింది.

కళాశాలలకు స్వయం ప్రతిపత్తి యివ్వాలని విద్యాశాఖ కమిషన్ 5 సంవత్సరాల క్రితమే సూచించి నప్పటికీ, ఆ నిర్ణయం యింతవరకు అమలుజరగనందుకు విచారాన్ని వెల్లడించింది.

రు. 90 కోట్ల విరాళాలు

శరణార్థుల సహాయార్థం

కలకత్తా, జులై 2

బంగ్లాదేశ్ శరణార్థుల సహాయార్థం ప్రపంచంలోని వివిధ దేశాలనుండి ధన, వస్తురూపంలో ఇంతవరకూ రు. 90 కోట్ల మేరకు విరాళాలు అందాయని అధికార ప్రతినిధి నేడిక్కడ తెలియజేశారు.

శరణార్థుల బాధలను తొలగించే నిమిత్తం సహాయం చేయవలసిందిగా ఐ. రా. స. ప్రధానకార్యదర్శి ఉథాంట్ విజ్ఞప్తి చేసినప్పటి నుండి వివిధ దేశాలనుండి విరాళాలు అందుతున్నాయని తెలిపారు. వివిధ ప్రభుత్వాలతో పాటు ప్రయివేటు సంస్థలుకూడా విరాళాలు పంపుతున్నాయని అన్నారు.

రాజభరణాల రద్దుకు రాజ్యాంగ సవరణ

పంజాబుకాంగ్రెసు డిమాండ్

చండీఘర్, జూలై 1

రాజభరణాల రద్దుకు, ఐ.సి.యస్. ఆఫీసర్ల ప్రత్యేక సౌకర్యాల రద్దుకు రాజ్యాంగాన్ని వెంటనే సవరించాలని పంజాబ్ కాంగ్రెసు డిమాండ్ చేసింది.

రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గం గతిరాత్రి సమావేశమై ఒక ఆర్థిక తీర్మానం చేసింది. ఆర్థిక తీర్మానంలో యీ డిమాండ్ చేయబడింది.

పట్టణ ఆస్తులపై పరిమితిని విధించాలని కార్యవర్గం డిమాండ్ చేసింది.

యాంత్రీకృత వ్యవసాయ క్షేత్రాలు, పళ్ళ తోటలు ధర్మ సంస్థలకు భూగరిష్ఠ పరిమితి చట్టంలో గల మినహాయింపులను రద్దు చేయాలని కార్యవర్గం కోరింది.

సింహళంలో యువతరం తిరుగుబాటు—3

సింహళంలో ఇటీవల యువతరం చేసిన తిరుగుబాటును అణచివేయడానికీ తన సాయుధ బలాన్ని పెంపొందించుకోడానికీ గాను సింహళ ఐక్యసంఘటన ప్రభుత్వం భారతదేశ సహాయాన్ని, సోవియట్ యూనియన్‌తో బాటు సోషలిస్టు దేశాల తోడ్పాటును, అమెరికాతోబాటు పలు పెట్టుబడిదారీ దేశాల సహకారాన్ని అర్థించింది. "ఇంతవరకూ ఉన్నట్లుగా సైనికంగా ప్రమత్తులమై ఉండటానికి మేము సిద్ధంగాలేము" అని తన ఏప్రిల్ 24 వ తేదీ రేడియో ప్రసంగంలో సింహళ ప్రధానమంత్రి సిరిమావో స్పష్టం చేసింది.

అయితే, తిరుగుబాటుదార్లకు వ్యతిరేకంగా తీసుకోబడిన సైనిక చర్యల్లో నేటిలోనూ కూడా విదేశీ సైనిక బలగాలేవీ ఉపయోగింప బడలేదు. భారతదేశం పంపిన హెలికాప్టర్లు పోరాటేతర రవాణా ప్రయోజనాలకుమాత్రమే వినియోగింప బడ్డాయి. కటునాయకే విమానాశ్రయంలోని తమ సాధన సామగ్రి పరిరక్షణకు మాత్రమే భారత సేనలు ఉపయోగింప బడ్డాయి.

లేమాండే ఫ్రెంచి (వారపత్రిక ఇంగ్లీషు ప్రతి-జూన్ 3, 9 తేదీ) పత్రికకు యిచ్చిన యింటర్‌వ్యూలో సిరిమావో బండారునాయకే యిలా స్పష్టంచేసింది:

"ఇటీవల మనదేశంలో జరిగిన ఘటనల అనుభవం దృష్ట్యా, అటువంటి ఘటనలను తగిన స్థాయిలో ఎదుర్కొడానికి అవసరమైన ప్రమాణంలో మనభద్రతాదళాల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం నిశ్చయించుకొంది. అందుకుగాను సైనిక సామగ్రిని, పరికరాలను కొనడం అవసరం.

"మనకు కావలసిన సైనిక సామగ్రిని సరఫరాచేస్తామని అనేక దేశాలు ముందుకు వచ్చాయి. వాటిలో సోవియట్ యూనియన్ సూచించిన షరతులు మనకు అత్యంత అనుకూలంగా ఉన్నందున వాటిని ఆమోదించాం."

తన ఏప్రిల్ 24 వ తేదీ రేడియో ప్రసంగంలోనే, "మమ్మల్ని ఆదుకోడానికి గాను తీసుకొన్న సత్వర చర్యలకు గాను", భారత్, బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్, ఐక్య అరబ్ రిపబ్లిక్, పాకిస్తాన్, యుగోస్లావియా దేశాల ప్రభుత్వాలకు సిరిమావో తన కృతజ్ఞతలను ప్రకటించింది

"తమకు సహకారాన్ని ప్రకటిస్తూ చేసిన గట్టి ప్రకటనలకు గాను" కెనడా, పశ్చిమ జర్మనీ, తూర్పు జర్మనీలకుకూడా సిరిమావో కృతజ్ఞత వెల్లడించింది,

చౌ ఎన్ లై లేఖ

విచిత్రమైన విషయమేమిటంటే (అనూహ్యమనిపిస్తే యిందులో విచిత్రం ఏమీ లేదేమో కూడా.) సింహళానికి సహాయం చేసిన దేశాలని, చేస్తామన్న దేశాలని సిరిమావో పేర్కొన్న జాబితాలో చైనా ప్రజా రిపబ్లిక్ పేరు లేకపోవడం! ఈ పరిస్థితిని చక్కదిద్దుకోడానికీ, ఈ మచ్చ మాపుకోడానికీ, ఎప్పుడో మే మాసం రెండవ పక్షంలో చైనా ప్రజారిపబ్లిక్ ప్రధాన మంత్రి సిరిమావో బండారునాయకేకు ఒక లేఖ వ్రాస్తూ, తన ఆర్థిక యిబ్బందులను గడచి గట్టెక్కేందుకుగాను సింహళానికి 15 కోట్ల రూపాయల రుణమివ్వడానికి తన సంసిద్ధతను తెలియచేశాడు. ఈ ఒప్పందంపై మే 27 వ తేదీన సంతకాలు జరిగాయి.

సిరిమావోకు చౌఎన్‌లై రాసిన లేఖ మే 26వ తేదీన కొలంబో పత్రికల్లో ప్రకటింపబడింది. ఆసక్తికరమైన ఆ లేఖ యీక్రింది విధంగా సాగింది:

"తమనుతాము "చే గెవారా అనుచరులమని పిలుచుకొన్న కొద్దిమంది వ్యక్తులు (వీరిలోవిదేశీ గూఢచారులు కూడ దూరినట్లు వినికిడి) సృష్టించిన కల్లోల పరిస్థితిని అదుపులో పెట్టినందుకు సంతోషం."

చైనా-సింహళ దేశాల మధ్య గల మైత్రిని చైనా ప్రభుత్వం, చైనా ప్రజలూ "గొప్ప సంపద"గా పరిగణిస్తున్నారని కూడా ఆ లేఖ పేర్కొంది. "దురుద్దేశపూరితులైన ఎవ్వరూ, ఎన్నడూ కూడా మన రెండు దేశాలమధ్యా పొరపొచ్చాలు తెచ్చి, మన మైత్రిని భంగం చెయ్యలేరు."

చైర్మన్ మావో బోధనలకు అనుగుణంగా తాము జరిపిన సుదీర్ఘ విప్లవపోరాట క్రమమంతట్లోనూ, తాము ఒకవంక అగ్రవాదానికీ మరోవంక మితవాద అవకాశవాదానికీ వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నామని కూడా ఆ లేఖ పేర్కొంది.

అయితే, యిందుకువిరుద్ధంగామార్క్సిస్టు పార్టీ పత్రిక పీపుల్స్ డెమోక్రసీ తన మే 9 వ తేదీ సంచికలో సింహళానికి వివిధ ప్రభుత్వాలు చేసిన ఆయుధ ఆర్థిక సహాయాలను గురించి యిలా రాసింది. "సింహళ ప్రభుత్వం తన ప్రజలను అణచడానికిగాను సామ్రాజ్యవాద దేశాలు యిన్నేళ్ళూ ఆయుధ సహాయం చేస్తూవచ్చాయి. ఇందిరా గాంధీ ప్రభుత్వం సైతం యిప్పుడదేనేరం చేసింది" "తానే వర్గానికైతే ప్రాతినిధ్యం వహిస్తోందో, సింహళానికి చెందిన అదే వర్గానికి సింహళంలో ఉద్యమాన్ని అణచివేయడానికి ఇందిరాగాంధీ ప్రభుత్వం నిస్సంకోచంగా సకల సౌకర్యాలూ సింహళ ప్రభుత్వానికి కల్పిస్తోంది" అని కూడా ఆ పత్రిక పేర్కొంది.

మార్క్సిస్టుపార్టీ వాదం మేరకు సోవియట్ యూనియన్, చైనాలుసైతం సామ్రాజ్యవాదులు ఒడిగట్టిన నేరానికే ఒడిగట్టాయన్నమాట! ఇటువంటి అర్థ రహితమైన అసందర్భపు వాదాలు చెయ్యటం మార్క్సిస్టుపార్టీకి కొత్తేమీ కాదు. తన వాదానికి తోడు తెచ్చుకొనేందుకు సింహళంలోని "తిరుగుబాటు"ను బలపరచిన ఒక్క "విప్లవ ప్రభుత్వం"గాని, పార్టీగాని, [illegible] మార్క్సిస్టుపార్టీకి దొరకలేదు పాపం!

* * *

సింహళంలో యువకులు జరిపిన తిరుగుబాటుకు సంబంధించిన మిక్కిలి గమనార్హమైన కీలక విషయం, దానికి వారెంచుకున్న తరుణం.

సింహళంలోని స్వార్థపర శక్తులు జరిపే రాజకీయ కుతంత్రాలకు, ఆర్థిక విచ్ఛిన్న చర్యలకు వ్యతిరేకంగాను ప్రత్యేకించి యువజనుల సమస్యలను, మొత్తంమీద ప్రజాసామాన్యం సమస్యలను పరిష్కరించడానికే, సింహళ ఐక్యసంఘటన ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవ ప్రారంభించిన వెంటనే యీ తిరుగుబాటు ప్రారంభమైంది

ఏది ఏమైనప్పటికీ, ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని గట్టిగా కదలించడానికీ, సామాజిక ఆర్థిక సంస్కరణల ప్రాధాన్యతాక్రమాన్ని దానిచేత గుర్తింపచెయ్యడానికీ యీ తిరుగుబాటు ఉపయోగపడింది. కాని తిరుగుబాటు ఉద్దేశం మటుకు ప్రజల ప్రయోజనాలకు ప్రతికూలమైనదనడం నిస్సందేహం. ప్రశాంతంగా ఉన్న సింహళ ద్వీప జీవిత విధానాన్ని యీ తిరుగుబాటు మార్చివేసింది. దేశ, విదేశీ అభివృద్ధి నిరోధక స్వార్థపరశక్తులు తమ తమ బలాన్ని పెంపొందించుకోవడానికి యీ తిరుగుబాటు అవకాశం కల్పించింది.

బడా బూర్జువావర్గానికి చెందిన పత్రికలు యీ తిరుగుబాటుకు యిచ్చిన విస్తృత ప్రచారం మూలంగా సింహళంలోని వామపక్ష శక్తులు దేశ, విదేశాల్లో నవ్వులపాలయ్యాయి. సింహళానికీ, సోషలిస్టు దేశాలకీ మధ్య పెంపొందిన మైత్రిని భగ్నం చెయ్యడానికీ, తాను తీసుకొన్న ప్రగతిశీల చర్యలకు ప్రభుత్వం తిలోదకాలిచ్చేలా చూసేందుకూ, లేక నిరవధికంగా వాయిదా వేయించేందుకూ అభివృద్ధి నిరోధకశక్తులు ప్రస్తుతం కృషిచేస్తున్నాయి. సింహళ ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడిని తీసుకురావడానికీ, ఆర్థిక రంగంలో సింహళం సామ్రాజ్యవాద దేశాలపైన, పెట్టుబడిదారీ దేశాలపైన మరింతగా ఆధారపడేలా చెయ్యడానికీ ఈ అభివృద్ధి నిరోధక శక్తులు తంటాలు పడుతున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యమార్కెట్‌లో తనకు గల పరపతిని నిలుపుకోవాలంటే సింహళ ప్రభుత్వం తన రూపాయి మారకం విలువను మరోమారు తగ్గించుకోవాలని అంతర్జాతీయ ద్రవ్య సంస్థ (ఐ. ఎమ్. ఎఫ్.) ఒత్తిడి చేస్తోంది.

శ్రీలంక ఫ్రీడమ్‌పార్టీ పత్రిక అయిన ది నేషన్, "సింహళ ఆర్థిక వ్యవస్థను బలపరచిన దానికి ప్రతిఫలంగా ఐ. ఎమ్. ఎఫ్ గొంతెమ్మ కోర్కెలు కోరుతోందని ఆరోపించింది.

వామపక్ష శక్తుల తొలగింపుకు కుట్ర

జరిగిన యీ ఘటనలను మాటుపెట్టుకొని ప్రభుత్వం నుండి వామపక్ష శక్తులను తొలగించడానికీ, ఐక్య సంఘటనను విచ్ఛిన్నం చెయ్యడానికీ, మితవాద, పెట్టుబడిదారీ శక్తులతో కూడిన 'జాతీయ ప్రభుత్వం' స్థాపించడానికీ సింహళంలోని విరోధక శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రస్తుత అభివృద్ధి దశలో జాతీయ ప్రజాస్వామ్యవ్యవస్థ స్థాపనకు అవకాశమున్నదని రుజువుచేసి, జాతీయ ప్రగతిశీల శక్తులతో బాటు కమ్యూనిస్టులు కూడా వున్న ప్రభుత్వాన్ని ఆసియా ఖండంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి సోషలిస్టేతర దేశంగా ప్రశస్తిగాంచిన సింహళం ప్రత్యేక ప్రతిపత్తికి స్వస్తి చెప్పాలని వారి ప్రయత్నం. సింహళంలో సాహసోపేతమైన ఒక ప్రయోగం జరుగుతోంది. దాన్ని మట్టుపెట్టాలన్నదే అభివృద్ధి నిరోధక శక్తుల ఆశయంలా కనిపిస్తోంది.

సాధన ముఖర్జీ

సింహళంలో అగ్రవాదుల ఆశయానికీ భారతదేశంలోని మార్క్సిస్టుల ఆశయానికీ అభివృద్ధి నిరోధకుల పైఆశయానికీ సన్నిహితమైన పోలికలు కనిపిస్తున్నాయి

మార్క్సిస్టుపార్టీ వారి పత్రిక పీపుల్స్ డెమోక్రసీ (మే 9 వ తేదీ) యిలా రాసింది.

"ఆమె ప్రభుత్వ విధానాల్లో ప్రతిబింబించిన మేరకు సిరిమావో బండారు నాయకే 'సోషలిజం' పారిశ్రామిక, వ్యవసాయక రంగాల్లో స్వార్థపర శక్తులను బలపరచడానికీ, సింహళ ఆర్థిక వ్యవస్థపై విదేశీగుత్త సంస్థల కబంధ కౌగిలి మరింత బిగవడానికీ మాత్రమే ఉపయోగపడింది."

మార్క్సిస్టుపార్టీ సిద్ధాంతవేత్తల రచనల్లో వాస్తవాలకోసం వెతకడమంటే ఎండమావుల్లో నీళ్ళకోసం వెతుక్కున్నట్లే. లేకుంటే సింహళంలో గతపన్నెండుమాసాల ఐక్యసంఘటన ప్రభుత్వ పాలనా కాలంలో విదేశీ గుత్తశక్తులు, దేశీయ స్వార్థపర శక్తులు [illegible] బలహీనపడ్డాయనీ, అందుచేతనే ఈ ప్రభుత్వాన్ని పడగొట్ట ప్రయత్నిస్తున్నారనీ వారు గుర్తించి యుండే వారు.

వాస్తవ విషయ పరిజ్ఞానంలేని విమర్శ

అదే వ్యాసంలోని యీ క్రింది భాగాన్ని చూడండి. "అటువంటిపాలనలో 'శీఘ్రమైన' సాంఘిక సంస్కరణల విషయం చెప్పవలసి వుంటే అర్థరహితమైన వాగాడంబరమే. సిరిమావో ప్రభుత్వం [illegible], దళితులకు తోడ్పడేందుకుగాను ఉచిత విద్యను, సాంఘిక భద్రతను సంబంధించిన కొన్ని చర్యలు తీసుకున్నమాట నిజమే. కాని, దీనతనాన్ని, నిరుద్యోగాన్ని తొలగించేందుకు తోడ్పడే మౌలిక సంస్కరణలు చేపట్టడానికి మాత్రం సిరిమావో ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చెయ్యలేదు."

ఉచిత విద్యా సౌకర్యాన్ని కల్పించినది ప్రస్తుత ఐక్యసంఘటన ప్రభుత్వం కాదనీ, యీ సౌకర్యం సింహళంలో 1945 నుండి సుమారు 26 సంవత్సరాలుగా అమల్లో ఉందనీ కూడ 'పీపుల్స్ డెమోక్రసీ'కి తెలియదు. పోతే, దీనతనాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి ప్రయత్నమే జరగలేదనడం పచ్చి అబద్ధం. సింహళంలో 'జాతీయ విముక్తి పెరమున' ప్రచారంలో పెట్టిన అబద్ధం సరిగా యిదే.

"భారత రివిజనిస్టుల దాకా" అంటూ ఆ వ్యాసం ఎప్పటిలాగే న్యూ ఏజ్ పత్రికపై దుమ్మెత్తిపోస్తూ యిలా రాసింది: "బూర్జువా, భూస్వామ్యశక్తుల ప్రయోజనాల రక్షణకు తన ప్రభుత్వం కావలి శక్తిగా వ్యవహరించినట్లు బండారునాయకే ప్రభుత్వమే అంగీకరించింది. అయితేనేం, యీ కార్మిక వర్గ ద్రోహులు మాత్రం యీ బూర్జువా ప్రభుత్వాలే "సోషలిజానికి శాంతియుత పరివర్తన"ను సాధిస్తాయని డప్పుకొట్టడం మానరు. ఆయా ప్రభుత్వాలనేతలు తాము ప్రగతిశీలురమని ప్రకటించుకొన్నంత మాత్రాన, ఆ ప్రభుత్వాల వర్గ స్వభావాన్ని విస్మరించవచ్చునంటే మార్క్సిస్టు - లెనినిస్టు ప్రాతిపదిక సూత్రాలకు తిలోదకాలివ్వడమే."

ఇది చాలదన్నట్లుగా మే 30 వ తేదీన పీపుల్స్ డెమోక్రసీ మరో వ్యాసం ప్రకటిస్తూ క్రింది ఆరోపణలను జోడించింది:

"శ్రీమతి సిరిమావో బండారునాయకే నాయకత్వాన గల బూర్జువా-భూస్వామ్య ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండటం ద్వారా లంక సమసమాజ్‌పార్టీ, సింహళ కమ్యూనిస్టుపార్టీ వంటి పార్టీలు, ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక కార్యక్రమాలు అమలు జరగడానికి బూర్జువా, భూస్వామ్య వర్గాలతో చేతులు కలిపాయి తద్వారా అవి ప్రజల ఆశలను ఆశయాలను, ఆకాంక్షలనూ అర్థం చేసుకోడానికి నిరాకరించాయి; వాటిని నెరవేర్చడానికి తిరస్కరించాయి. అందులోనూ, కమ్యూనిస్టుపార్టీ విషయం చూసినట్లయితే, మిశ్రమ మంత్రివర్గం చేసిన వాగ్దానాలవల్ల ప్రజలకు గల భ్రమలు శీఘ్రంగా తొలగిపోతున్న విషయాన్ని యీ వర్గ సాంకర్య ఫలితంగా సింహళ కమ్యూనిస్టుపార్టీ బొత్తిగా గ్రహించలేక పోతోంది."

లంక సమసమాజ్‌పార్టీగాని, సింహళ కమ్యూనిస్టుపార్టీగాని సింహళ ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక చర్యలను బలపరచిన ఒక్క సందర్భాన్నయినా పేర్కొని పీపుల్స్ డెమోక్రసీ పత్రికను సవాలు చెయ్యాలని ఎవరైనా కోరుకోవడం సహజం. కాని మార్క్సిస్టు పార్టీ ఆరోపణల్లో ఆవగింజలో అరవయ్యోవ వంతైనా సత్యం ఉంటే కదా అలా సవాలు చెయ్యవలసిన అవసరం ఏర్పడేది!

ప్రజలను కూడగట్టవలసిన అవసరాన్ని తిరస్కరించి, అసంతృప్తులైన యువకులకు కేవలం సాయుధ తిరుగుబాటు విషయమే నూరిపోసి జాతీయ విముక్తి పెరమున వారిని తన పతాకచ్ఛాయల్లో సమీకరించిందనిచెప్తూ ఆ వ్యాసం యింకా యిలా పేర్కొంది.

"సాంప్రదాయక వామపక్షపార్టీల పార్లమెంటరీ భ్రమలు, మరోవంక దుస్సాహసిక అగ్రవాదం. ఫలితమేమిటయ్యా అంటే, స్వార్థపర శక్తులు, విదేశీ సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికా గూఢచారి సంస్థ సి.ఐ.ఎ పలుకుబడి పెరగడం."

ఓహోహో, ఎంత భేషైన సూత్రీకరణ! మరైతే "మడికట్టుకొన్న" యీ మార్క్సిస్టు పార్టీ కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అధికారాన్ని పంచుకోడానికీ, 'పార్లమెంటరీ భ్రమల'తో మలినం కావడానికీ ఐక్యసంఘటనల్లో చేరడంద్వారా ఎందుకు తయారైనట్లు? ఆ మాటకొస్తే, కొద్ది నెలల క్రితం వరకూ ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని మార్క్సిస్టుపార్టీ ఎందుకు బలపరిచినట్లు? "వర్గ స్వభావం" విషయాన్ని అప్పుడు వీరు ఏ తుంగలో తొక్కినట్లు?

* * *

మార్క్సిస్టుపార్టీ సూత్రీకరణల మాట ఎలా ఉన్నా, యీ తిరుగుబాటుకు సంబంధించిన మేలొకటి ఉందనీ, దానికి విశేషమైన ప్రాముఖ్యత ఉందని మనం గుర్తించాలి! ప్రగతిశీల శక్తుల్లో ఉన్నతస్థాయిలో ఉన్న రాజకీయ చైతన్యం, టెరరిస్టులకు, అభివృద్ధి నిరోధకులకూ వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అగ్రశ్రేణిలో ఉన్న కార్మికవర్గంలో రాజకీయ చైతన్యస్థాయి.

అధిగమించాల్సిన సమస్యలు

రాజకీయ, సాంఘిక, ఆర్థిక రంగాల్లో తీవ్రమైన మార్పులు సత్వరమే సాధింపబడాలన్న గుర్తింపుకు, ఈ తిరుగుబాటు వల్ల కలిగిన దుష్ఫలితాలను పూర్తిగా కాకుంటే, పాక్షికంగానైనా తొలగించడానికి అవసరమైన, ఉచితమైన కొత్తచర్యలు తీసుకోడానికి ఉపయోగింపబడాలి. మార్గం మాత్రం మే 9 వ తేదీ వ్యాసంలో పీపుల్స్ డెమోక్రసీ పేర్కొన్నట్లు జనప్రజాస్వామ్యం కాదు. సింహళం తన స్వంత పద్ధతిలో అమలు జరుపబూనుకున్న జాతీయ ప్రజాస్వామ్యమే అసలైన మార్గం.

తిరుగుబాటు ఉద్యమ ఫలితంగా కార్మికుల్లోను, ముఖ్యంగా తోటల కార్మికుల్లోను ఆహార పదార్థాల ఉత్పత్తిని పెంచాలన్న చైతన్యం ఏర్పడింది. 1970 సంవత్సరంలో సింహళం దిగుమతులు యిదివరకెన్నడూ లేనంతగా పెరిగాయి. బియ్యం 626,000 టన్నులు, గోధుమపిండి 389,000 టన్నులు, చక్కెర 240,000 టన్నులు దిగుమతి చేసుకోబడ్డాయి. ఈ మూడు సరుకుల మొత్తం విలువ రు. 73 కోట్లు. సింహళం తన ఎగుమతుల ద్వారా సంపాదించుకొనే మొత్తంలో యిది పెద్ద భాగం.

సింహళంలో ప్రస్తుతం 35 లక్షల ఎకరాల భూమి సాగులో వుంది. మరో 32 లక్షల 60 వేల ఎకరాల అటవీ భూములను కూడా సాగుచేసే అవకాశం ఉందని ఇటీవల సింహళంలో తోటల కార్మిక సంఘాల అన్నిటికన్న పెద్దది సింహళ ప్రభుత్వానికి ఇచ్చిన ఒక మెమోరాండంలో సూచించింది. సౌకర్యాలు కల్పించబడినట్లయితే సింహళంలో అనేకచోట్ల ధాన్యాన్ని, కూరగాయలను పండించే అవకాశాలున్నాయి. మెట్టప్రాంతాలను చెరకు ఉత్పత్తికి వినియోగించుకోవచ్చు.

కార్మికులకు భూవసతి

అందుచేత, తోటలకు చేరివున్న గయాళు భూములను, అటవీ భూములను తోటల కార్మికులకు కేటాయించి, వారికి విత్తనాలను, ఎరువులను ప్రభుత్వం సప్లయి చేసినట్లయితే విస్తారమైన బంజరు ప్రాంతాలు సాగులోకి వస్తాయని తోట కార్మికుల సమైక్య సంఘం సూచించింది.

* * *

సింహళంలో యిటీవల జరిగిన తిరుగుబాటు మూలంగా సింహళానికి వాటిల్లిన నష్టం రు. 60 కోట్లుగా అంచనా వెయ్యబడింది. ఈ నష్టాన్ని పూడ్చుకోవడం ఏమంత కష్టమైన పనికాదు. అయితే, యీ తిరుగుబాటు ఫలితంగా సింహళ సాంఘిక రాజకీయ జీవితంపై ఏర్పడిన గాయాన్ని మాన్పుకోవడమన్నది అంత తేలికైనపనేమీకాదు. అంతేకాదు. ఈ తిరుగుబాటుసందర్భంగా సింహళ సాయుధ బలాలకు ద్విముఖమైన బాధ్యత-ఒకటి శాంతి రక్షణైనది, మరొకటి శిక్షను అమలుపరిచేది-మొదటిసారిగా అప్పగింపబడింది. దీని ఫలితాలు, పర్యవసానాలు ఎలా ఉంటాయో ఊహించడం కష్టం.

సింహళంలో "యువతరం యుద్ధం" మంచి చెడ్డల మాట ఎలా ఉన్నా ఒక్క విషయం మటుకు స్పష్టం. పాతతరానికి యువతరానికిమధ్య యిందెన్నడూ లేనంత పెద్దగండి ఏర్పడింది. ఇటీవల జరిగిన ప్రభావం, దాని స్మృతి చిరకాలం ఉంటాయి, చరిత్ర పరిశీలించిచూస్తే, ఏ దేశంలోనూ కూడా యువతరంలో యింత పెద్దభాగం సమాజంలోని యితర విభాగాలతో (సింహళం మొత్తం జనాభా 1 కోటి 30 లక్షల మందిలో 60 శాతం మంది 25 ఏళ్ళలోపు వారు) వేరుపడిపోయారు.

సింహళంచిరకాలంగా శాంత్యహింసల నవలంబించే బౌద్ధమతావలంబియైన దేశం. అలాంటి దేశంలో యిటీవల విస్తృత స్థాయిలో హింసాకాండ, రక్తపాతం, ద్వేషం, క్రౌర్యం విలయనృత్యం చేశాయి. వాటిఫలితంగా సింహళ ప్రజల మనసులపై తగిలిన గాయాలు మానుపట్టడానికీ, పాతతరానికీ, యువతరానికీమధ్య ఏర్పడిన పరస్పర అనుమానాలు తొలగిపోడానికీ చాలా కాలం పడుతుంది. అయినా, పరిస్థితులు పూర్వపు స్థితికి పునరుద్ధరింపబడటం మటుకు ఎన్నడూ సాధ్యంకాదు.

సమాప్తం

(జూన్ 27 వ తేదీ, న్యూఏజ్)

నా లోకం

ఎందుకలా నన్ను చూసి
అదేపనిగ నవ్వుతావు?
అక్షరాల నిజముయ్యా
నే నిప్పుడు చెపుతున్నది
నా ఊహాల లోతుల్లో
దావాగ్నులు నిండినాయి
ఆశయాల నందనవని
చివురించుటలే దిప్పుడు!
అనుక్షణం అనుభవాలు
రగిలించే వేదనలో
నా లోకపు ప్రగతిగూర్చి
నేనేమీ చెప్పలేను!
బుద్ధుడు పుట్టిన ధాత్రికి
లుబ్ధులు శౌనకర్తలు
నూతిలోని కప్పల్లా
నీతి కథలు పఠిస్తారు!
శోషలేక సాగిస్తూ
సోషలిస్టు మంత్ర జపం
ఆచరణకు తిలాంజలులు
అర్పిస్తూ రనునిత్యం
లౌకిక రాజ్యాంగానికి
ఘూకాలే వ్యాఖ్యాతలు
నాకం కాలే కాదిది
నరకానికి ప్రతిరూపం!
సాదా మనుషుల బాధలు
వీళ్ళకు తెలిక విషయం
వాళ్ళనుగూర్చిన యోచన
చేయడమే కటిక విషం!
లంచాలకు పేరొందిన
పంచాయతీ పాలనలో
సాహాయిల పాలపొడికి
ప్రెసిడెంట్లే వ్యవహర్తలు!
నానా విధ రాజకీయ
నాటక రంగానుకూల
చక్రవర్తు లెవరిక్కడ-
చీకటి వీధికి రాజులు!
ఇంకా ఏమని చెప్పను
నా లోకపు ప్రగతిగూర్చి
పట్టెడు మెతుకులకోసం
పడుపువృత్తి స్వీకరించి
పలుబాముల దురపిల్లే
పడుచుపిల్ల తీపికలల
నేమని వివరించగలను?
ఉద్యోగాల్ కావాలని
ఉద్యమించు నేరానికి
లాఠీలకు పనిపెట్టే
రాకాసుల పాలనలో
చదువుకున్న చదువులకే
ఉద్యోగం దొరకరాక
ఆత్మబలిని గావించిన
నవయువకుని చూచినంత
మండుతున్న గుండెలతో
విరచించిన గీతం ఇది!
నా తల్లీ! ప్రియజననీ
స్వర్ణారుణ శ్యామలినీ!
నీకంటను సుడులుతిరుగు
కన్నీళ్ళను తుడిచేందుకు
లక్షలాది యువజనాళి
దీక్షబూని సాగుతోంది
భయమెందుకు ఊరడిల్లు
ప్రియభారత జనయిత్రీ!
ఆకాశం పడినెత్తిన
అరుణ తార పొలుచు వేళ
నీరవ నిబిడాంధ తమము
పారిపోక తప్పదప్పుడు!
నా లోకపు ప్రగతి-నాడు
పాడుతాను ప్రియమారగ!

—కె. రాజేశ్వరరావు

దేశాలు — వాటి పరిచయం — 83

లిథూనియా: మనోహరమైన ప్రకృతిదృశ్యాలు, సోషలిస్ట్ నవజీవనం తొణికిసలాడుతున్న సోవియట్ రిపబ్లిక్

(సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్కులు—13)

బాల్టిక్ మండలంలోని మూడు యూనియన్ రిపబ్లిక్కుల్లోనూ లిథూనియన్ రిపబ్లిక్ పెద్దది. ఈ రిపబ్లిక్ చరిత్రను పరిశీలిస్తే ప్రపంచంలో అగ్రజాతుల దండయాత్రలకు అల్పజాతులు ఏ విధంగా గురైనదీ బోధపడుతోంది. శబ్దశాస్త్ర రీత్యా పరిశీలిస్తే లిథూనియన్, సంస్కృతం భాషల మధ్య ఎంతో సారూప్యత గోచరిస్తోంది.

ఈ రిపబ్లిక్ వైశాల్యం 25,200 చదరపు మైళ్ళు, జనాభా 32 లక్షలు. రాజధాని విల్నియస్ (విల్నో) ఈ నగర జనాభా 372 వేలు. చరిత్ర ప్రసిద్ధి కెక్కిన ఈనగరం 12 వ శతాబ్దంలోనిర్మింపబడింది. 1323లో లిథూనియన్ రాజధానిగా చేయబడింది. క్రీ. శ. 14-19 శతాబ్దాల మధ్య కాలంలో నిర్మింపబడ్డ సుందర కట్టడాలతోను, సోవియట్ పాలనలో నిర్మింపబడ్డ ఆధునిక పరిశ్రమలతోను, వైజ్ఞానిక కేంద్రాలతోను ఈ నగరం విరాజిల్లుతోంది. 17-19 శతాబ్దాల మధ్య కాలంలో యూరపు ఖండంలోని యూదుల సాంస్కృతిక కేంద్రంగాను, 19వ శతాబ్దంలో పోలిష్ జాతీయోద్యమ కేంద్రంగాను కూడా ఈ నగరం ప్రసిద్ధి కెక్కినది.

సమశీతోష్ణ మండల ప్రాంతంలో వున్న ఈ రిపబ్లిక్‌లో [illegible] చిన్న నదులు (816) వేలకొలది (2 వేలు) సరస్సులు వ్యాపించి వున్నాయి. పచ్చటి కొనిఫర్ అడవులతోను, అహ్లాదకరమయిన వాతావరణంతోను ఈ రిపబ్లిక్ మనోహరంగా వుంటోంది.

ఈ రిపబ్లిక్ జనాభాలో 79 శాతం లిథూనియనులు, 8.5 శాతం రష్యనులు, 8.5శాతం పోలిష్ జాతీయులు. మిగిలినవారు బైలోరష్యన్, యూదు, ఉక్రైన్, జర్మన్, తాతార్ తదితర జాతులకు చెందినవారు. రోమన్ కాథలిక్ మతం ఈ రిపబ్లిక్‌లో అధికంగా వ్యాపించి వుంది.

చరిత్ర

లిథూనియన్ ప్రజలు దీర్ఘ కాలం జర్మన్, పోలిష్, రష్యన్ పాలకుల ఆక్రమణకు, దోపిడీకి గురైనారు.

క్రీ.శ. 12వ శతాబ్దంలోవివిధలిథూనియన్ తెగలు సంఘటిత పడడంతో లిథూనియన్ జాతి రూపొందింది. ఈ జాతికి చెందిన ప్రిన్స్ మిండోగస్ 1236-40 మధ్య కాలంలో ప్రథమ లిథూనియన్ రాజ్యాన్ని స్థాపించాడు. క్రమంగా ఈ రాజ్యం బలోపేతంగా రూపొందింది. రెండు శతాబ్దాలకాలం జర్మన్ నైట్స్ జరిపిన దాడులకు వ్యతిరేకంగా లిథూనియన్ ప్రజలు పోరాడారు. 1410 లో లిథూనియన్, పోలిష్, రష్యన్, చెక్ జాతులకు చెందిన సైన్యాలు లిథూనియాపై జరిగే జర్మన్ దాడులను శాశ్వతంగా త్రిప్పికొట్టాయి. 1450 నాటికి లిథూనియన్ రాజ్యం తూర్పున మాస్కోవరకు, దక్షిణాన నల్లసముద్రంవరకూ విస్తరించి, ఆనాడు యూరప్ ఖండంలోవున్న గొప్ప రాజ్యాలల్లో ఒకటిగా ప్రసిద్ధి కెక్కినది

1569లో పోలిష్, లిథూనియన్ దేశాలు ఒకే రాజ్యంగా రూపొందింప బడ్డాయి. 18వ శతాబ్దంలో రష్యన్ సామ్రాజ్యం విస్తరించడంతో, పోలెండ్ విభజన జరిగింది, క్రమంగా 1772 - 95 మధ్యకాలంలో లిథూనియా రష్యన్ సామ్రాజ్యంలో భాగంగా చేర్చబడింది. నాటినుండి జారుచక్రవర్తులు కూలిపోయేవరకూ లిథూనియన్ ప్రజలను నానా హింసలు పెట్టారు. ముఖ్యంగా వారి భాషాభివృద్ధిని తీవ్రంగా అరికట్టారు.

జారిస్ట్ పాలకులు 1832 లో విల్నియస్ విశ్వ విద్యాలయాన్ని మూసివేశారు. లిథూనియన్ పుస్తక ప్రచురణను 1864 లో నిషేధించారు. జారిస్ట్ పాలకుల క్రౌర్యానికి వ్యతిరేకంగా లిథూనియన్ ప్రజలు 1863లో తిరుగుబాటు జరిపారు. 19 వ శతాబ్దపు ద్వితీయార్ధభాగంలో లిథూనియన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాపింపబడింది. లెనిన్ సహచరుడు, ప్రముఖ విప్లవకారుడు ఐన ఫెలిక్స్ జెర్జిన్‌స్కీ ఆ పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకరు.

రష్యన్ ప్రజలతోపాటు లిథూనియన్ కార్మికులు, పేదవారు కూడా జారిస్ట్ వ్యతిరేక పోరాటంలోకి దుమికారు. అక్టోబరు మహావిప్లవం లిథూనియన్ ప్రజలకు స్వేచ్ఛాపథాన్ని చూపింది. బొల్షివిక్ పార్టీ నాయకత్వాన వారు తిరుగుబాటు జరిపి 1918 డిసెంబరు 18 న లిథూనియాలో సోవియట్ పాలనను స్థాపించారు. కాని, సామ్రాజ్యవాదులు, వారి బంట్లు కలిసి తిరుగు సోవియట్ ప్రభుత్వాన్ని 1919 చలికాలంలో కూలద్రోసి, పచ్చి మితవాద ప్రభుత్వాన్ని ఆ రాష్ట్రంలో నెలకొల్పారు. అంతేగాక లిథూనియాకు 'స్వతంత్ర లిథూనియా' దేశమని ముద్దుపేరు పెట్టారు. ఈ స్వతంత్ర లిథూనియాలో ఆర్థికపరిస్థితి పూర్తిగా దివాలా తీసింది. 90 వేల మంది రైతులు తమ భూములను కోల్పోయారు. నిరుద్యోగులైన లక్షల మంది ప్రజలు బ్రెజిల్ తదితర దేశాలకు వలస పోయారు. రాష్ట్ర పాలకుడైన ప్రెసిడెంటు స్మెటోనా 1926లో అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకొని, పచ్చి ఫాసిస్టుపాలనను నెలకొల్పారు. అయినప్పటికీ విప్లవవెల్లువను అణచలేకపోయారు.

శ్రీ నరేంద్రదేవ్

1940 లో లిథూనియన్ ప్రజలు ఫాసిస్టు పాలనను కూలద్రోశారు. అదే సంవత్సరం జూలై 21 న లిథూనియా సోషలిస్టురిపబ్లిక్‌గా అవతరించి సోవియట్ యూనియన్‌లో విలీనమైనది.

హిట్లరు మూకలు లిథూనియాను 1942 లో ఆక్రమించాయి. ఈ మూకలు 1945 జనవరిలో ఆ రాష్ట్రం నుండి గెంటివేయబడ్డాయి. ఈ మధ్య కాలంలో ఫాసిస్టు మూకలు ఆ రాష్ట్రంలో 20 వేల కోట్ల రూపాయల సంపదను నాశనం చేయటమేగాక, 7 లక్షల మంది ప్రజలను సంహరించారు.

విముక్తి అనంతరం సోవియట్ లిథూనియా వివిధరంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోంది.

290 మంది సభ్యులుగల ఈ రాష్ట్ర సుప్రీం సోవియట్‌కు 1967 మార్చిలో ఎన్నికలు జరిగాయి. ఎన్నుకోబడిన సభ్యులలో 47.42 శాతం కార్మిక, కర్షక వర్గాలకు చెందినవారు. పరిపాలనా సౌలభ్యంకోసం ఈ రిపబ్లిక్ 44 జిల్లాలుగా విభజింపబడింది.

సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ

ఈ రిపబ్లిక్‌లో గోధుమ, రై, బార్లి, బంగాళా దుంపలు, పండ్లు, అవిసె నార (నాణ్యమైన బట్టలు తయారు చేయడానికి ఉపయోగిస్తారు) విస్తారంగా పండుతున్నాయి

విప్లవానంతరం ఈ రిపబ్లిక్‌లో 14 లక్షల ఎకరాల భూమి పేదరైతులకు పంచిపెట్టబడింది, 1947 తరువాత వ్యవసాయ రంగంలో ప్రారంభమైన సమిష్టీకరణను కులక్కులు (ధనిక రైతులు) తీవ్రంగా ప్రతిఘటించారు. కాని, వారి ఆటలు సాగలేదు. 1968 కి ఈ రిపబ్లిక్‌లో 1481 సమిష్టి వ్యవసాయక్షేత్రాలు, 308 ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు స్థాపింపబడ్డాయి. వ్యవసాయరంగం పూర్తిగా యాంత్రీకరింపబడింది.

బాల్టిక్ సముద్ర తీరంలోవున్న ఈ రిపబ్లిక్‌లో మత్స్య పరిశ్రమ, పశుపోషణ బాగా అభివృద్ధి చెందాయి. నాణ్యమైన [illegible]కూడా ఉత్పత్తి అవుతోంది.

సోవియట్ లిథూనియాలోని పరిశ్రమల్లో



[మిగతా 4వ పేజీలో]

అవి ఏడున్నర కోట్లు

ఉర్దూ మూలం: కైఫీ అజ్మీ

నువ్వు దగ్ధం చేయగలుగు
దేశాన్ని కాన్నేను
నువ్వు ఛిద్రం చేయనోరుగు
ప్రహరీగోడను కాను
చెరిపిద్దామనుకొగల
సరిహద్దును కాను నేను
ఈ బల్లపైన నువ్వు పరిచిన
కాలం తీరిన భువిపటాన
గజిబిజి రేఖలు మినహా
ఇంకేమీ మిగల్లేను
నాకై వెతుక్కు- వృథా
నే నక్కడి మానవ చిరవాంఛా
ప్రతీకతను
పీడిత ప్రజ ఎద విరిసిన
అమృత సుస్వప్నాన్ని
కాని-మనిషి నెత్తుటిని
మనిషే పీల్చేరోజున
దోపిడీ పరిమితులన్నీ
మించిపోవు రోజున
నిరంకుశత్వం ఓర్పును
చంపేసిన రోజున
హఠాత్తుగా ఎటునుండో
ప్రత్యక్షం ఔతాను
నెత్తుస్రవించు గుండెనుండి
నేను పైకి లేస్తాను -
ఇదివరకే నువ్వు నన్ను
చూసే ఉంటావు
ఒకప్పుడు అది తూర్పున
మరొకపుడు పశ్చిమాన
నగరాల్లో, శివార్లలో
ఒకొకపుడు ప్రజల్లోన
లేదా అడవులనైనా-
నా కొక చరిత్ర ఉన్నది
అయితే చరిత్ర మాత్రమేఉన్నది
భౌగోళిక స్వరూపమా
అసలు నాకు లేనే లేదు
బోధించగపీల్లేది నాచరితము
అయినా ప్రజ రహస్యంగ
నేర్పుతూనే ఉన్నారు
ఒకచో ఘనవిజయం నాదైతే
వేరొకచో తలవంచవల్సి
రావచ్చును
ఒకొక్కపుడు హంతకుల్ని
ఉరిదీస్తా
వేరొకపుడు ఉరికొయ్యకు
నేనే ఆహుతినౌతా
అయితే ఒకటే తేడా
నావాలిటి హంతకులకు
మృత్యువు తప్పదు
నాకేమో మరణమన్న
మాటేలేదు
నే నమరను-
ఎంతమూర్ఖుడివి నువ్వు
ముప్పైత్తిన టాంకుల
నను నలిపేద్దామనుకున్నావ్
రాత్రింబవళ్లు నాపాం
బాంబు వాన కురిపిస్తే
వెళ్ళిపోయేది నువ్వేలే
నా కర యుగళాల్లో దేన్నినువ్వు
నిగళబద్ధం చేద్దామని?
అవి ఏడున్నర కోట్లు
నా శిరసుల్లో వేటిని నువ్వు
ఖండిద్దామని? అవి ఏడున్నరకోట్లు

(న్యూఏజ్ నుండి, తెలుగుసేత.)

మల్లిక్

వ్యావహారిక భాష: కొన్ని సమస్యలు

శ్రీ వెల్చేరు నారాయణరావు

'వ్యావహారికభాష' అనీ 'గ్రాంధిక భాష అని రెండు 'భాష' లుండటం తెలుగులో ఒక విచిత్రమైనస్థితి. దీనిని గురించి ఇప్పటివరకూ సాగుతున్న వాదాలలో దురదృష్టవశాత్తూ చాలా భాగం వట్టి పొరపాట్లతో కూడుకున్నది. భాషని గురించి స్పష్టమైన అవగాహన లేనివాళ్ళల్లో ప్రత్యేకంగా పేర్కొనదగినవాళ్ళు మన భాషని గురించి చిత్రవిచిత్రమైన ఆలోచనలు చేస్తున్నారు.

భాషనిగురించి ఆలోచించేవాళ్ళల్లో ఇప్పటికీ మిగిలిపోయిన కొన్ని పొరపాటు ఊహలని చూపిస్తూ వాస్తవమైన సంగతిని వివరించడానికి ఈ వ్యాసంలో ప్రయత్నిస్తాను.

వ్యావహారికం : గ్రాంథికం

ఏ భాషకైనా వ్యవహారంలో వుండే రూపానికీ గ్రంథాలలో వుండే రూపానికీ కొంత తేడా వుంటుంది. వ్యవహారంలో వాడే భాషనే గ్రంథాలలో రాయవలసిందనడంవల్ల భాషా వ్యవస్థ దెబ్బతింటుంది: అని ఒక వాదం. అందుచేత మన గ్రాంథిక భాష కొనసాగవలసిందే అని ఇలా వాదించేవాళ్ళంటారు.

ఇందులో పొరపాట్లు రెండున్నాయి:

1. వ్యవహారంలోవున్న భాషకీ, గ్రంథాలలో వాడే భాషకీ కొంత తేడా వుంటుంది. నిజమే అని కొంచెం సేపు ఒప్పుకుందాం. అయితే-ఈ కొంత ఎంత? ప్రస్తుతం మనం మాటాడే భాషకీ పూర్వపు పుస్తకాలలో కనిపించే భాషకీ, వున్నంత తేడా వుండటం అసహజం. అంత తేడాని సర్వత్రా పాటించడం సాధ్యం కాదు. కొంత తేడా ఎప్పుడూ వుంటుంది. అనే పేరుతో ఇంత అసహజమైనంతగా తేడాని నిలబెట్టాలని చూడడం సహేతుకం కాదు.

2 ఇప్పుడు 'గ్రాంథిక భాష' అనే పేరుతోవున్న తెలుగు-గ్రంథాలలో రాసుకోడానికి కావలసిన పాటి మార్పులు మాత్రం పొందిన నేటి తెలుగుకాదు. అది నన్నయ్యగారి కాలంలో మొదలయిన పద్యాలకోసం కావ్యాలకోసం మాత్రం నిలిచిన పాతతెలుగు. దాన్ని గ్రాంథిక భాష అనడం ఒక రకంగా దాని నిజస్వరూపాన్ని కప్పిపుచ్చడం. అది పాత తెలుగు. అది మృత భాష.

చాలామందికిఎందుచేతనోగాని, మృతభాష అంటే కోపంవస్తుంది. ఆంధ్రసభ ఫిబ్రవరి 28, 1971 ఆదివారం సంచికలో శ్రీ కాటూరి హనుమంతరావుగారు ఇలా రాశారు:

కాని ఇటీవల కొందరు వీర వ్యావహారిక భాషావాదులు "గ్రాంథిక భాష మృత భాష" అంటూ లేవదీస్తున్న వివాదం సమర్థనీయంకాదు. నిర్వ్యవహితంగా గ్రాంథిక భాషా రచనా సంప్రదాయం మనకేవుంది. చదువునేర్చిన వారందరూ గ్రాంథిక భాషలో చదవగలరు, వ్రాయగలరు. చిలకమర్తి పానుగంటి ప్రభృతులీ భాషలో రచించారు. విశ్వనాధ, దివాకర్ల ప్రభృతులీ భాషలో వ్రాస్తున్నారు. వీరి రచనలను ప్రజలు అర్థం చేసుకోలేక పోతున్నారనడం సాహసం. విశ్వనాధ వారి నవలలకున్న చెలామణి ఇంకెవరి నవలలకూలేదు. అర్థం చేసుకోడంలో క్లేశం వుంటే వీరి నవలలకు ఇంత ప్రచారం వుండదు కదా. ఒకటవ తరగతి పిల్లవాడు కూడా 'ఆవు పాలు యిచ్చును' అని చదివి వెంటనే అర్థంచేసుకోగలుగుతున్నాడు."

ఇందులో చెప్పినదన్నీ నిజమే. కాని ఆ లక్ష్యాలేవీ గ్రాంధికాన్ని మృత భాష కాకుండా ఆపలేవు. మృత భాష అనే మాట ఏ అర్థంలో అంటున్నారో తెలియక పోవడం వల్ల వచ్చిన ఇబ్బంది ఇది. ఒక భాషని నేర్చుకోడానికి కేవలం పుస్తకాలు మాత్రమే ఆధారమైన పరిస్థితివస్తే, అప్పుడు ఆభాషని మృతభాష అంటారు. సంస్కృతం మృతభాష అన్నా లాటిన్ మృత భాష అన్నా పాత తెలుగు మృతభాష అన్నా - ఈ అర్థంలోనే. ఇప్పటికీ కొన్ని పరిమిత వ్యవహారాలకు సంస్కృతం, లాటిన్ ఉపయోగపడుతూ వుండవచ్చు. పుస్తకాలద్వారా చిన్న పిల్లలతో సహా చాలామంది నేర్చుకుంటూ వుండవచ్చు. ఎవరో ఒకరిద్దరు సరదాకో. చాదస్తానికో వచ్చుచున్నాను. పోయిలిని, రండు, కూర్చొనుడు అని అంటూ వుండవచ్చు. ఇలాంటివాళ్ళు కొన్ని వేలమంది తయారయినా సరే - ఆ భాష మృత భాషే. చిన్న పిల్లలు వాళ్ళ ప్రథమ భాషగా ఆ భాషను మాట్లాడడం నేర్చుకునే స్థితివస్తే అప్పుడు అది మళ్ళా సజీవభాష అవుతుంది

మృత భాష అంటే వాగ్వ్యవహారం లోంచి నశించిపోయి, పుస్తకాలలో మాత్రం నిలిచినభాష అని అర్థం. అంతేకాని అందులో గొప్ప సాహిత్యం లేదనిగాని, అది ఎవరికీ అర్థంకాదనిగాని, ఆభాషలో పదాలు ఇతరభాషల్లో వ్యవహారంలో లేవనిగాని దాని భావంకాదు.

పాత తెలుగు మృత భాష అనడం ఈ అర్థంలోనే. ఇది తిట్టుకాదు: పారిభాషిక పదం.

రెండవ విషయం భాష ప్రామాణిక రూపాన్ని ఎలా పొందుతుంది అన్నది. భాష ఎప్పుడూ మారుతూనే వుంటుంది. దాన్ని ఎవరూ ఆపలేరు అది ఎందుకు మారుతుంది అన్న విషయం కొంచెం క్లిష్టమైనది అవన్నీ ఇక్కడ వివరంగా చూడడానికి అవకాశంలేదు. కాని మారుతుందని గుర్తించక మాత్రం తప్పదు. భాష అంటే మాట్లాడుకునేది. లేఖనం దానికి మారురూపం. భాషని ప్రమాణీకరించడం అందుచేత రెండురకాలు ఒకటి వ్యవహారాన్ని ప్రమాణీకరించడం రెండు లేఖనాన్ని ప్రమాణీకరించడం. రెండో విషయం ముందు చూద్దాం. మాట్లాడే ధ్వనులన్నిటికీ లేఖన చిహ్నాలు కల్పించడం సాధ్యంకాదు. అదృష్టవశాత్తు అవసరం కూడా కాదు. అందుచేత భాషను రాయడంలో కొంత సర్దుబాటు చేసుకుని అర్థ భేదం కల్పించే ధ్వనుల సంపుటికి ఒక గుర్తు ఏర్పరచుకుంటాము. ఈ లోపున మాట్లాడే రూపం మారుతుంది. అందుచేత లిఖిత రూపానికీ అంటే వర్ణక్రమానికీ, ఉచ్చారణకీ తేడా ముందుంటె దానికన్న ఎక్కువ అవుతూ వుంటుంది. కొన్నాళ్ళు పోయాక ఈ తేడా మరీ ఎక్కువయిపోతే చెయ్యవలసినపనులు రెండే. (1) ఉచ్చారణకి సమీపంగా వుండేటట్టు లిఖిత రూపాన్ని మార్చుకోవడం (2) లిఖితరూపం స్థిరంగా వుంచి, ఉచ్చారణ మార్పులు దానికి సంవదించేటట్లు చూడడం.

ఇందులో రెండోపని ఇంగ్లీషులో జరిగింది. 'Know' అనే మాట ఒకప్పుడు 'క్నో' అని ఉచ్చరించేవారు. అందులో మొదటి 'క' ఉచ్చారణలోంచి పోయినా లేఖన సాంప్రదాయం మార్చక Know అనే వుంచి, దానినే 'నో' అని చదువుకుంటున్నారు. ఈ పని క్లిష్టమా అంటే ఏమీ చెప్పలేం. అది ఆ భాషా వ్యవహర్తలకీ ఇష్టమయితే క్లిష్టం కాదు. ఏ కాలంలోవున్నా, ఎన్నోరకాల ఉచ్చారణలు వున్నా, కాలాన్నిబట్టి ఉచ్చారణలు మారినా వర్ణక్రమం సంప్రదాయం మారకుండా వుంచుకోవడం జరిగితే అందులో ఒక సులువు వున్నమాట నిజమే. అనువు కావాలనుకున్నవాళ్ళు ఆ పద్ధతిని అనుసరించవచ్చు.

మనకి కూడా ఉదాహరణకి 'వచ్చుచున్నాడు' అనిరాసి దానిని వస్తున్నాడు అని చదవటం స్థిరమైన సంప్రదాయంగా ఏర్పడి వుంటే, మనకి భాషలో కూడా, ఉచ్చారణకీ వర్ణక్రమానికీ దూరం ఏర్పడడమూ ఎన్ని ఉచ్చారణలు మారినా వర్ణలేఖన క్రమం (Spelling) మారకుండా వుంచడమూ జరిగి వుండేది.

వర్ణ లేఖనం కాకుండా ఒక రకమైన భావ లేఖనం (Ideographic) పద్ధతిని అనుసరించే చైనీస్ భాషలో దేశమంతా ఒక పదానికి ఒకే లిఖిత రూపం వుంటుందిట. దాన్ని చూసి అన్ని మండలాల వాళ్ళు. వాళ్ళ వాళ్ళ ధ్వనులలో చదువుకుంటారట సూర్యుడు అనే మాట వర్ణాల చిహ్నాలలో రాయకుండా ఒక బొమ్మ వేశామనుకోండి - తెలుగువాడు సూర్యుడు అని, హిందీవాడు దాన్నేచూసి సూరజ్ అని ఇంగ్లీషువాడు దాన్నే చూసి సన్ అని చదివినట్టుగా చైనీస్ లేఖన విధానం దేశంలో అనేక భిన్నమాండలికాలున్నా అందరూ చదువుకోడానికి ఉపకరిస్తోంది.

ఇంగ్లీషు పద్ధతిలో లేఖన ప్రమాణీకరణ మనకి ఇప్పుడు సాధ్యం కాదు. అందుచేత వాంఛనీయం కాదు. చైనీస్ పద్ధతీ అంతే.

ఇప్పుడు మన లేఖనం స్థిరపరచడానికి మనం చెయ్యగల పని ఒకటే వుంది. ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. వస్తున్నాడు. వొస్తున్నాడు. ఒస్తున్నాడు. అని మూడు రూపాలు ఒకే మండలం వ్యవహర్తలు వాడే ఒక పదానికి వున్నాయి. అందులో ఏదో ఒక రూపం సర్వత్రా వాడేట్టు అలవాటు చెయ్యవచ్చు. ఇది అచ్చువేసే వాళ్ళు ఏర్పరచవలసిన సంప్రదాయం. ఇది స్థిరపడితే దాని ప్రభావం వ్యవహర్తల లేఖనం మీద కూడా పడుతుంది. ఏ ప్రయత్నమూ అక్కరలేకుండానే లేఖన సంప్రదాయం స్థిరపడుతుంది, అచ్చువేసే వాళ్ళలో ఒక పధమైన జిజ్ఞాస కలిగితే ఈ విధమైన సంప్రదాయాలు వాళ్ళు అనుసరిస్తారు. నిజానికి ఇంగ్లీషు లేఖన విధానంలో స్థిరత్వానికి అచ్చుయంత్రం చాలా వరకూ కారణం అయింది. ఆ పనే ఇక్కడ కూడా జరుగుతుందని ఊహించడానికి చాలా అవకాశాలున్నాయి తెలుగులో అచ్చు పద్ధతులు చాలావరకూఇంకాప్రాథమికదశలోనేవున్నాయి వర్ణక్రమంతోపాటు, విరామ చిహ్నాలూ, మాటకీ మాటకీ మధ్య ఎడం (Space) వుంచడాలూ, కొన్ని సంక్షిప్తీకరణలూ (డాక్టర్ అనడానికి డా. మూడు అనడానికి మూ. మొదలగునవి అనడానికి మొ॥ యిలాంటివి) ఇలాంటి వెన్నో మనకింకా అవ్యవస్థితంగానే ఉన్నాయి అచ్చు పద్ధతుల అభివృద్ధివల్ల ఇవన్నీ స్థిరపడతాయి. ఉదాహరణకి ఇంగ్లీషులో పత్రికలవాళ్ళు వ్యక్తి పేరు రాసి బ్రాకెట్లలో వయస్సుని అంకెలలో వేస్తారు. ఉదాహరణకి Mr. John Higgins 48) అని. 48 సంవత్సరాల వయస్సుగల మిస్టర్ హిగ్గిన్స్ అన్న విషయాన్ని ఆ బ్రాకెట్లలో అంకె సూచిస్తోంది. ఇది కేవలం సౌకర్యార్థం అచ్చువాళ్ళు కల్పించుకున్న సంప్రదాయం. ఇలాంటి సౌకర్యాలు అవసరమైన పరిస్థితివస్తే ఇవన్నీ వాటంతట అవే వస్తాయి వీటికోసం ఏ వ్యాకరణాలూ అక్కరలేదు. వనికివాపుకూడా ఫలితార్థం ఏమిటంటే లేఖన ప్రమాణీకరణ - అచ్చు పుస్తకాల అభివృద్ధిమీద ఆధారపడి వుంటుంది, ఆవిషయంలో తొందరపడి ప్రయోజనంలేదు.

ఇంక, భాషా స్వరూప ప్రమాణీకరణం సంగతి చూద్దాం. మనలో చాలామందికి ఇంకా వ్యవహారిక భాషకి ఒక కోశమూ, లిఖిత వ్యాకరణమూ ఎప్పుడితే అది నియమబద్ధమవుతుందనే భ్రమ వుంది. ఇది చాలా పెద్ద భ్రమ. మొట్టమొదట గుర్తించవలసిన విషయం: ప్రతి వ్యవహర్త వ్యవహరించే భాషకీ నియమం వుంది-అని. నియమరహితమైన భాష ప్రపంచంలోలేదు. ఆ నియమాన్ని వ్యక్తీకరించే పని మాత్రమే భాషా శాస్త్రజ్ఞులది. ఆ వ్యక్తీకరణ లేకపోతే భాషా వ్యవహర్తలకి నష్టం లేదు, వుంటే ప్రయోజనమూ లేదు. భాషా శాస్త్రజ్ఞులు వ్యాకరణాలు అధ్యయనం చెయ్యడంలో ప్రయోజనం వైజ్ఞానికమైంది. భాషా శాస్త్రం వ్యాకరణం భాషలని నియమించడానికో, నిలబెట్టడానికో కాదు. మానవుని భావ వ్యక్తీకరణ వ్యవస్థలోని రహస్యాలను తెలుసుకోడానికి బహుశా ఈ అధ్యయనం ఇలా ఇంకా కొంత కాలం సాగగా, మనుష్యులు ఇంత క్లిష్టమైన వ్యవస్థవున్న భాషని ఎలా గ్రహిస్తారో వాళ్ళకి బోధపడి తద్వారా, మానవ మేధ. భావాలను ఎలా గ్రహిస్తుందో పైకి ఇంత భిన్నంగా కనిపిస్తున్న భాషలలో అంతర్గతంగా వున్న ఏకత్వం ఏమిటో మొదలైన అనేక సందేహాలకు సమాధానం తెలియవచ్చు. ఇలాంటి అన్వేషణలో వుండవలసిన వ్యాకర్తలు భాషలో ఏదితప్పు ఏదిఒప్పు చెప్తామనే చిల్లరపనులు చెయ్యదల్చుకోవడం మన దురదృష్టం.

భాషా ప్రామాణికత అన్నది సామాజిక విషయం. ఎవరి భాషైనా వారికి వ్యవస్థాగతంగా సర్వ సమర్థమైనదే. అందులో తత్వతః ఎక్కువ తక్కువలు లేవు. వున్నాయని మనం అనుకుంటూంటే, అవి మనం కల్పించుకున్నవి. "వస్తున్నాడు" శిష్టరూపమే వత్తాంను అశిష్ట రూపం కావడం కేవలం సామాజికంగా మనం కల్పించుకున్న ఎక్కువ తక్కువల ప్రతిఫలం ఈ రెండు రూపాలకూ వ్యాకరణం వుంది. ఇంకా ప్రామాణికత అనేమాటకు, ఏకరూపత Uniformity అని ఒక్కటే అర్థం మిగులుతుంది. వాడుకలో ఒక పదానికి ఉన్న భిన్న రూపాలలో ఏదో ఒకటి స్థిరం చేసి ఇది అందరూ వాడడం. అనేక మాండలికాలలో ఏదో ఒక మాండలికాన్ని, రచనలు చేసేటప్పుడు వాడడం. ఇది జరగాలని వ్యావహారిక భాషావాదులు కూడా అంటున్నారు.

ఈ పని ఏదో ఒక పరిషత్తో. పుస్తకమో చేస్తుందనుకోవడం పొరపాటు భిన్న మాండలికాలలోంచి ఉమ్మడి ప్రయోజనాలకు ప్రామాణిక భాష ఎలా ఏర్పడుతుందనేది, సామాజిక ఆర్థిక పరిస్థితుల ప్రభావంమీద ఆధారపడివున్న విషయం.

ఉదాహరణకి బ్రాహ్మలు వాడేభాష మిగిలిన కులాల వారికి అనుసరణీయం ఎందుకు అయింది? వాళ్ల సంస్కృతి తమ సంస్కృతికన్న ఎక్కువ గొప్పదని వాళ్ళంతా అనుకోబట్టి. అలా అనుకోకుండా తమ భాషనే నిలబెట్టుకుందామని అనుకుంటే, తెలుగు భాషకి కొంప ఏమీ మునిగిపోయి వుండేది కాదు. ఇప్పుడు ఏ భాష అశిష్ట భాష అని మనం అనుకుంటున్నామో, అది శిష్ట భాష అయి వుండేది. అందుచేత. భాషని ప్రామాణీకరించడం వ్యాకరణాల పని కాదు. అవసరాన్ని బట్టి, ప్రజలు చేసుకునే పని పారిశ్రామిక యుగంవచ్చి జనంలో కలయిక ఎక్కువయి, కాగితాల మీద జరగవలసిన పనులు ఎక్కువయి రేడియో, పత్రికలు మొదలైన Mass media పెరిగేసరికల్లా, అంత వరకూ భిన్న రూపంలోవున్న మాండలికాలలోంచి ఒక ప్రాముఖ్యం పొంది, అది మాండలిక స్థాయి నుంచి పెరిగి ప్రామాణిక రూపాన్ని పొందింది. కేవలం పరిస్థితుల ప్రాబల్యం దీనికి కారణం, తిక్కన్నలాంటి మహాకవి విరివిగా వాడినా నెల్లూరి మాండలికం ప్రామాణిక భాషకి ముఖ్యాధారం కాలేకపోయింది. గురజాడ ఎంతో ఉపయోగించిన విశాఖ మాండలికం కూడా అంతే అయింది. ఏ గొప్ప కవి ఆదరమూ అంతగా లభించని కృష్ణా గోదావరి జిల్లాల భాష ఆధునిక ప్రామాణిక భాషకి ఆధారం కావడానికి ప్రధాన కారణం కేవలం యాదృచ్ఛికం. ఆ జిల్లాలు ఆర్థికంగా ముందు అభివృద్ధి చెందడం.

అయితే యింత మాత్రాన ప్రామాణిక భాషని గురించి మరీ అతి ప్రాముఖ్యం యివ్వటం కూడా ప్రమాదమే. దీని ప్రయోజనం సాహిత్యేతర రంగాలలోనే. సాహిత్యం ఏ భాషలో వస్తుంది అనేది కవులూ, రచయితలూ చూసుకోవలసినపని దీన్ని సంప్రదాయాలు కూడా నియమించలేవు. దాశరథి రంగాచార్యులుగారు చిల్లర దేవుళ్ళు నిండా తెలంగాణా మాండలికం రాయకూడదని ఎవరన్నా అనగలరా? రా. వి. శాస్త్రి గారి సారాకథల్లో విశాఖ మండలపు సామాన్య జనం వాడే భాష వుంటే అడ్డు చెప్పగలరా? అందుచేత ప్రామాణిక భాషాసంప్రదాయాలు ఏర్పడిన తరవాత కూడా అవి గ్రంథాలలో ప్రచురణ కర్తలు రాసే శీర్షికలకీ, అట్టలకీ మాత్రమే పరిమితం అవుతాయి.

ఇంక కోశాలు చేసేపని చూద్దాం. మాటలు ఏ అర్థంలో వాడబడ్డాయో వాడబడుతున్నాయో ఏ యే మాటలు ఏ యే మాటలతో కలిస్తే ఏ పద బంధాలు కొత్త అర్థంతో ఏర్పడుతున్నాయో, ఏ నుడికారానికి ఏ విశేషార్థం వుందో పరిశీలించి సమగ్రంగా చెప్పడం కోశాలపని. ఇలాంటి కోశం మనకి ఏర్పడితే, రిఫరెన్స్‌కి పనికి వచ్చేమాట నిజమే. కాని యిదికూడా భాషని శాసించదు. భాషని ప్రమాణీకరించడంలో దీని పాత్ర కూడా అల్పమే. భాషా ప్రవాహాన్ని కోశాలు అనుసరించవలసిందే కానీ, కోశాన్ని భాషా ప్రవాహం అనుసరించదు. ఏ కాలములో ఏ కోశమూ కూడా ఇంత వరకూ తత్కాల భాషా స్వరూపాన్ని అంతటినీ సమగ్రంగా సంగ్రహించడం జరగలేదు. కాని దాని ప్రయత్నం మట్టుకు అదే. అందుచేత కోశకర్తలూ, వ్యాకర్తలూ, ఇప్పుడున్నవాళ్ళు రాబోయేవాళ్ళూ గమనించవలసిన ఒక ప్రధానాంశం యిది.

తెలుగు భాష ఇంత వరకూ ఏరూపంలో వుందో ఏ ఒక్కరికిగాని, కొందరికిగాని పూర్తిగా తెలియదు.

ఇది తప్పు. ఇది ఒప్పు అని ఎవరూ నిర్ణయించ కూడదు. ఇలా పలానాచోట అంటున్నారు. ఇలా ఎవరూ అనడంలేదు అని చెప్పడం మాత్రం సాధ్యం, అది కూడా సమగ్ర పరిశీలన జరిగిన మీదటే.

భాషని ప్రజలే పరిస్థితుల అవసరాన్ని బట్టి తయారు చేసుకుంటారు. దానిని సేకరించడం, పరిశీలించడం, అవగాహన చేసుకోవడం మాత్రమే పండితులూ వ్యాకర్తలూ చెయ్యవలసినపని.

విద్యార్థులు వ్యావహారికంలో రాయడానికి ముందు భాషా ప్రామాణీకరణ జరగాలన్న వాదం ఈత నేర్చుకున్నాక నీళ్ళల్లో దిగవచ్చుననడం లాంటిది.

లిథూనియా

(3 వ పేజీ తరువాయి)

ఇంజనీరింగ్, రసాయనిక, పంచదార, సిమెంటు, జౌళి, నౌకా నిర్మాణం, కాగితపు పరిశ్రమలు ముఖ్యమైనవి. ఈ రిపబ్లిక్‌లో భూగర్భ సంపద విస్తారంగా లభ్యంకావడం లేదు.

యుద్ధానంతరం లిథూనియా పారిశ్రామికోత్పత్తి 20 రెట్లు పెరిగింది. ఈ చిన్న రిపబ్లిక్‌లో ఉత్పత్తి అయిన పారిశ్రామిక వస్తువులు 75 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

లిథూనియాను బూర్జువా శక్తులు పాలిస్తున్న రోజుల్లో ఒకసంవత్సరంలో ఉత్పత్తి అయిన విద్యుచ్ఛక్తికంటే 1966 లో 53 రెట్లు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అయింది. పై విషయాలను దృష్టిలో పెట్టుకుంటే సోషలిస్టు సామాజిక వ్యవస్థ ఎంతఉత్కృష్టమైనదీ బోధపడుతుంది.

ఈ రిపబ్లిక్‌లో ఆఖరు వ్యక్తికి కూడా గృహ, వైద్య సౌకర్యాలు కల్పించబడ్డాయి

విద్య, వైజ్ఞానిక రంగాలు

సోషలిస్ట్ లిథూనియాలో విద్య, సాహిత్యం, వివిధ కళలు సంపూర్ణంగా వికసించాయి

ఈ రిపబ్లిక్‌లో ఆఖరు భిక్షకు కూడా విద్యా సౌకర్యాలు కల్పించబడ్డాయి. లిథూనియా(విల్నియస్‌లో)1579 లోనే విశ్వవిద్యాలయం స్థాపించబడింది. విప్లవ భావాలను వెదజల్లుతుందనే మిషతో 1832లో విల్నియస్ విశ్వవిద్యాలయాన్ని జారిస్ట్ పాలకులు మూయించి వేశారు. తిరిగి లెనిన్ ఆదేశానుసారం అది 1919లో పునః ప్రారంభమైంది. 1941 లో ఈ రిపబ్లిక్‌లో విజ్ఞానశాస్త్ర పరిషత్ స్థాపించబడింది.

విజ్ఞానాన్ని, వినోదాన్ని పెదజల్లే పెక్కు-నాట్య, నాటక శాలలు, సంగీత మందిరాలు. 1340 వైజ్ఞానికక్లబ్బులు, 1500 సినిమేటర్లు, 2132 గ్రంథాలయాలు (విప్లవానికి పూర్వం 200 మాత్రమే వుండేవి) 86 వార్తాపత్రికలు మ్యాగజైనులు (69 లిథూనియన్ భాషలో) ఈ రిపబ్లిక్‌లో వ్యాప్తిలో వున్నాయి.

సాహిత్యం

లిథూనియన్ భాష ఎంతో విశిష్టమైనది. నిర్మాణం, వ్యాకరణం, పదాల ఉత్పత్తి. ఉచ్చారణలదృష్ట్యా ఆ భాష యూరోపియన్ భాషలలో అతి ప్రాచీనమైన వాటిల్లో ఒకటిగా గణించబడింది. శబ్దరూపశాస్త్రదృష్ట్యా ఆధునికభాష లన్నింటిలోకి సంస్కృతాన్ని పోలి వుండే భాష అది ఒక్కటే. ఈ నాటి లిథూనియన్ పదాలు ఎన్నో ప్రాచీన సంస్కృత భాషలో ఉపయోగించిన అర్థంలోనే ఉపయోగింపబడు తున్నాయి

లిథూనియన్ సాహిత్యభాష 16 వ శతాబ్దపు ప్రారంభదినాల్లో ఆవిర్భవించింది. అనాడే ఈ భాషకు రోమన్ లిపి ప్రవేశ పెట్టబడినది. నాటినుండి ఈ భాషలో పుష్టికరమైన సాహిత్యం వెలువడుతోంది. మొట్టమొదటి అచ్చు యంత్రం లిథూనియాలో 1525 లో స్థాపించబడింది కాని, మొదటి సారిగా రష్యన్‌భాషా గ్రంథాలు ముద్రింపబడ్డాయి.

లిథూనియన్ భాషలో మొదటి గ్రంథం మార్టైనాస్ మజ్వైదాస్‌చే 1547 లో ముద్రింపబడింది. పశ్నోత్తరక్రమంలో ప్రాచీన క్రైస్తవ మతం గ్రంథం అది. ఆటు తరవాత మత గ్రంథాలు విరివిగా రచింపబడ్డాయి. కాన్‌స్టాంటిన్ సర్‌వైదాస్‌చే ఈ భాషలో సమకూర్చబడిన మొదటి నిఘంటువు 1629 లో ముద్రింపబడినది.

18 వ శతాబ్దం నుండి లిథూనియన్ భాషలో మత గ్రంథాలతోపాటు, సాంఘిక విషయాలను, విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలు కూడా క్రమంగా ప్రచురింపబడుతున్నాయి. 19 వ శతాబ్దపు ద్వితీయార్థ భాగంలో లిథూనియాలో జాతీయోద్యమంతో పాటు, సాహిత్యం కూడా విజృంభించింది. ఈ ఉద్యమతాకిడికి జారిస్ట్ పాలకులు భయపడి లిథూనియన్ భాషను రూపుమాపడానికి పూనుకొన్నారు. ఈభాషలో గ్రంథ ప్రచురణను 1864 లో నిషేధించారు. తరువాత లిథూనియన్ భాషా గ్రంథాలు జర్మన్ భూభాగంలో ముద్రింపబడి చాటుగా దేశంలోకి చేరవేయబడేవి.

1883 లో ఈ భాషలో మొదటి వార్తా పత్రిక స్థాపించబడినది.

విప్లవానికి పూర్వం, విప్లవానంతరం ఎందరో కవులు, రచయితలు లిథూనియన్ భాషలో ఉత్కృష్టమైన రచనలుచేసి స్వదేశంలోను, విదేశాల్లోను కీర్తిప్రతిష్ఠలను గడించారు, వారిలో 18 వ శతాబ్దపు విఖ్యాతకవి క్రిస్తిజొనాస్‌డొనెలైటిస్, 19 వ శతాబ్దపు ప్రముఖ కవులు ఆంటనాస్ బరనాస్కాస్ (1835-1902), జొనాస్ మైరోనిస్, ప్రథమ శ్రామిక కవి జ్యూలియస్ జనోనిస్ (1879-1907)లిథూనియన్ గానకోకిల సలోమెజనెరిస్, ప్రముఖ నవలా కారులు, కథా రచయితలు పెట్రాస్ సిమ్కా. అన్‌టానాస్ వెనొలిస్ (1882-1957) అగ్రగణ్యులు.

గత పాతికేండ్లుగా లిథూనియన్ సాహిత్యం మూడు పూలు, ఆరుకాయలుగా వికసిస్తోంది. నేడు వందకుపైగా ప్రముఖ కవులు, రచయితలు లిథూనియన్ భాషలో వివిధ సాహిత్య ప్రక్రియలకు చెందిన గ్రంథాలను విరివిగా రచిస్తున్నారు.

సోవియట్‌లోని ఇతర జాతులకు చెందిన మహిళలవలెనే లిథూనియన్ మహిళలు కూడా పురుషులతోపాటు సర్వహక్కులనూ కలిగివున్నారు. ఈ రిపబ్లిక్కులో వివిధ విద్యాలయాల్లో విద్య నభ్యసించేవారిలో సగంమంది బాలికలు, వివిధ వృత్తి రంగాల్లో పనిచేసే వారిలో సగంమంది మహిళలు నేడీ రిపబ్లిక్ పార్లమెంటులో 94 గురు మహిళలు సభ్యులుగా వున్నారు.

లిథూనియన్-భారత్ మైత్రి

భాషా సాహిత్యాలే. భారత్-లిథూనియన్ దేశాలమధ్య స్నేహ సంబంధాలు పెంపొందడానికి దోహదం చేశాయి. లిథూనియన్-సంస్కృత భాషలమధ్య సారూప్యంవుండడం వల్ల గత శతాబ్దకాలంగా భారతీయ సాహిత్యాల, కళలు. సంస్కృతిపట్ల లిథూనియన్ ప్రజలు అత్యంత అసక్తిని చూపుతున్నారు.

19 వ శతాబ్దంలో విల్నియస్ విశ్వవిద్యాలయంలో పనిచేసిన మిరోనస్, నెమానిస్‌లు సంస్కృత భాషలో అసమాన పాండిత్యాన్ని గడించారు నేటికీ అనేక మంది లిథూనియన్ కవులు. రచయితలు, నాటక రచయితలు భారతీయ సాహిత్యాన్ని లిథూనియన్ భాషలోకి అనువదించడంలో విశేషాసక్తిని కనబరుస్తున్నారు విల్నియస్ విశ్వవిద్యాలయంలో ఈనాటికీ సంస్కృత భాషాబోధన ప్రధానంగా జరుగుతోంది.

పై కారణాలవల్ల లిథూనియన్ ప్రజల హృదయాల్లో భారతదేశం శాశ్వతంగా చోటు చేసుకొంది. కొన్ని సంవత్సరాలకు పూర్వం భారతీయకళాకారులు లిథూనియన్ రిపబ్లిక్‌లో పర్యటించారు.

'నికలస్ కోపర్నికస్'

[1473 – 1543]

డి. వెంకటరెడ్డి



1473-1543 ... ఆ మధ్య కాలంలో యుద్ధాలు. రాజ్యకాంక్షతో కూడిన రాక్షస కృత్యాలు ఎన్నెన్నో జరిగాయి. సుల్తాన్ మహమ్మద్ II సికారో. జోర్జియా, వార్లెస్, సులేమాన్, బాబర్ (ప్రొవ్విన్ I సిరంతా మానవ రక్తపు మడుగులతో తమ విగ్రహాలను స్థాపించుకోవాలని తాపత్రయ పడినవారే. అయితే యిప్పుడు మాత్రం ఆ పేర్లు ఎవరికీ తెలియవు. ఆ కాలానికి చెందిన ముగ్గురు వ్యక్తుల కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయింది. వారే- కొలంబస్, లూథర్, మరియు కోపర్నికస్, కొలంబస్ అమెరికాను కనుగొన్నాడు, లూథర్ మత మౌఢ్యంపై తిరుగుబాటు జరిపారు. కోపర్నికస్ అల్లిబిల్లిగా అల్లుకుపోయిన యావిశ్వంగూర్చి ఒక కొత్త సిద్ధాంతాన్ని చెప్పాడు.

సూర్యుడు తిరుగుతున్నాడని భ్రమపడేవారు యీనాటికీ కొందరు లేకపోలేదు. పూర్వం మాత్రం అందరిలోను ఆ అభిప్రాయమేవుండేది. కొన్ని వందల సంవత్సరాలుగా "భూమి స్థిరంగా వుందని. తక్కిన గోళాలన్నీ భూమిచుట్టూ తిరుగుతున్నాయని" ఖగోళశాస్త్రజ్ఞులంతా విశ్వసించారు.

క్రీ. శ. 150 వ సంవత్సరంలో టోలమీ అనే యీజిప్టు ఖగోళశాస్త్రజ్ఞుడు గోళాలకదలికమీద కొన్ని పరిశోధనలు చేశాడు. అతను కూడా భూమిస్థిరంగా వుందని భావించి తన ప్రయోగాలను కొనసాగించాడు. అందుచేత వాటిగురించి. నిజాలను కనుగొనలేక పోయాడు. 4 శతాబ్దాల ముందు అరిటార్కస్ అనే గ్రీకుశాస్త్రజ్ఞుడు సూర్యుడు స్థిరంగా మధ్యలో వున్నాడనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా దానినెవరూ నమ్మలేదు.

పోలెండ్ దేశానికి చెందిన ప్రఖ్యాత ఖగోళ. గణిత, వైద్య శాస్త్రజ్ఞుడు. మత గురువు అయిన నికలస్ కోపర్నికస్ 1540 వ సంవత్సరంలో సూర్యునిగురించి యిలా చెప్పాడు "సూర్యుడు స్థిరంగా తక్కిన గోళాలన్నిటికీ మధ్యలో వున్నాడు. భూమితోసహా యితర గ్రహాలన్నీ సూర్యునిచుట్టూ వలయాకార మార్గాలలో తిరుగుతున్నాయి." అతను చనిపోయిన తర్వాత 150 సంవత్సరాలకుగాని లోకం దానిని అంగీకరించలేదు.

నికలస్ కోపర్నికస్ ఫిబ్రవరి 19, 1473వ సంవత్సరంలో పోలెండ్ దేశంలోని 'టోరన్' అనే నగరంలో జన్మించాడు. అతని తండ్రి నికలస్ కోపర్నిక్, యిద్దరు మగవాళ్లు. ఇద్దరు ఆడవాళ్లు-సంతానం. అందరిలోను కోపర్నికస్ చిన్నవాడు, అతని తల్లి పేరు బార్బరా వాక్జెనోడ్. అతని తల్లి, తండ్రి యిరువురూ కూడా ఆ నగరంలోని వున్నతమైన కుటుంబాలకు చెందినవారు. టోరన్ పెద్ద వ్యాపార కేంద్రం. నికలస్ తండ్రి పెద్ద వ్యాపారస్తుడే గాక, న్యాయవాది. మరియు నాయకుడు. నికలస్‌కు పది సంవత్సరాల వయసప్పుడు అతని తండ్రి మరణించాడు. ఆ పిల్లల నందరిని వాళ్ళ మావయ్య ల్యూకాస్‌వాక్జెనోడ్ దత్తత చేసుకొన్నాడు, ల్యూకాస్ ఒక పెద్ద మతాధికారి.

పండితుడు, మతగురువు అయిన ల్యూకాస్ రక్షణ క్రింద, నికలస్ చర్చిలో వుద్యోగం చేయాలనుకొన్నాడు. అందుకు ముందు అతను విద్యాభ్యాసం చేయాలి. నికలస్ 18 వ సంవత్సరంలో క్రాకో యూనివర్సిటీలో చేరాడు. క్రాకో నగరం ధనవంతమైన్దిగాను, మంచి సంస్కృతి కలిగినదిగాను యూరప్‌లో ప్రసిద్ధికెక్కింది. జర్మనీ, హంగేరి, ఇటలీ, స్విట్జర్లాండు, స్వీడన్ మొదలయిన ఎన్నో యితర దేశాలనుంచి విద్యార్థులు క్రాకో యూనివర్శిటీకి వచ్చేవారు. లాటిన్ భాష బోధనా భాషగా వుపయోగించేవారు. అన్ని ముఖ్యమయిన పుస్తకాలు లాటిన్ భాషలోనే వ్రాయబడ్డాయి. అందుకే చదువుకొనదలచిన వారంతా ఆ భాషను క్షుణ్ణంగా నేర్చుకొనేవారు. తత్వశాస్త్రం, ఖగోళశాస్త్రం, జామెట్రీ మరియు భూగర్భ శాస్త్రం మొదలయిన వాటిగురించి చదివాడు నికలస్.

ఆ రోజులలో ఖగోళశాస్త్రం నేర్చుకోవటమంటే గొప్పగా భావింపబడేది, నౌకాయానానికి సంబంధించి శాస్త్రం ఆ రోజులలో చాల అభివృద్ధి చెందింది. నికలస్‌కు 19 సంవత్సరాల వయసప్పుడు కొలంబస్ సముద్రయానం చేసి అమెరికాను కనుగొన్నాడు. నౌకాయానానికి ముఖ్యమైనది ఖగోళ శాస్త్రం

నికలస్ విద్యాభ్యాస మంతా వింతగా కన్పిస్తుంది మనకు. అతను క్రాకోవిశ్వవిద్యాలయంనుంచి, ఇటలీలోని బొలొగ్నాకు న్యాయ శాస్త్రం నేర్చుకోవటానికి వెళ్లాడు. అతను పాడ్యూ విశ్వవిద్యాలయంలో 'డాక్టర్ ఆఫ్ లాస్' అనే పట్టాను పొందాడు.

నికలస్ యింటికి తిరిగి వచ్చాడు. అయితే అక్కడ వుండిపోవటానికి మాత్రం కాదు. ఎలాగయినా అతని మామయ్యను ఒప్పించి వైద్యం చదవాలని అతని కోరిక. వైద్యం చదివితే చర్చిలో సేవచేయటానికి చాల ఉపయోగిస్తుందని అతని అభిప్రాయం. వారికి ఆర్థికమైన సమస్యలేవీ లేకపోవటం మూలంగా నికలస్ తన 30 వ సంవత్సరంలో పాడ్యూ విశ్వవిద్యాలయంలోని వైద్య కళాశాలలో చేరాడు.

ఆ రోజుల్లో వైద్యశాస్త్రాన్ని ఖగోళ శాస్త్రంతో ముడివేసి ఆలోచించేవారు. శరీరం లోని జీవకణాలకు, రాశిచక్రాలకు మధ్య ఎవరికీ తెలియని సంబంధ మేదోవుందని వారి విశ్వాసం. రాశిచక్రం అంటే సూర్యుడు, తక్కిన గోళాలు తిరిగేస్థలానికి వారిచ్చిన పేరు. ఈనాటికీ జాతకాల గురించి చెప్పేవారు యీ రాశిచక్రం ఆధారంగానే చెబుతూవుంటారు.

కోపర్నికస్‌కు 'ఫ్రాన్‌బర్గ్' లోని ఒక చర్చిలో మతాధికారి వుద్యోగం లభించింది. ఆ వుద్యోగం రావటానికి కారణం నికలస్‌లోని గొప్పదనమేగాక అతని మావయ్య పలుకుబడికూడా వుంది. ఏమైనా ఆ వుద్యోగానికి కావలసిన తర్ఫీదునంతా పొందాడు, వేదాంతశాస్త్రం, తత్వశాస్త్రం, గురించి అతను బాగా తెలుసుకొన్నాడు. ఇటలీ అంతా పర్యటించాడు. అతనికి 'చర్చిలా' లో పట్టా లభించింది. ఇది చదవటంకోసం తన వైద్య విద్యను మధ్యలోనే ఆపు చేశాడు. ఆ డిగ్రీ వచ్చిన తర్వాత మరల తన విద్యను కొనసాగించాడు. అతనికి గ్రీకు, లాటిన్ భాషలు బాగా వచ్చు అందుకే అన్నిశాస్త్రాలకు సంబంధించిన ఎన్నో పుస్తకాలను అతను చదవగలిగాడు.

నికలస్ తన 33వ సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తిచేసి పోలెండ్‌కు తిరిగివచ్చాడు, అప్పటికి అతని మామయ్య వృద్ధాప్యంలో వున్నాడు. దగ్గర ఉండి ఆయన గురించి శ్రద్ధ వహించేవాడు నికలస్. ఆ సమయంలోనే అతనికి పరిశోధనలు చేయడానికి తీరిక లభించేది. మామయ్య మరణించిన తరువాత ఫ్రాన్‌బర్గ్‌కు వెళ్ళి మరలా పాత ఉద్యోగంలో చేరాడు. ఆ చర్చిలో అతనొక చిన్న గోపురాన్ని కట్టించాడు, అతని పేరుతో ఆ గోపురము యీనాటికీ ఉంది. ఆ గోపురంపై నిలబడే అతను ఖగోళానికి సంబంధించిన పరిశోధనలన్నీ చేశాడు.

నికలస్‌కు సరయిన పరికరాలు వుండేవి కావు. అతను వుపయోగించిన పరికరాలు అతనిపూర్వం 1500 సంవత్సరాల క్రిందట వుపయోగించిన వాటికంటె మంచివేమీకావు. అతను కనిపెట్టిన కొన్ని సిద్ధాంతాలుతప్పులు కావటానికి కారణం అతను వుపయోగించిన పరికరాలే; అతని తర్వాత వచ్చిన ఖగోళ శాస్త్రజ్ఞులు, టైకో బ్రాహె. జోనస్ కెప్లర్ మొదలయినవారు యితని సిద్ధాంతములలో వున్న దోషాలను సరిదిద్దారు;

1539 వ సంవత్సరం వసంతకాలంలో జార్జి జోఖిమ్ రేటికస్ అనే 25 సంవత్సరాల యువక జర్మను శాస్త్రవేత్త, నికలస్‌దర్శనానికి వచ్చాడు. రిటికస్ మూడు సంవత్సరాలుగా విటెంబర్గ్ యూనివర్శిటీలో గణిత శాస్త్ర ప్రొఫెసరుగా పని చేస్తున్నాడు. రెండు సంవత్సరాల వరకు నికలస్ సిద్ధాంతాలు పరిశోధనలగురించి తెలుసుకొంటూ అతనిదగ్గరే వుండిపోయాడు. రెటికస్, నికలస్‌ను తన పరిశోధనల ప్రచురణకు అంగీకరింపజేసి తానే ప్రచురించాడు. ఆ పుస్తకంపేరు డిరివొల్యూషనిబస్ అర్బియం కోలిస్టయమ్;

అటువంటి గొప్పపుస్తకాన్ని అనందంగా ప్రచురణలో చదువుకొనే అదృష్టంలేక పోయింది నికలస్‌కు. అప్పటికి నికలస్ మృత్యు ముఖంలో వున్నాడు. పైగా అతనికి మతి స్థిమితం కూడా లేదు.

ఆ పుస్తకంలో నికలస్ పరిశోధనలలోని చాల తక్కువ భాగం మాత్రమే ప్రచురించబడ్డాయి. అందులో అతను వ్రాసినవి: సూర్యుడు మధ్యలో వుండగా తక్కిన గ్రహాలన్నీ దానిచుట్టూ ఎలా తిరుగుతున్నాయో వివరించాడు. ఋతువుల మార్పులకు కారణాలు చెప్పాడు. ఒక స్థలానికి వేరొక స్థలానికి నక్షత్రాలు కన్పించే తీరులో భేదం వుంది. ఒక ఓడ కొయ్య పై భాగంలో దీపం వ్రేలాడదీస్తే ఆ ఓడ దూరమయ్యేకొలంది ఆ దీపం క్రిందకు దిగిపోతున్నట్లు కన్పిస్తుంది చివరకు అది కన్పించదు. నీటిలో మునిగిపోయినట్లనిపిస్తుంది. దానినే మనం భూమి గుండ్రంగా వుందనే నిరూపణకు వుపయోగిస్తున్నాము. గ్రహాలు ఎప్పుడెప్పుడు ఎలా కదులుతాయి, వలయాకారాలలో వాటి కదలికలు ఒక క్రమమైన పద్ధతిలో ఎలా వున్నాయి అనే విషయాల గురించి వివరంగా చర్చించటమేగాక చిత్రాలతో సహా చూపించాడు. అతని సిద్ధాంతాలలోని దోషాలను సరిదిద్దిన కెప్లర్ గోళాల మార్గం ఎలిప్టికల్‌గా వుంటుందని చెప్పాడు.

కోపర్నికస్ గురించి అతని సమకాలికులయిన శాస్త్రజ్ఞులకు సరిగా తెలియదు. అందుకు కారణం పోలెండు దేశమంతా చిన్న చిన్న స్వతంత్ర్య రాష్ట్రాలుగా విడిపోయివుండటం. ఒక రాష్ట్రానికి వేరొక రాష్ట్రానికి మధ్య కలహాలు వుండేవి. ఎవరి ద్రవ్యమారక పద్ధతులను వారు అనుసరించేవారు. ప్రతివారి దగ్గర రకరకాల నాణాలు వుండేవి. ఈ నాణెముల మార్పిడలను గురించి కోపర్నికస్ చెప్పిన దానిని ఆధారంగా చేసుకొని గ్రెషమ్స్ అనే అతను అర్థశాస్త్రానికి సంబంధించిన పెద్ద సూత్రాన్నొక దానిని తయారుచేశాడు.

కోపర్నికస్, పోలండ్ దేశంలోని ప్రజలందరినీ ఒకేరకం నాణెములను వుపయోగించమని సలహాయిచ్చాడు. కానిఅప్పట్లో వ్యతిరేక శక్తులు బలంగా వుండటం మూలంగా యితని మాట నెవరూ ఖాతరు చెయ్యలేదు. విచిత్రమేమిటంటే, బ్రిటిష్ ప్రభుత్వం ఐజాక్ న్యూటన్‌ను యిదే సమస్యకు పరిష్కారం అడిగితే అతను ఆ సలహానే యిచ్చాడు. వారు దానిని ఆదరించి ఎన్నో ప్రయోజనాలను పొందారు.

సూర్యుడు గోళాల మధ్యలో వున్నాడనే విషయాన్ని మొదట కనిపెట్టినవాడు కోపర్నికస్ కాదు. సామోస్ అరిస్టార్కస్ అనేగ్రీకు శాస్త్రజ్ఞుడు మొదటిసారిగా దానిని కనుగొన్నాడు. కాని దానికి నిరూపణ చూపించలేకపోయాడు. 1800 సంవత్సరాల తర్వాత కోపర్నికస్ ఆ సిద్ధాంతాలకు నిరూపణలు కల్పించాడు. ఈ విశ్వం గురించి అందరూ అర్థం చేసుకోవటానికి అవకాశం కల్పించిన గొప్ప శాస్త్రజ్ఞుడు 'నికలస్ కోపర్నికస్.'

స్వీకారం

బంగ్లాదేశ్
(ఉద్యమ చరిత్ర)
కంభంపాటి సత్యనారాయణ
వెల: రు. 1-50.
విశాలాంధ్ర ప్రచురణాలయం
ఏలూరు రోడ్డు, విజయవాడ - 2.

* * *

గురు భక్తి
(నాటికల సంపుటి)
జి యస్. కె. సాయిబాబా
వెల: 0-75 పైసలు
కె. ఏ. యస్. పబ్లికేషన్స్.
అనకాపల్లి, విశాఖ జిల్లా

* * *

ధన మూల మిదం జగత్
రంగధామ్ (నవల)
పేజీలు 199 : వెల రు. 2-50

* * *

రాక్షసీ నీ పేరు రాజకీయమా
ఆదివిష్ణు (నవల)
పేజీలు 159 వెల రు. 2-50

* * *

మనిషి - మచ్చ
వి. వి. యస్. రామదాసు (నవల)
పేజీలు 168. వెల రు. 2-50

* * *

వైతరణి
వానిరెడ్డి సీతాదేవి (నవల)
పేజీలు 160, వెల రు. 2-50

* * *

మొల్ల రామాయణము
పీఠిక కర్త:
బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
పేజీలు 192. వెల రు. 2-50
పైన తెలిపిన ఐదు గ్రంథాలకు:
యం. శేషాచలం అండ్ కో.
మచిలీపట్నం, మదరాసు, సికింద్రాబాద్.

* * *

కవీంద్ర-రవీంద్ర
(కవితా సంకలనం)
బేతంచర్ల రాజారావు
పేజీలు 58 : వెల రు 1-00
రాణీ పబ్లికేషన్స్
53/73-3 ఫోర్ట్, కర్నూల్.

రేడియో

సోమవారం జూలై 5
శక 1893 ★ ఆషాఢ 14

విజయవాడ

357.1 మీ. [840 కిలో సై.]

ఉదయం: 6-00 వందేమాతరం. శుభోదయం, ప్రసారవిశేషాలు; 6-10 భక్తిరంజని- ద్వాదశ లింగ స్తోత్రం; 6-40 అం. వా; 6-45 సూక్తిముక్తావళి; 6-50 పొలంపనులు; 7-00 తె. వా: 7-15 లలిత సంగీతం; 7-30 సంస్కృత పాఠం; 7-45 సంగీత శిక్షణ - జూనియర్లకు; 8-00 హిం. వా: 8-15 అం. వా: 8-30 హైదరాబాద్ వలె: 9-15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 ఉన్నత పాఠశాలలకు; 12-00 వాద్య బృందం; 12-30 కార్మికుల కార్యక్రమం; 1-00 చిత్ర తరంగిణి; 1-30 అం. వా: 1-40 పసిడిపంటలు; 1-50 తె. వా; 2-00 వాతావరణ సూచన; 2-01 వాద్య సంగీతము; 2-10 హైస్కూళ్ళకు; 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 కానుమాను పుష్పావతిదేవి - గాత్రం; 5-55 స్థానికప్రకటనలు; 6-00 అం. వా: 6-05 ప్రాం. వా: 6-15 బాల విహార్; 6-25 వ్యవసాయదారులకు; 6-30 చిత్ర తరంగిణి; 7-00 తె. వా: 7-15 వంట సీమలు; 7-45 యువభారతి; 8-15 ఆటల సమీక్ష: 8-25 యువభారతి; 8-45 హిం. వా: 9-00 అం. వా: 9-15 ఉభయ కుశలోపరి; 9-30 జానపద గేయాలు: 9-45 రసమయి - సాహిత్య కార్యక్రమం; 10-00 కానుమాను పుష్పావతిదేవి- గాత్రం; 10-30 అం. వా: 10-35 జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. [740 కిలో సై]

ఉదయం: 6-00 వందేమాతరం; 6-10 భక్తిరంజని: 6-40 గానసుధ: 7.00 తె.వా: 7-15 భక్తి సంగీత: 7-30 సంస్కృత పాఠం; 7-45 సంకీర్తనం: 8-00 హిం.వా: 8-15 అం. వా. 8-30 లలితా పంచనదన్. గాత్రం; 9-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11-45 ఉన్నత పాఠశాలలకు విజ్ఞానశాస్త్ర పాఠం. 8 వ తరగతి: 12-05 చిత్రసీమ: 12-20 హిందీ పాఠం: 12-30 కార్మికుల కార్యక్రమం: 1-00 మేడూరి నరసింహారావు, వీణ: 1-30 అం: వా: 1-40 చిత్రసీమ: 1-50 తె. వా, 2-00 వాతావరణసూచన, లలిత సంగీతం; 2-10 ఉన్నత పాఠశాలలకు; 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 విజయవాడ వలె: 5-55 ప్రసార విశేషాలు; 6-00 అం. వా: 6-05 ప్రాం. వా: 6-15 ఉ. వా, (హైదరాబాద్, కడపలు మాత్రమే): 6-25 వ్యవసాయదారులకు వార్తాప్రసారం: 6-30 గ్రామ సీమలు: 7-00 తె. వా. 7-15 వ్యవసాయ దారులకు: 7-30 మేడూరి నరసింహారావు, వీణ: 8-00 లలిత సంగీతం: 8-15 క్రీడా రంగ సమీక్ష: 8-30 విరామ సంగీతం: 8-35 ఈ రోజు పార్లమెంటులో: 8-45 చిత్రసీమ: 9-00 అం. వా: 9-15 వికాస తరంగిణి; 9 30 జానపద గేయాలు: 9-45 రసమయి. సాహిత్య కార్యక్రమం: 10-00 లలితా పంచనదన్ గాత్రం: 10-30 అం. వా: 10-35 వాతావరణ సూచన. జన గణ మన, సమాప్తి.

హైదరాబాద్ - (బి)

217.4 మీ. [1380 కిలో సై]

ఉదయం: 6-00 వందేమాతరం: 6-10 భక్తిసంగీత్: 6-35 హిం. వా: 6-40 అం: వా: 6-45 ఆంథోని మాథ్యూస్. వయొలిన్: 7-15 రేడియో కళాశాల: 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 2-00 చోటేఖాన్, తబ్లా: 2-10 ఉ. వా: 2-20 చోటేఖాన్, తబ్లా: 2-30 ఐహినోయ్ కేలియే: 3.00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 కర్ణాటక సంగీతం: 8-15 ఆంథోనీ మాథ్యూస్ - వయొలిన్: 8-45 హిం. వా: 9-00 ఫిర్మ్‌గావే: 9-15 ఉ. వా: 9-30 ఉర్దూలో కార్యక్రమం: 10-30 జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ (900 కి. సై)
సా॥ 5-30 నుండి రాత్రి 10-35 వరకు
శనివారములు మాత్రము
సా॥ 5-30 నుండి రాత్రి 11-05 వరకు

విశాఖపట్నం

322.6 మీ॥ [930 కిలో సై.]
ఉ॥ 6-00 నుండి 9-00 వరకు
మ॥ 11-55 నుండి 2-30 వరకు

మద్రాసు - (బి)

211.3 మీ. [1420 కిలో సై.]

ఉదయం: 6-50 వందేమాతరం, మంగళ ధ్వని: 7-00 తె. వా: 7-15 ఇత్తెక్కోలం. 7-30 జాన్ హిగ్గిన్స్- గాత్రం; 8-00 హిం: వా: 8-15 అం. వా. 8-30 ప్రసారసమాప్తి:

మధ్యాహ్నం: 1-00 పాశ్చాత్య సంగీతం. 1-30 అం. వా: 1-40 వాద్య గోష్ఠి 1-50 తె. వా: 2-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 పాశ్చాత్యసంగీతం 6-00 అం. వా: 6-05 కార్యక్రమ వివరణ 6-30 పేరింటి కాపురం - కథానిక: 7-00 తె. వా: 7-15 యువజనులకు విలువు: 8.15 ఆటల సమీక్ష: 8-25 గీతమాలిక: 8-35 ఈ రోజు పార్లమెంటులో: 8-45 హిం. వా: 9-00 అం. వా: 9-15 స్పాట్‌లైట్: 9-30 పాశ్చాత్య సంగీతం: (యువకులకు): 10-00 పాశ్చాత్య సంగీతం: 11-00 వాతావరణ సూచన, జన గణ మన - ప్రసార సమాప్తి

‘ఆంధ్ర వర్డ్స్ వర్త్’ కవికొండలవారి కథానికలు

బి. ఎ. లింకన్
ఎం.ఎ.

నేడు అటు పండితులనూ, ఇటు సామాన్య పాఠకులనూ అలరిస్తున్న సాహిత్య ప్రక్రియల్లో నవల, కథానిక ప్రధానమైనవి. వీటిలో కథ అధునాతనమైనది. తెలుగులో అధునిక కథా రచన గురజాడ అప్పారావు గారినుండి అరంభమైనదని స్థూలంగా చెప్పుకొనవచ్చును. ఎంత తీరికలేని పాఠకుడైనా అతి తక్కువ సమయంలో చదివి ఆనందించడానికి సాధ్యమౌతుందిగనుకనూ, పత్రికలు దీనిని అధికంగా ప్రోత్సహించడం వలననూ నవల కంటే హెచ్చు ప్రాచుర్యాన్ని కథానిక పొందగలిగింది. దీనిలో గూడా నవలలో వలెనే కథావస్తువు, సన్నివేశ కల్పనము, పాత్రచిత్రణము మున్నగువానికి ప్రాధాన్యత వుండడమేగాక తక్కువ వ్యవధిలో కథను చెప్పవలసి వుండడంచేత కథా రచయిత వీటి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధను తీసుకోవలసి ఉంటుంది. సాధ్యమైనన్ని తక్కువ పాత్రలతో దృఢమైన స్థలకాలవైవిధ్యతలతో వీలైనంత కట్టుదిట్టంగా కథను నడిపించవలసి వుంటుంది. కనుక పరిమాణంలో చిన్నదయినా నవల కంటే కథానికా రచనలోనే రచయిత ఎక్కువ ప్రజ్ఞను ప్రదర్శించవలసి ఉంటుంది.

పందొమ్మిదవ శతాబ్ది చివరి భాగంనుండి నేటివరకూ అనేకులు కథలను వ్రాశారు. అందులో చిరస్థాయిగా విలువను గలిగిన వారిలో కవికొండల వెంకటరావుగారొకరు. వీరు 1931 నుండి కథలు వ్రాయడం ఆరంభించి సుమారు మూడు వందల కథలు వ్రాశారు. వీనిలో రకరకాల ఇతివృత్తాలు కలిగిన కథలున్నాయి. సంఘంలోని వివిధ స్థాయిల్లో విభిన్న మనస్తత్వాలు గలిగిన వ్యక్తులు మనకీ కథల్లో ప్రత్యక్షమౌతారు. నిజంగా కవికొండలవారు తన చుట్టూ ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని ఎంత నిశితంగా పరిశీలించేవారో ఈకథలు చదువుతూ ఉంటే తెలుస్తుంది. కొన్ని కథలు చదువుతూ ఉంటే ఎంత విషాదంలో ఉన్నవాడైనా మనస్సంతా వికసించినట్లు నవ్వుకుంటాడు. మరి కొన్ని కథలు చదువుతూ ఉంటే ఎంత కఠినహృదయుడైనా ద్రవించిపోతుంది. ఇంకా కొన్ని కథలు చదివేటప్పుడు అమాంతం పుస్తకం మూసి, కళ్లు మూసికొని, తన జీవితంలో గడిచిపోయిన సంఘటనలను నెమరు వేసుకుంటూ కొద్ది సేపు వుండిపోతాడు పాఠకుడు. మరికొన్ని కథలు చదువుతూ ఉంటే 'అసలీయన ఈ కథనెందుకు వ్రాసినట్లు?' అనే మీమాంసలో పడిపోతాడు.

వీరి కథలు ముఖ్యంగా భారతి, వినోదిని, ఆంధ్రభూమి, ఆంధ్రశిల్పి, ఆనంద వాణి, ఆంధ్రపత్రిక మున్నగు పత్రికలలో ప్రచురితములైనవి. తరువాత కవికొండల వారే వీనిని 'సుమనోహారిణీ' శీర్షిక పేరుతో రెండుమూడు సంపుటాలుగాను "పొట్టి రవికలూ-వాలుజడలూ మరో పది కథలు", పెనుమంచలి జైనదేవుడూ మున్నగు పది కథలు" అనే సంపుటాలుగానూ ప్రచురించారు.

కవికొండల వారి కథల్లో అధికభాగం నవనాగరికతకు దూరమై, ఆర్థికంగానూ, సాంఘికంగానూ సంఘంలో అట్టడుగున లేదా దిగువ అంతస్థుల్లో జీవించేవారి ఇతివృత్తాలు కల్పిస్తాయి. కాని వీళ్ళల్లో ఉన్న అమాయకత్వం, మానవత్వం, ప్రేమ, జాలి, తృప్తి మరెక్కడా కల్పించవు

"మట్టెలరవళి" కథలో గోదావరి ఉబుకుతూ ప్రవహిస్తుంది. ఆ వరదలో లంకమీది కుటీరాలు, కుటీరాల్లోని జనం మునిగి కొట్టుకు పోవడం గట్టున చేపలమ్ముకొంటున్న అవ్వని చూచింది. ఆ చేపలన్నింటినీ వదలి వరదలో పెనిమిటి జాడ కనిపిస్తుందేమోనని వెదకుతూ గట్టమ్మటే వాలు పడవలా నడుస్తూ ఉంది. పన్నెండు గంటలైంది....మూడైంది....ఆరైంది. ఆ స్త్రీ నడుస్తూనే ఉంది ఆమె పెనిమిటివరదలో కలపనూ,అడవికొమ్మల్నూ,కోడెత్రాచు,తోకనూ పట్టుకుంటూ, వదలిపెడు వరదలో పెనుగులాడుతున్నాడు. ఏమి చేయటానికీ అశక్తురాలైన ఆ స్త్రీ భర్తను చూస్తూ గట్టుమీద నడుస్తూనే ఉంది. ఆమె కాలినున్న మట్టెలు రవళిస్తూనే ఉన్నది. చీకటి పడింది. భర్త ఒడ్డు చేరాడు. ఇద్దరూ కూలబడ్డారు గట్టు మీద. "ఈత్తున్నంతసేపూ నేను విన్నాది ఈమట్టెల చప్పుడునే" అన్నాడు నాగడు "మరీ పొద్దల్లా నీకోసమై ఈ గట్టుమీద నడచిందెవరను కున్నావు? నేనే? ఈ మట్టెల్లో నేనే?" అన్నదాపిల్ల. కథమొదలు పాఠకుడు కూడా వరద వేగంలో కొట్టుకు పోతాడు కథావాహినిలో అద్భుతమైన సస్పెన్సుతో పాఠకుడుక్కిరి బిక్కిరి అవుతాడు. వరద దృశ్యాన్ని కళ్ళకు గట్టినట్లు చూపిస్తారు రచయిత. భార్యాభర్తలసమాగమంతో, వారి సంభాషణతో కన్ను చెమర్చుతుంది పాఠకునికి.

'పల్లమ్మ' మొగుడు త్రాగుబోతు. పనీ, పాటా లేకుండా త్రాగివచ్చి, రోజంతా కట్టెలు కొట్టి గంజికి నాలుగు దమ్మిడీలుసంపాదించుకొచ్చిన భార్యను చావబాదడం మాత్రమే వానికి చేతనౌను. ఒకనాడు పల్లమ్మను పాము కరచింది.

కల్లు మోసుకెళ్ళే లారీలో ఆమెను పట్నం చేర్చారు. అక్కడ లారీతెచ్చే కల్లుకోసం ఎదురు చూస్తున్నాడు పల్లమ్మ మొగుడు. లారీ కల్లుతోపాటు పల్లమ్మనూ తెచ్చింది. "నా పల్లాలూ! ఇక్కడికెలా వచ్చింది?" అంటూ వాడు అమె పడున్న చోటికెళ్ళాడు. ఏం చేయగలడు? పల్లమ్మ ఆఖరు చూపు సగం తెరచి "నా బావా! ఈ ఏలప్పుడు నేపింటివద్ద సావడమంటూ ఉంటే నిన్ను చూణ్నేలేక పోయిందాన్నేమో! ఇక్కడ చస్తున్నాను కాబట్టి నిన్ను చూడగల్గుతున్నాను. పుణ్యాత్మురాల్ని" అంటూ ప్రాణం వదిలింది. ఈ కథ చదివి ఎవడైనా కంటనీరెట్టకపోతే అతడు మానవుడే కాడు. పేదవాళ్ళలో ఉండే పరస్పరానురాగాన్ని చక్కగా చూపిస్తారు రచయిత

కాని, వెంకటరావుగారికి స్త్రీ ప్రేమమీద నున్న విశ్వాసము, పురుషులు ప్రదర్శించే ప్రేమ యెడల ఉన్నట్లు కన్పించదు. ప్రతి కథలోనూ స్త్రీయే ఎక్కువ త్యాగం చేస్తుంది ప్రేమను వర్షిస్తుంది. 'అడవి ప్రేమ'లో పెళ్ళికాని పడుచుజంట బొర్రదొర, దుమ్ములమ్మ, అర్ధరాత్రి ఏకాంతంలో కలుసుకుంటారు. ఇంతలో ఒక పెద్దపులి జంట వారి గూడెంలోకి వస్తుంది. బొర్రదొర తాడిచెట్టెక్కుతాడు దుమ్ములమ్మ తాడిక్రింద నిల్చుని భయంతో "ఒరే! ఏలారా?" అని అడుగుతుంది. బొర్రదొర తాటిముట్టలో కూర్చొని పులుల చేష్టలుగురించి ప్రత్యక్ష వ్యాఖ్యానమిస్తుంటాడు, ఇంతలో ఒక ఎలుగు తాటిచెట్టెక్కబోతుంది దుమ్ములమ్మ దాన్ని పైకెక్కనీయకుండా దాని రెండు కాళ్ళమీద తన పాదాలు అణచిపెట్టి, దాని చేతుల్ని అటొకటి, ఇటొకటి తన చేతులతో ముందుకు ఉంచి తాటిచెట్టుకు రాచుకుపోయేలా రాపాడుతుంది గుండెకాయ వెలికి వచ్చేదాకా. బొర్రదొర దిగివచ్చాక దుమ్ములమ్మ అంటుంది "నా వంటి ఆడదానికి ప్రేమ గుండె నంటి పెట్టుకొని ఉంటుంది. దొరా" అని.

ఇలాంటి నిరుపేద దంపతుల ప్రేమనూ స్త్రీ ప్రేమలోని ఔన్నత్యాన్ని తెలిపే కథలూ, హృదయాన్ని ద్రవింప జేసే కథలు మరెన్నో ఉన్నాయి. పేద దంపతులకూ ధనవంతులైన భార్యా భర్తలకూ మధ్యనుండే అనురాగంలోని తారతమ్యాన్ని 'అదిలేకపోతే' అనే కథలో చక్కగా చూపిస్తారు. బసివి, బసవయ్యలు కిరోసిన్ డిపోలో పని చేస్తుంటారు. అక్కడే వారి కాపురం. ఒకనాడు బసివి కష్టపడి శిశువును ప్రసవించింది. ఆ తరువాత ఒకనాడు కొందరు సంపన్న గృహిణులొక సభ నేర్పాటుచేసి బసివిలాంటి వాళ్ళను పిలిచి, "పిల్లలు కలిగే విధంగా మీ భర్తలతో ప్రవర్తించవద్ద"ని ఉపదేశిస్తారు. బసివి అంటుంది, "ఓ ఉపన్యాసమ్మగారూ! అదీ లేకపోతే, మేం చచ్చిపోతాం తల్లీ ఈ అంధకార బంధురంలోపడి, తల్లీ మాకు భాగ్యభోగ్యాలు లేనేలేవు. అదైనా ఉంచండి" రోజంతా శ్రమపడి, డబ్బు అందించే సర్వసౌఖ్యాలకూ ఆనందాలకూ దూరమైన ఆ శ్రమజీవులు అంత హాయిగా నిద్రపోవడానికి గల కారణాన్ని కవికొండల వారు బసివి నోట చెప్పించారు. అలాగే 'లిగాడు'లో లిగాడు త్రాగడానికి వెళ్తే లికత్తై వాడికోసం ఎదురుచూస్తూ, ఉన్న కొద్దిగంజి వాడికోసం అట్టిపెట్టి ఎదురుచూస్తూ ఉంటుంది. అదే కథలో రైలు డ్రైవరు ఎలూఫ్ త్రాగడానికి పోతే వానిభార్య క్లబ్బుకు పోతుంది. ఎంత తేడా! ఈ రెండు తరగతుల దంపతుల దాంపత్యంలోని భేదాన్ని కవికొండలవారు ఎంతో చక్కగా చిత్రిస్తారు ఈ కథలో.

పేదవాణ్ణి చూస్తే పేదవాడికి కలిగినంత జాలి ధనవంతునికి కలుగదు. ఇది మనం కొద్ది పరిశీలనతో తెలిసికొనగలిగిన సత్యం. 'సానుభూతి'లో ఒక రిక్షా కుర్రాడు లాగుడు రిక్షాను కొండమీది విహారమహల్‌కు లాక్కెళిపోతుంటాడు. రిక్షాలో పెద్దమనిషి తొందర పెడుతూ వుంటే, క్రొత్తగా పరచిన కంకర రోడ్డుమీద బండిలాగుతున్నాడు. అంతలో ఒక మొనదేలిన రాయి అతని కాలిలో గుచ్చుకుంది. కాలిని విదిల్చాడు గట్టిగా. రక్తంతో ఎర్రనైన రాయి ఊడి రోడ్డుమీద పడింది. అక్కడే కూలి పనిచేసే ఒక ముసలిది ఆ దృశ్యం చూచి ఆ కుర్రవాణ్ణి గురించే ఆలోచిస్తూ, రొట్టె ముక్కా, మంచినీళ్ళూ కొండమీదికి తీసికొనివెళ్ళి అలసిపోయిన కుర్రవాడికందిస్తుంది యీ కథ చదివితే ముసలి దాని ఔదార్యం తలుచుకొంటే మనసు విగ్గేస్తుంది, ఇలాంటి చక్కని కథలు, మనలను మనం మరచిపోయేట్లు చేసేకథలు. చక్కని నీతులుచెప్పే కథలు కవికొండల వెంకటరావుగారు ఎన్నెన్నో వ్రాశారు. 'గానుగెద్దు'ను అప్పులవాడు తోలుకెళ్తే తానే ఎద్దయి గానుగను త్రిప్పిన పత్తెయ్యను తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. 'రాముడూ! ఇంకా ఇంజరంబండి రాలేదూ!' కథలో రోజంతా రైల్వే లైనుమీద పనిచేసి రాత్రికి వీలైనంత త్వరగా భర్తను చేరుకోవాలనే తహతహతో ఎదురుగొస్తే మెయిల్ ఎక్కబోయి రైలు క్రిందబడి ముక్కలైపోయిన సూరి తలంపుకు వస్తే హృదయం ద్రవించిపోతుంది. 'ఎన్ని అమావాస్యలు'లో పఠాన్‌కు కట్టవలసిన వడ్డీ గురించి ఆలోచిస్తూ పోలీసు సూపరింటెండెంటుగారి కారు క్రిందబడి కనులేకుండా స్వర్గస్థురాలైన పాకిది గుర్తు వస్తే మనసు ద్రవించిపోతుంది. నిజంగా ఇలాంటి పాత్రలను, ఇలాంటి సన్నివేశాలను సృష్టించిన కవికొండల వెంకటరావుగారి పరిశీలనా పటిమ, ప్రజ్ఞ అనన్యసామాన్యములు

ఇక కొన్ని కథలు చక్కని హాస్యాన్ని అందిస్తాయి "పడకగది-వంటగది"లో కర్పూరారావు సంపన్నుడు, చదువుకున్నవాడు, సరదామనిషి, భార్య శశికాంత మాటకారి. ఇక్కడ వారి సంసారం ఎలా ఉంటుందో ఒక సన్నివేశంలో చూపిస్తారు. కడుపు చెక్కలయ్యేట్లు నవ్విస్తూ కర్పూరారావుకు సినీతారల పటాలంటే మోజు. వాటిని తెచ్చి గోడలకు తగిలించే భర్తకు పాఠం చెప్పడంకోసం ఒకనాడు భర్త వచ్చేసరికి పడకగదిలోని బొమ్మలన్నింటిమీదా న్యూస్ పేపర్లు అంటించి వేస్తుంది

భార్యామణి. పన్రెండు కొట్టడంతోనే భర్త వచ్చి లాల్చీ చేతులు పైకెగదోసుకుంటూ 'హూడాసేవ్! ఆ రాయి యిలాతే!' అంటూ మేకుకొట్టిన పటం తగిలించి కాళ్ళు కడుక్కోవడానికి పెరట్లోకి వెళతాడు. తిరిగి వచ్చేలోగా శశికాంత ముందుగా మ్యాగజైన్ల నుండి కత్తిరించి పెట్టుకున్న గోరిల్లా బొమ్మ దానిమీద అతికించి వేస్తుంది. ఆ భర్త వచ్చి, భోంచేసి, పడకగదిలో ప్రవేశించాక వారి సంభాషణ ప్రతియొక్కరూ చదివితీరవలసిందే! ప్రతిపదం పాఠకుణ్ణి పొట్ట పగిలేట్టు నవ్విస్తుంది.

మరి కొన్ని హాస్యరస ప్రధానములైన కథల్లో మూఢనమ్మకాలను సాంఘిక దురాచారాలను, దురలవాట్లనూ, ప్రభుత్వ సంస్థల్లోని లొసుగులనూ వ్యంగ్య ధోరణిలో చిత్రిస్తారు 'పర్వ-అపర్వ-సహపంక్తి' కథలో రిటైర్డు డిప్యూటీ కలెక్టరు సిరియాళరావుగారు అవర్ణులకూ సవర్ణులకూ కలిపి తమ యింటి చావట్లో భోజనం ఏర్పాటు చేస్తారు. భార్య పద్ధతికి అంగీకరించదు. కాని ఆమె పిన్నిగారు తలమాసినయామె వడ్డించడానికి వస్తుంది. పొడవైన కురులతో, మాంచి టాయిలెట్టుతో, కాని చివరకు వచ్చేసరికి, చివర కూర్చున్న వ్యక్తికి పెరుగు వడ్డించడంలో విగ్గు కాస్తా ఊడి విస్తట్లో పడుతుంది.

'పన్యేందిర' కథలో వడ్డీ వ్యాపారి విశ్వనాథం హాస్యానికాలవాలం. 'కారుక్లీనరా - హొటల్ క్లీనరా'లో యజమాని ఉంపుడుగత్తెకోసం కారుక్లీనరు పడేపాట్లు, 'రొమాన్సు పెళ్ళి'లో పెళ్ళి కాకుండా జంటలుగా ఒంటరిగా తిరుగుతూ ఉండే కాలేజి విద్యార్థిని విద్యార్థుల ఊహలూ, ఇబ్బందులూ - ఇవన్నీ చదువుతూఉంటే చదువుతున్నంతసేపూ చక్కని హాస్యం లభ్యమౌతుంది. మన సంఘంలోని లోటుపాట్లను గూర్చిన ఆలోచనలూ ముసురు కొంటాయి. 'అపురూప సుందరి'లో లారీ క్రింద పడబోతున్న చిన్నపిల్లను కాపాడబోయి తానే లారీకి బలియైన శ్రీమన్నారాయణ సింగు శవంమీద దేవాలయం కట్టి ఆ దేవాలయాని కతనిపేరే పెట్టిన ప్రజల విశ్వాసమును తలచుకుంటే ఒకవంక నైరాశ్యము, మరొవంక ఆ దౌర్భాగ్యునిపై జాలికలుగుతాయి. 'కాకికి కంపార్ట్‌మెంటర్ వైద్యం'లో అసలు పేషెంటు మనిషో, పక్షియో చూడకుండా చీటీవ్రాసిన హాస్పిటల్ గుమాస్తాను, దానికి ఏ రోగమో తెలిసికోకుండా కన్ను పీకించమని, పళ్ల పీకించమనీ ప్రిస్క్రిప్షన్ వ్రాసిన కంట, పండ్ల స్పెషలిస్టులనూ తలచుకుంటే నిజంగా మన ప్రభుత్వమువారి ఆస్పత్రులలోని ట్రీట్‌మెంట్ విధానం కళ్ళకు గట్టినట్లు తెలుస్తుంది. 'ఇంకా మెయిల్ నడుస్తూనే ఉంది' లో రైలంతా కిటకిట లాడుతూంటే ఇద్దరు వ్యాపారస్తులు తమతో వున్న గాజు వస్తువుల పెట్టెతో ఒక బెర్తు అంతా ఆక్రమించుకుంటే, మరో ఇద్దరు పెద్దమనుష్యులు తమ మడి టిఫిన్‌తో మరో బెర్తు ఆక్రమించుకుంటారు. యింకో బెర్తుపై నూతన దంపతులిద్దరు పరస్పరం కౌగలించుకొని మరొకరు అటువైపు చూడడానికైనా వీలులేకుండా పడుకుంటారు. తెల్ల బట్టలవాళ్ళు కావడంతో వాళ్ళను గట్టిగా అడగడానికెవరూ సాహసించరు. ఒకవేళ సాహసించినా గాజు వస్తువులు పగిలిపోతాయనీ. టిఫిను మైల పడిపోతుందనీ సమాధానం చెబుతారే గాని మరొకరికి స్థలం యివ్వరు. తీరా చీకటి పడేసరికి మడిటిఫినూ, గాజు సామానూ పెట్టే ఇల్లల క్రిందికిపోతాయి. ఇల్లల మీది వాళ్ళు గుర్రెట్టి నిద్రపోతారు. ఇలాంటివి సర్వ సాధారణంగా మనం మన రైళ్ళలో చూస్తూనే ఉంటాము, ఇతరుల ఇబ్బందిని గమనించకుండా స్వార్థంతో ప్రవర్తించే రైలు ప్రయాణీకులను వ్యంగ్య ధోరణిలో చిత్రించిన సన్నివేశమిది ఎంతో నవ్వు పుట్టించేవిధంగా కవి కొండల వారు ఇలాంటి సన్నివేశాలను చిత్రిస్తారు. తద్వారా మన పనులకు మనమే సిగ్గుపడేట్లు చేస్తారు. "కలుపు తీతలా కొందరిని ఈ ప్రపంచంలోంచితీసేస్తే లోకం కిన్నెరలోకమో కింపురుషలోకమో కాగలదని నా నమ్మకం" అంటారు కవికొండల. 'బస్సుకుషన్' అనే కథలో బస్సు సీటు మీద ఒక వైపు ఇద్దరు కుర్రాళ్ళు కూర్చొని ఉంటారు. వాళ్ళ ప్రక్కన ఒక పండు ముసలి వచ్చి కూర్చుంటుంది. రెండో వైపు ఇద్దరు పడుచు పిల్లలు కూర్చోబోతారు. కాని నలుగురూ లేచి ఒక్క ముసలికి సీటంతటినీ వదలివేస్తారు. దుర్గంధంభరించలేక అలాంటి వాళ్ళందరినీ ఎరిపేయాలంటారు రచయిత. భార్యలు భర్తల ఉద్యోగ నిర్వహణలో కలుగజేసుకుంటేకలిగే యిబ్బందులను 'ఉద్యోగపు బుద్ధి'లో చూపెడతారు. ఒక్కొక్కప్పుడు పెద్ద ఆఫీసర్ల బుద్ధి ఎంత నైచ్యానికి దిగజారుతాయో చెప్పకనే చెబుతారు 'యువర్ వైఫ్' అనే కథలో.

కవికొండల వెంకటరావుగారు కథలు వ్రాస్తూ ఉన్న రోజుల్లో దేశంలో స్వాతంత్ర్యోద్యమం తీవ్రంగా సాగుతుండేది. ఆ ముచ్చట్లు కొన్ని కథల్లో చెబుతారు. 'డ్యూయల్ డస్కులా - సింగిల్ డస్కులా' అనే కథలో రాజమహేంద్రవరం విద్యార్థులంతా సమ్మె కట్టినా బోధనాభ్యాసన కళాశాల వారు మాత్రం సమ్మె చేయలేదు. విద్యార్థుల్లో ఐకమత్యం లేకుండా చేయడానికి గాను ఆనాడు కళాశాలలోని డ్యూయల్ డస్కులు తొలగించి సింగిల్ డెస్కులు వేస్తారనే రూమరు రావడమే ఇందుకు కారణం. అందరి జేబుల్లోనూ వందేమాతరం కరపత్రాలూ, భరతమాత పటం, లాల్-బాల్-పాల్ పటాలూ ఉన్నాయి. పాఠం చెప్పవచ్చిన భారతీయ మాస్టారు తెలివిగా వాటిని విద్యార్థుల వద్ద నుండి తీసివేసుకున్నారు. అంతలో ప్రిన్సిపాల్‌గారు వచ్చి విద్యార్థుల జేబులు తడిమి వారి వద్ద ఎటి 'అభ్యంతరకరమైన' వస్తువులూ లేకపోవడంతో వారిని తెగపొగిడి మరునాడు శలవు ప్రకటించారు. ఈ కథలో అనాటి కళాశాలల్లో ఎటువంటి వాతావరణం ఉండేదో స్పష్టంగా కల్పిస్తుంది.

పై కథలన్నింటిలోనూ చక్కని సన్నివేశ కల్పనమూ, పాత్ర పోషణమూ కన్పిస్తుంది. ఇంకా ఇలాంటివే చిరకాలం నిలిచే మంచి కథలు '786 శకుంతల', 'ఈ గండం గడవనివ్వండి' వంటివి అనేకం ఉన్నాయి. కాని కొన్ని కథలు కొంత నిరాశను కలిగిస్తాయి. కొన్ని కథలు ఆరంభంలో ఎంతో ఆసక్తిదాయకంగా ఉంటాయి. కాని ఎక్కడోచివరను తేలిపోతుంది. కొన్ని పాత్రలు ఉన్నట్లుండి తగినంత కారణం లేకుండా తమ ప్రవృత్తికి భిన్నంగా ప్రవర్తించడం (సన్యేందిర) ఇతివృత్తంలో బిగువు సడలి వక్రమార్గాన్ని త్రొక్కడం' (అనుకోని లౌ. అనుకోని కిస్), అవసరమైన దానికంటె అధికంగా పాత్రలను, సన్నివేశాలను ప్రవేశ పెట్టడం (ఆ రోజుల్లో విన్న సంగతిమిన ఈ రోజుల్లో ఒక కల్ప, మొదలైనవి దీనికి కారణం. మరికొన్ని కథల్లో చక్కని సన్నివేశాన్ని కల్పిస్తారు. కాని కథా కథనంలో నిర్లక్ష్యం వలన రావలసినంత ఎఫెక్ట్‌రాదు (ఎవరిభార్య దొడ్డది?) కొన్ని కథలుబొత్తిగా చిన్న పిల్లలకు చెప్పే పరమానందయ్యశిష్యుల కథల్లాగుంటాయి. 'మంచన్న పరధ్యానం', 'మాయగాక మరేమిటని' మొదలైనవి ఈ తెగకు చెందినవి. కొన్ని కథలు కథలు అనిపించుకోవు ఎవరోయిద్దరువ్యక్తులుఎదురై చమత్కారరహితంగా ఏవో నాలుగు మాటలు మాట్లాడుకుని ఎవరి దారిని వారు పోవడంతో కథ కంచికి వెళుతుంది. 'ఓ. కె. డెన్' అలాంటి కథల్లో ఒకటి కొన్ని ఏదో లీగల్ ప్రాబ్లెమ్సుతో కూడినవై ఉంటాయి. వీనిలో సామాన్య పాఠకుడంతగా ఆనందించలేడు. 'వస్తువుల బలుపు' లాంటివి కొన్ని కథల లాంటివి వున్నాయి. పోతే కథ మధ్యలో అక్కడక్కడ కవికొండలవారు చిన్నచిన్న గేయాలు వ్రాస్తూ వుంటారు. ఇవి కథాగమనాని కడ్డం తగులుతూ పాఠకునికి కొద్దిగా బాధను కలిగిస్తాయి. అక్కడక్కడ కథ మధ్యలో ప్రకృతిని, పరిసరాలను వర్ణిస్తుంటారు. ఈ విధమైన విస్తృతమైన వర్ణనలు గేయములలో ఇమిడినంతగా కథానికలో ఇముడవు. కథలో బిగువు సడల కూడదు. అంటే ప్రతి పదాన్నీ తూచితూచి ప్రయోగిస్తే కథ ఎక్కువ రసానుభూతిని కలిగించి, పాఠకుని హృదయంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ వర్ణనల వలననే కొన్ని కథలు ఆశించినంత ఆనందాన్ని కలుగజేయవు. మరొకటి కొన్ని కథల్లో అక్కడక్కడ రచయిత అడ్డువస్తూ ఉంటారు. రచయిత కథను చెబుతూ "ఇది నిజంగా జరిగిన సంగతే; కాని పాఠకులు దీన్ని ఒక వార్తగా అందుకుంటే బాగుంటుందని అభిప్రాయం...అరే! అప్పుడే నిజం కల్లగా మారిపోయెనే" తప్పనిసరిగా వ్రాయవలసి వస్తాయి. కొన్ని సంగతులు పాఠకుణ్ణి పట్నంలో ఓమూల నుంచి ఇంకో మూలకు తీసుకుపోవాలీ అంటే ఎలాచెప్పండి! అంటూ రచయిత పాఠకుణ్ణి సంబోధిస్తారు. కథకుడు సాధ్యమైనంతవరకూ పాఠకునికి ముఖాముఖిగా ఏమీ చెప్పగూడదు. చెప్పదలచుకున్న దానిని పాత్రల ద్వారా చెప్పించవలె లేదా మరో విధంగా సూచించవలె గాని పాఠకుణ్ణి సంబోధించగూడదు అలా కాకపోతే అంతవరకూ కథలో లీనమై తన ఉనికిని మరచిపోయిన పాఠకుడు తన అస్తిత్వాన్ని గుర్తించి పాత్రలకు దూరమై 'నేను చదువుతున్నది కథ మాత్రమే' అనుకునే ప్రమాద మున్నది కాని ఆ రోజుల్లో ఇతర రచయితలు గూడ ఈపని చేస్తూ ఉండేవారు. ఈనాటిపాఠకునికిమాత్రం ఇది కొంచెంఇబ్బంది కలిగిస్తుంది కొద్దికథల్లో ఒక రకమైన (అబ్‌స్క్యూరిటీ) కన్పిస్తుంది. పాఠకుడు తాను చదువుతున్న దానిని పూర్తిగా అర్థం చేసికోలేక అయోమయంలో పడిపోతాడు.

పైని చెప్పిన స్వల్ప లోపాలున్నా చందురునిలో మచ్చల్లాగు వీరి రచనల్లోని సద్గుణాలముందు అవి అంతగా చెప్పుకొనదగినవి కావు. వీరి రచనలో ఒక ప్రత్యేకత ఉంది. అడుగడుగునా వీరి ముద్ర స్పష్టంగా కన్పిస్తూ ఉంటుంది. చూడటంతోనే 'ఇది కవికొండల కథ' అని సులువుగా గుర్తుపట్టవచ్చును. సంఘంలోని అన్నిరకాలవ్యక్తులూ వారి అభిరుచులూ, జీవన విధానాలూ, కష్టాలూ, సుఖాలూ, అనుభూతులూ, అనుభవాలూ వీరిరచనలలో ప్రత్యక్ష మౌతాయి. వీరి పాత్రలన్నీ సజీవంగా మనముందు నటిస్తాయి. హృదయంలో హత్తుకు పోతాయి. ఇది వారి పాత్ర సృష్టిలోని ప్రత్యేకత. వీరికి 'అంధ్రావర్డ్స్‌వర్త్' అని బిరుదు మున్నది. జానపదుల జీవితంలో ఉన్న ఆనందం, సంతృప్తి, పట్టణ వాసపు కృత్రిమ జీవితాల్లో లేదని విశ్వసించిన వాడు వర్డ్స్‌వర్త్. కవికొండల కథల్లోనూ ఈ తత్త్వం స్పష్టంగా బయల్పడుతుంది. వీరి మంచి కథల్లో అధిక భాగం పల్లీయ జీవనానికి సంబంధించినవే. భాష ఎంతో సుందరంగా, సరళంగా ఉంటుంది. మన ఎదుట ఒక మిత్రుడు కూర్చుని కథ చెప్తున్నంత సాఫీగా సాగిపోతుంది. హృదయాన్ని ఆవేదనలో ముంచివేసే బరువైన కథలూ ఉన్నాయి. వ్యంగ్య ధోరణిలో మనలోని లోటుపాట్లను మనం తెలిసికొనేటట్లు చేసే కథలూ ఉన్నాయి.

తెలుగులో ఒక కథా ప్రపంచాన్నే సృష్టించిన 'కథక చక్రవర్తి' శ్రీకవికొండలవేంకటరావుగారు ఈ లోకాన్ని వదలిపోవడం మన దురదృష్టం. త్వరలో వారి ద్వితీయ వర్ధంతి రానున్నది. ఈ సందర్భములో వారినీ, వారు ఆంధ్రసాహిత్యమునకు చేసిన సేవనూ ప్రస్తుతించడం మనవిధి. ఈనాడు వారు భౌతికంగా మన మధ్యను లేకపోయినా ఆంధ్రజాతి ఉన్నంతవరకూ వారి కథలు నిలిచి ఉంటాయి. అవి నిలిచి ఉన్నంతవరకూ వారు జీవించే ఉంటారు.

యోధులైన రచయితలు

—టి. ఎమ్. సి. రఘునాథన్

ఊసుపోక దారిపోతూ
తుంచిపోసే పువ్వుమాదిరి
బ్రతుకు నాకొప్పదు.
నా కలం వాడికత్తిలా
చీరి చెరిగెయ్యాలి
ఉక్కు పరిశ్రమకున్న ఖ్యాతినీ
సంతరించుకోవాలి
రాజ్యాంగంలో భాగంగా
నా కవితకొక పీఠం
సమకూడాలి.

ప్రముఖ సోవియట్ కవి మయకోవ్‌స్కీ వ్రాసిన ఈ అమరగీతం, రచయిత కర్తవ్యం ఏమిటో సరిగ్గా, సమర్థతతో వివరిస్తుంది.

కాని, ప్రపంచంలో కొన్ని దేశాలలో కొందరు రచయితలు ఇంకా రచయిత ఆకాశ హర్మ్యాలలోనే గూడుకట్టుకు కూర్చోవాలనీ, ఈ అలగా జనంతో కలియకూడదనీ, సమాజంతో పొత్తు పెట్టుకోని కళాసాహిత్యాల గురు పీఠంలా వుండాలనీ నమ్ముతూన్నారు. కాని సోవియట్ రచయితల విశ్వాసం వేరు, ఏ వ్యక్తి సమాజంలో జీవిస్తూ, దానికి వెలిగా వుండలేడు. రచయిత అసలే వుండలేడు— అంటారువారు. జీవితాన్నీ, పరిసరాలనూ అతడు విడిచిపోలేడు. అందుచేత ప్రతి రచయితా జీవితం గురించి, సామాజికదృక్పథాలు గురించి, భావాలు గురించి ఏదో ఒక దృక్పథాన్ని చెప్పవలసే వుంటుంది. ఈ సత్యాన్ని నిరాకరించి, తనసామాజిక బాధ్యతనూ, పౌరధర్మాన్నీ పూర్తి చేయడానికి జంకితే ఆయనను చరిత్ర మరిచిపోతుంది. ఆతనిగురించి చెప్పుకొనేవాడు, కన్నీరు పెట్టేవాడు, మర్యాద చూపేవాడు వుండడు. క్లుప్తంలో చెప్పాలంటే ప్రజల్ని మరచిన రచయితను ప్రజలూ మరుస్తారు.

సోవియట్ రచయితకి సత్యం తెలుసు. అంతేగాదు. సామాజిక బాధ్యతవున్న రచయిత ప్రేక్షక మాత్రుడుగా వట్టి వ్యాఖ్యాతగా మాత్రమే వుండిపోరాదనీ సమాజ పోరాటాలలో, కృషిలో గట్టిగా పాల్గొనాలనీ భావిస్తాడు. అర్ధ శతాబ్దానికిపైగా సోవియట్ రచయితలో పెంపొందిన ఈ ఉదాత్త, ఉన్నతాశయాలు దీనికి సాక్ష్యం

ఇరువదవ శతాబ్దిలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం విప్లవ విఘాతుక శక్తుల ద్వారానూ, ప్రత్యక్ష జోక్యం ద్వారానూ ప్రపంచంలో ప్రప్రథమంగా ఏర్పడిన సోషలిస్టు రాజ్యాన్ని మొగ్గలోనే తుంచివేయ్యా లనుకున్నప్పుడు సోవియట్ రచయితలు ప్రేక్షకులుగా వుండిపోలేదు. కమ్యూనిస్టులూ, పార్టీ సభ్యులు కాని వారూ అంతా పార్టీ సైనికులమనీ దాని రాయబారులమనే అనుకొన్నారు

ప్రథమ పంచవర్ష ప్రణాళికల కాలంలో సోవియట్ రచయితలు పద్దులురాస్తూ కూర్చోలేదు. అతి వేగంగా, అత్యధికంగా దేశాన్ని మార్చివేస్తున్న ఘటనలలో ఉత్సాహంతో పాల్గొన్నారు. దేశంలోని పెద్ద పరిశ్రమలకూ, సమష్టిక్షేత్రాలకూ, నిర్మాణ ప్రాజెక్టులకూ వెళుతున్న షాక్ బ్రిగేడ్‌లతో చేరేరు. ఆ అనుభవాలతో వ్రాసిన గ్రంథాలలో ఆ నిర్మాణ దశలో సోవియట్ ప్రజలు కనబరచిన వీరత్వం ప్రతిబింబించింది.

పోరాటమూ, పునర్నిర్మాణమూ జరుగుతున్న ఆ కష్ట దినాలలో రచయితలు విప్లవ కాలంలోలాగానే ఏకాగ్రతతో తమ సిద్ధాంత సూత్రాలను దృఢపరచుకొన్నారు, కమ్యూనిస్టు ఆశయాల యెడ తమ పక్షపాతాన్ని నిరూపించేరు. రచయిత పవిత్ర కర్తవ్యానికి అవమానం ఘటించేవాని యెడ తీవ్ర వ్యతిరేకం కనబరచేరు. ఆ దినాలలో సోవియట్ రచయితలు వాస్తవ స్వదేశాభిమానులుగా, అంతర్జాతీయ వాదులుగా, ప్రపంచ భవిష్యత్తు గురించి విశేష శ్రద్ధ కలవారుగా వ్యవహరించేరు.

యూరపియన్, అమెరికన్ సామ్రాజ్యవాదుల పోషణలో జర్మన్ నాజీజమ్ బలం కూడగట్టుకొంటున్న కాలంలో, మాక్సిమ్‌గోర్కీ పెట్టుబడిదారీ ప్రపంచ రచయితలకు సూటి ప్రశ్న వేసి. "సంస్కృతీ నాయకులారా మీరు ఎవరి పక్షం?"- అన్నారు. సోవియట్‌కు వ్యతిరేకంగా సాగుతున్న యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకించమనీ, నూతన ప్రపంచ యుద్ధ ప్రమాదాన్ని ప్రతిఘటించమనీ ఆ రోజుల్లోనే మాక్సిం గోర్కీ, ఇతర రచయితలూ పాశ్చాత్య రచయితల్ని కోరేరు.

యుద్ధం ప్రారంభం అయింది. సోషలిజం లేకుంటే, తమ సోషలిస్టు మాతృదేశం లేకపోతే కళకు స్వేచ్ఛ వుండదని గాఢంగా విశ్వసించిన సోవియట్ రచయితలు దేశరక్షణ మహాయుద్ధంలోకి పురికేరు. యుద్ధకాలంలో వారు నిస్వార్థంగా, ధీరత్వంతో పనిచేశారు.

అంతకు పూర్వం స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు ఇల్యా ఎహ్రెన్‌బర్గ్, అలెగ్సీ టాల్‌స్టాయి మొదలైన సోవియట్ రచయితలు అన్ని దేశాలలోని రచయితలతో సోదర భావం నెరపే అంతర్జాతీయ దృక్పథంతో యుద్ధ జ్వాలలలోవున్న స్పెయిన్‌కు వెళ్ళేరు.

అంతకు ముందే చెప్పినట్లు రచయిత ఎప్పుడూ రాజకీయ వాస్తవానికి, వాస్తవ జీవితానికి దూరంగా వుండలేడు, సోవియట్ రచయిత పుస్తక రచనకే పరిమితుడు కాడు అతని కార్యక్రమాలు ప్రజలతో, వారి సృజనాత్మక కృషితో విస్తృతంగా, బహురూప సంబంధాలు పెట్టుకొని కొనసాగుతాయి. సోవియట్ సమాజం యొక్క స్వభావం నుంచి ఉత్పన్నమయ్యే అతని సామాజిక పాత్ర ఫలితంగానే ఆ సంబంధాలు ఏర్పడతాయి. అందు చేతనే సోవియట్ జీవిత రంగాన్నింటితో సోవియట్ రచయిత సగాఢ సంబంధాలు, కలిగివుంటాడు

ప్రపంచాన్ని కమ్యూనిస్టు పద్ధతులమీద పునర్నిర్మించే సాధనాలలో అతని సాహిత్యం ఒకటవుతుంది. అదే విధంగా ప్రపంచమంతటా శాంతి, న్యాయం, సామాజికాభివృద్ధి నెలకొనడానికై సాగించే పోరాటంలో పాల్గొనడం సోవియట్ రచయితల సాంప్రదాయం అయింది

"సహజ రచయిత సహజంగానే యోధుడై వుంటాడు" అన్నారొకప్పుడు హరీంద్రనాథ చటోపాధ్యాయ. దీనికి సోవియట్ రచయితలే ప్రత్యక్ష సాక్ష్యం.

అభియోగం (గల్పిక)

—సొదుం రామ్మోహన్

శుక్రవారం ఏడో ఓ కథ రాయాలనే ఆలోచన ఇంకా ఆలోచన రూపంలోనేఉంది వారానికో కథ 'కోటా' పూర్తిచేయకపోతే మనసు అదోలా వుంటుంది.

అందుకని పొద్దున్నే ఏవో పాత వార పత్రికలు ముందేసుకు కూచున్నాను. కథకు ఏదన్నా ఐడియా "లాగు" దామని. నేనిలా ఓ వారపత్రిక తెరచానో లేదో ఇంతలో తుఫానులా దూసుకొచ్చి నా కెదురుగ్గా వున్న కుర్చీలో కూలబడింది ఓ యువతి ఆ అమ్మాయికి పాతికేళ్ళుంటై. చూడడానికి నదురుగానే కనబడుతోంది. కాని మొహంనిండా కోపం, అసహ్యం, అవమానం తాలూకు లక్షణాలు తాండవమాడుతున్నై. ఆడదాని మొహంలో అలాంటి లక్షణాలు చూడడం నా కట్టే ఇష్టంలేదు అందుకని "మా ఆవిడగారు ఇంట్లో వున్నారు" అన్నాను ఆవిడవైపు చూసి

"నాకావిడతో పన్లేదు." అన్నది ఆ యువతి కసిరేసినట్టు.

నాగుండెలు గుభేలు మన్నాయి నిజానికి నేనామెను నా జన్మలో చూడలేదు. మరి ఆవిడకు నాతో పని వుండడమని నేనెలా ఊహించుకోను. అయినా నన్నో రచయితగా పలకరిద్దామని వచ్చిందనుకోడానికి అమె వాలకాన్నిబట్టి చూస్తే ఆ అవకాశమేలేదు తొందరగా పీడ వదిలించుకుందామని "ఏమిటండీ విషయం?" అన్నాను, పత్రిక పక్కన పెట్టి.

"కథలు రాసే 'శుభశ్రీ' మీరేకదూ?" అంది ఆవిడ. వలానా నేరం చేసిన ముద్దాయివి నువ్వేకదూ అన్న జడ్జీగారిధోరణిలో.

"అవునమ్మా" అని నేను నా నేరాన్ని ఒప్పేసుకొన్నాను తొందరగా.

ఆవిడవెంటనే ఏమాత్రం తటపటాయింపకుండానే "మీకుబుద్ధుందా?" అంది నాకు పళ్ల మండింది. అయినా ఆడకూతురుమీద ఆగ్రహం ప్రదర్శించడం ఎందుకని కాస్త సాత్వికధోరణిలోనే చెప్పాను.

"చూడమ్మా మీ రెవ్వరో నాకుతెలీదు అసలు మీరు నా దగ్గర కెందు కొచ్చారోకూడా నాకు తెలీదు. మీరు నన్ను నన్నంతలేసి చీవాట్లేయడం, ఒక స్త్రీగా మీకు మంచిది కాదు"

ఆవిడ తక్కున అందుకుంది. "మాకు తెలుసు లేవయ్యా స్త్రీగా ఎలా మాట్లాడాలో, అసలు ఒక స్త్రీగా ఎలా మాట్లాడాలో - స్త్రీకితప్ప మీలాంటి రచయితలకు బాగా తెలుస్తుందని నేననుకోను, నేనిప్పుడు వచ్చింది కూడా స్త్రీ ఎలా ప్రవర్తిస్తుంది? ఎలా ఫీలవుతుంది, ఎలా మాట్లాడుతుంది? వగైరా విషయాలు మీకు నేర్పడానికే తెలిసిందా?" ఇక్కడ పుల్‌స్టాప్ పెట్టి నావైపు చూసి కాస్సేపు ఆగింది. నేను కుతుకాం పట్టలేక "ఇంతకూ మీ రెవరో చెప్పారుకాదు" అన్నాను చాల మెత్తగా, మెల్లిగా, కోపంగా మాట్లాడితే ఎక్కడ మీదపడుతుందోనని.

"నేనా? నేను నీ పాత్రను. పోయిన వారం...పత్రికలో మీరు రాసిన 'భగ్న హృదయాలు' అన్న కథలోని హీరోయిన్ పార్వతిని నేనే" అన్నది

నా కాశ్చర్యమేసింది ఆమె మాటలునమ్మ బుద్ధికాక. ఇదెక్కడన్నా కద్దా? అన్నాను.

'ఏది! రచయితలతో పాత్రలు మాట్లాడ్డమా? కద్దో!వద్దో! నాకు తెలీదు. నేనుమాత్రం నీపాత్ర పార్వతినే మీరు ఆ కథ రాసిందిఎంత నిజమో నేనా పాత్రను అన్న విషయం కూడా అంతే నిజం." "అయితే నీ అభియోగమేమిటో తొందరగా చెప్పమ్మా"అన్నా న్నేను పీడతొందరగా వదలించుకొని కథకు ఉపక్రమిద్దామని.

"అందుకే కంప్లెయింట్ చేయడానికే వచ్చాను. అయినా మీ రచయితలకు బుద్ధుందా అని? కాకపోతే ఆ వెధవను, సజ్జును, ఎందుకూ పనికిరాని ఏ బ్రాని ఎల్లయ్యను వాడు బొమ్మలు గీసినంత మాత్రాన వాన్ని నేను ప్రేమించానని రాశావే నీకు బుద్ధిందా? అసలువాన్ని నేనెలా ప్రేమిస్తాననుకొన్నావయ్యా, పెళ్ళాన్ని సాకే శక్తి కాని, ప్రేమించే యోగ్యతకాని వాడి దగ్గరుందా అని? పైగా నీ క్లైమాక్స్‌కోసం-మా వాళ్లు నాకు వేరే యువకునితో ముడి పెట్టడానికి ప్రయత్నిస్తారా? నాన్సెన్స్. వాళ్ళ ప్రయత్న మేమిటి? నేనే ఆ సజ్జును చేసుకోను. ఉద్యోగం, సద్యోగం, డబ్బూ. దసకం ఏమీలేని ఓకోన్ కిస్కాగాన్ని నాకంట గట్టడానికి నీ కెన్ని గుండెలు?

ఇదిగో మళ్ళీ చెప్తున్నానిను, నేనలాంటి అర్భకుల్ని, అయోగ్యుల్నీ వాడు బొమ్మలు గీయనీ. ఇండియాను ఏలనీ, నేను ప్రేమించనే ప్రేమించను సరే బుద్ధిలేక ఒకవేళ ప్రేమించానే అనుకో. మావాళ్ళు నాకు వేరే సంబంధం ఖాయం చేస్తే. ఆ ప్రేమికుడి దగ్గరకు. శరత్ పాత్రలా ముసుగేసుకుని, రాత్రిపూట వెళ్ళి "ఇన్నాళ్లూ ప్రియుడివి, ఇకమీదట నా అన్నవ్వవి అంటానా నేను? నెవర్ నెవర్ నేనెప్పుడూ అలా అన్ను. నేను ప్రేమించడమే జరిగితే లోకమంతా ఏకమైనా సరే పట్టుబట్టి ప్రేమించినవాణ్ణే పెళ్ళి చేసుకుంటాను. తెలిసిందా? అయినా నాకు ప్రేమ మీద నమ్మకముందని మీతో నే నెప్పుడైనా చెప్పానా అని. లేదు నే నెప్పుడూ చెప్పలేదు. అన్నీ నువ్వే ఊహించుకొని నన్నూ, నా వ్యక్తిత్వాన్నీ బూది చేశావ్ రాస్కెల్! ఇప్పుడు చెప్తున్నా విను శ్రద్ధగా నాకు ప్రేమమీద అట్టే విశ్వాసం లేదు నాకు విశ్వాసమున్నదల్లా ఒక్క జీవితం మీదనే. నా జీవితం సుఖంగా, హాయిగా, నల్లేరుమీద బండిలా నాగాలంటే, ఎవర్ని, ఎలా ప్రేమించాలో, ఎలా వలలో వేసుకోవాలో?, ఎట్లా పెళ్ళి చేసుకోవాలో? నాకు బాగా తెలుసు. ఐనో ప్రెటీవెల్ అబౌట్ దట్ మేటర్. ప్రేమించడం వల్ల ఏమీ ఒరక్కపోతే ఎందుకు ప్రేమించాలో నాకు తెలీదు, నా జీవితాన్ని చక్కదిద్దుకునే యోగ్యత నా కుంది. జీవిత భాగస్వామిని ఎన్నుకునే ఇంగితం కూడా నా దగ్గరుంది మైండిట్. ఇకనైనా నన్ను దగ్గర పెట్టుకొని మరీ రాయి. వస్తా, గుడ్‌బై రచయితగారూ"

అంతే. ఆవిడ ఎలా తుఫాన్‌లాగా వచ్చి పడిందో అలాగే మళ్ళీ వెళ్ళిపోయింది. నాకు కళ్ళు బైర్లు కమ్మాయి. ఇంతవరకూ నాకు తెలియని నగ్నసత్యం తాలూకు వెలుగు ఏదో అస్పష్టంగా నా కళ్ళకు గోచరించ సాగింది.

ఎలక్ట్రానిక్ నగరం

బెర్లిన్ నగరానికి దక్షిణాన 30 వేల మందికోసం ప్రత్యేకంగా ఆధునిక రీతుల్లో నిర్మించబడుతున్న నగరం యూరోపాఖండంలో తొలి ఉపగ్రహ నగరంగా పేర్కొనవచ్చు.

ఎలక్ట్రానిక్ కంట్రోలర్స్ కింద నిర్వహించబడే యీ నగరంలో విద్యుత్ సరఫరా, ఎలివేటర్లు, తుక్కు, ధూళిని ఎప్పటికప్పుడు పోగుచేసి తరలించేసాధనాలు, ఎమర్జన్సీ లైట్ సాధనాలు అన్నీ ఆటోమాటిక్ కంట్రోలర్స్ క్రిందపనిచేస్తాయి.

కృత్రిమ చంద్రుడు

మ్యూనిచ్‌లో నిర్వహింపబడనున్న 1972 ఒలింపిక్ క్రీడోత్సవాల సందర్భంగా రాత్రుల క్రీడా రంగస్థలాన్ని వెలుగులో నింపడానికి గాను జర్మనీ కృత్రిమ చంద్రుణ్ణి ప్రతిష్ఠిస్తున్నది. 20 మీటర్ల ఎత్తు వుండే ఉక్కు స్తంభంమీద తన చుట్టూ తాను తిరుగుతూ, క్రీడా రంగస్థలాన్నంతటినీ వెలుగుతో నింపే యీ చంద్రుడు రసాయనిక ద్రవ్యాల పూతగల ప్రత్యేకమైన గాజుతో తయారుచేయబడతాడు. పగలు సూర్యరశ్మిని గ్రహించి క్రీడా రంగస్థలానికి కావలసిన అదనపు వెలుగును ప్రసరింపజేస్తాడు. రాత్రులు మువ్వన్నెల లేజర్ కిరణాల సంధానంతో శక్తివంతమైన కాంతిని అందించుతాడు. యీ క్రీడోత్సవాలకు గాను క్రీడా రంగస్థల ప్రదేశం మధ్యన మరో కృత్రిమ చంద్రుణ్ణి గూడా ప్రతిష్ఠించుటానికి నిర్ణయాలు జరిగాయి.

డాక్టరుగా ఉండండి!
పోస్టు ద్వారా హోమియోపతి చదివి M. D. H. డిప్లొమా పొందండి
ఉచిత ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి:
HIND HOMEOPATHIC COLLEGE
(V.A.) Sonepat (Haryana)

దీర్ఘరోగులకు ఉత్తమవైద్యము
హస్తప్రయోగం, అవయవము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తికర నష్టం నపుంసకత్వము. ఉబ్బసము (దమ్ము), బోదకాళ్లు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, కడుపునొప్పి, చెవుడు, పోస్టుద్వారాకూడాచికిత్స చేయబడును. శ్రీబాలాజీవైద్యశాల, డా. పి కుమారస్వామిదేవర, ట్రావెలర్స్‌బంగళారోడ్, తెనాలి.

తెలుగులో
కొత్త సోవియట్ పుస్తకాలు

			పేజీలు	రూ. పై.
1.	విమోచనోద్యమంలో జాతీయ ప్రాచ్య ప్రపంచం	—లెనిన్	365	1-40
2.	మేడే, విప్లవ కార్మికవర్గ మేడేచర్య	—లెనిన్	36	0.50
3.	సామ్రాజ్యవాదమూ-సోషలిజంలో చీలిక	—లెనిన్	24	0-30
4.	అతివాద బాల్య చాపల్యమూ-పెటీ బూర్జువా మనస్తత్వమూ	—లెనిన్	44	0-60
5.	కమ్యూనిస్టుప్రణాళిక	—కార్ల్‌మార్క్స్&ఎంగెల్స్	94	0-30
6.	నిత్యజీవితంలో భౌతికశాస్త్రం-2	—వై. పెరెల్మాన్	294	3.70
7.	అమ్మ	—మక్సిమ్ గోర్కీ	391	3.00
8.	మక్సిమ్ గోర్కీ కథలు		182	2-40
9.	జమీల్యా	—చింగీజ్ ఐత్‌మాతోవ్	101	0-40
10.	నీలం నోట్‌బుక్	ఇ. కజకేవిచ్	188	2-50
11.	వర్షంలో నక్షత్రాలు (పిల్లల కథలు)		104	2.00
12.	మంచివదత-రెండు పిల్లికూనలు	—ఎస్. మర్షాక్	16	0.45
13.	ఉన్నారు ఇలాంటి అబ్బాయిలు-	అగ్నియాబార్తో	16	0.50
14.	అన్నిటికంటె బలమైనదెవరు?-	—వలేరియ్ సుస్లోవ్	20	0.80
15.	చిన్నారి చిరుతలు	ఏ. లాప్తెవ్	24	0.70
16.	మొసలికాజేసినసూర్యుడు	—కె. చుకోవ్‌స్కీ	24	0.50
17.	కొమ్ముల గొర్రెపిల్ల	—ఎస్. చెయెస్తెరోవ్	24	0.80
18.	హనీకేక్కు పెడతామా, తాయం పెడతామా-	—తిక్కాన మాషినా	24	1.00
19.	చిన్నారి కోడిపుంజు-బంగారు మేనిగౌను	—అ. ని. టాల్‌స్టాయ్	24	0.60
20.	వేర్వేరుచక్రాలు	—వి. సుతెయెవ్	24	0-50
21.	బాలల కథలు	లేవ్ టాల్‌స్టాయ్		0.90

పోస్టేజి అదనం - ప్రతులకు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
ఏలూరురోడ్డు : : విజయవాడ-2
విశాలాంధ్ర బుక్ హౌస్
సుల్తాన్‌బజార్ : : హైదరాబాద్
ADMARK

సినిమా

"అడవి వీరులు" చిత్రంలో కాంతారావు, విజయనిర్మల

చిత్ర సమీక్ష

అడవివీరులు

చిట్టడవుల్లో వి చిత్ర ప్రకృతి సౌందర్యం. భయంకరమైన క్రూరమృగాలు. ఆటవిక జీవితానికి అలవాటుపడిన వింతయిన మనుషుల మధ్య ఒక దానవుని తరహా కథను అక్కగా కూర్చి వినూతన పోకడలతో భారీ ఎత్తున రంగులలో నిర్మించబడిన జంగిల్ చిత్రం నీలా ప్రొడక్షన్స్ "అడవివీరులు".

ఆటవిక జీవితాలకే అలవాటుపడినా, నీతి, నియమం కొన్ని కట్టుబాట్లు కలిగిన అడవి మనుషులకు, నాగరికతతో అనాగరికంగా వ్యవహరించే నగరవాసులకు గల తేడా ఏమిటో వివరిస్తుంది చిత్రం.

తల్లిదండ్రులను చిన్నప్పుడే పోగొట్టుకున్న దివాకర్ తన మేనమామనగర పెరుగుతున్నాడు. ఆయన కూతురు పద్మినికి, దివాకర్‌కు గాఢమైన స్నేహం కుదిరింది.

కానీ ఆ వాతావరణంలో వుండటం యిష్టంలేని దివాకర్ అడవులుపట్టాడు. కారణం అతనితల్లి అడవిలో పెరిగింది. ఆమెను భీముడు అనే ఏనుగు పెంచింది.

పెళ్లయి బస్తీ కొచ్చారు. గతించారు. తన తల్లి చెప్పిన మాటల ప్రకారం దివాకర్ అడవులకెళ్ళి భీమునికై వెతుక్కున్నాడు. క్రూరమృగాల నుండి రక్షించి దివాకర్‌ను పెద్దవాణ్ణి చేసింది.

పద్మిని తండ్రి దంతాల వ్యాపారి. దంతాలకోసం ఒకసారి తన పరిజనంతో పాటు కూతుర్ని కూడా తీసుకొని అడవికి వస్తాడు.

అడవిలోని ఒక గూడెం నాయకుని కొడుకు సింగన్న. వీరి వినోదాలకు, విలాసాలకు దాసుడై దంతాలు సరఫరా చేస్తుంటాడు. కనపడ్డ పడుచుపిల్లలెవర్నీ వదలిపెట్టని పరమ కిరాతకుడు. నాయకుని మేనల్లుడు కన్నయ్య. ఆ గూడానికి దొరయ్యే లక్షణాలున్నవాడు.

అందుకే గూడెంలోని వాళ్ళంతా కన్నయ్యే దొర కావాలంటారు. కన్నయ్య దొరైతే తన పనులు సాగవని అతన్ని తన సేవకులచే నీటిపాలు చేయిస్తాడు సింగన్న. అతని ప్రేయసి రాణిని తను పొందాలని చూస్తుంటాడు.

తలవని తలంపుగా దివాకర్ పద్మినిని కలుసుకుంటాడు. అనేకసార్లు ఆమెను సింహాల నుండి కాపాడుతాడు కానీ ఒకరినొకరు తెలుసుకోలేరు. సింగన్న బలాత్కారం చేయబోతున్న సమయంలో పద్మినిని కాపాడి తన నివాసానికి తీసుకొస్తాడు దివాకర్. కన్నయ్యను కూడా కాపాడుతాడు. ఈ ఇద్దరు అనేక చిక్కులను ఛేదించుకొని తమ ప్రియురాండ్రను దక్కించుకొని ఆ అడవి వీరులెలా అయ్యారో చిత్రం పూర్తిగా చూస్తేనే బాగుంటుంది.

అడుగడుగునా ఒళ్ళు గగుర్పొడిచే క్రూరమృగాలపోరాటాలూ, కొట్లాటలు, నాటకీయం అనేక విచిత్రమైన సాహస కృత్యాలు ఎంతో ఆసక్తికరంగా వుంటాయి.

సుందరమైన ప్రకృతి దృశ్యాలు, పెద్ద పులులు, గూడెంలో జరిగే పోటీలు, పోరాటాలు వింతైన నృత్యాలు ఆ అడవి మనుషుల్లోనూ, జంతువుల్లోనూ వుండే రాగద్వేషాలు యింకా ఎన్నో విశేషాలున్నాయి.

కన్నయ్యగా కాంతారావు, అతని ప్రేయసి రాణిగా విజయనిర్మల, దివాకర్‌గా ఆనంద్, అతని ప్రేయసి పద్మినిగా రాజశ్రీ తమ పాత్రలకు న్యాయం చేశారు.

అయితే అడవిలో జీవిస్తున్నప్పటికీ కన్నయ్య, రాణీ చక్కని భాష మాట్లాడుతారు, కమ్మని ప్రేమగీతాలు పాడుతారు.

సింగన్నగా సత్యనారాయణ ఆ పాత్రలో బాగా రాణించాడు.

కాకరాల, బాలకృష్ణ చక్కని హాస్యం అందించారు.

ఆరుద్ర రాసిన మాటలు చిత్రానికెంతో నిండుతనాన్నిచ్చాయి. భావయుక్తమైన రకరకాల బాణీలు ప్రేక్షకులను అలరిస్తాయి.

పాటలన్నీ హాయిగా వున్నాయి.

"ఎందుకు రమ్మనవే" అనే పాటకు విజయశ్రీ నృత్యం ఓ ప్రత్యేకాకర్షణ. "అల్లి బిల్లి రాజాకేమో" అనే పాటకు మాస్టర్ ప్రభాకర్, బేబీ శ్రీదేవి అనుకరణ ప్రేక్షకులను బాగా ఆకర్షిస్తాయి.

ఇంకా మిక్కిలినేని, త్యాగరాజు, మణి, కాంతి తదితరులు నటించిన ఈ చిత్రానికి కె. వి. మహాదేవన్ సంగీతం కూర్చారు.

కథ, దర్శకత్వం పి. సుబ్రహ్మణ్యం. నిర్మాతలు టి ఆర్. సుబ్రహ్మణ్యం, వి.ఎస్. సదాశివన్. ఈ చిత్రాన్ని ఆంధ్రలో పూర్ణావారు విడుదల చేశారు.

—వీరా

"బస్తీ బుల్ బుల్" ఔట్‌డోర్ షూటింగ్

విజయవాడకు సమీపంలోని కొండపల్లి వద్ద యిటీవల రెండు రోజులు జరిగిన ఔట్‌డోర్ షూటింగ్‌లో శ్రీ రామాఆర్ట్స్ "బస్తీ

బస్తీ బుల్ బుల్" చిత్రంలో విజయచంద్ర

బుల్ బుల్" చిత్రం దాదాపు పూర్తయినట్లేనని విజయవాడ నటరాజ్ హోటల్‌లో జరిగిన పత్రికా విలేకరుల గోష్ఠిలో ఆ చిత్ర దర్శకులు శ్రీ జి. వి. ఆర్. శేషగిరిరావు చెప్పారు. ప్యాచ్‌వర్క్ మాత్రమే మిగిలివుంది.

ఆయన యింకా యిలా అన్నారు:

కొండపల్లి వద్ద జరిగిన ఔట్‌డోర్ షూటింగ్‌లో డా॥ సి. నారాయణరెడ్డి వ్రాయగా కోదండపాణి సంగీత సారథ్యంలో బాలసుబ్రహ్మణ్యం, సుశీల పాడిన "నీలాల కళ్ళలోన, లేలేత నవ్వులోన...ఏవో, ఏవో వూహలు...ఏమంటున్నాయి" అనే యుగళ గీతాన్ని హీరో, హీరోయిన్‌లయిన విజయచంద్ర, విజయలలితలపై చిత్రీకరించడం జరిగింది.

ఇంకా ఈ చిత్రంలో మణిమాల, ప్రభాకరరెడ్డి, సంధ్యారాణి కె. వి. చలం, పెద మాక్కు నటించారు.

మాటలు రాజశ్రీ, ఫోటోగ్రఫీ మధు. నృత్యం శేషు. ఆర్ట్ అనంతరామ్.

హాస్య నటుడు శ్రీ రామచంద్రరావు ఈ చిత్ర నిర్మాత.

ఈ యిష్టాగోష్ఠి సమావేశంలో ముందుగా కుమారస్వామి పిక్చర్స్ తరపున శ్రీ సుబ్బారావు స్వాగతం చెప్పారు. ఈ సమావేశంలో దర్శక, నిర్మాతలతోపాటు హీరో విజయచంద్ర, హీరోయిన్ విజయలలిత, యితర సాంకేతికబృందం పాల్గొన్నారు.

ఈ చిత్రం ఆగస్టులో విడుదల చేయబడుతుందన్నారు. నిర్మాత. శ్రీ కుమారస్వామి పిక్చర్స్‌వారు విడుదల చేస్తారు.



(పద ప్రొడక్షన్ నెం. 1 పాట రికార్డింగ్ సందర్భంలో తీసిన ఫోటో. నిర్మాత ఎం. నాగేశ్వరరావు, గాయని జిక్కి, కృష్ణవేణి, సంగీత దర్శకుడు మాస్టర్ వేణు.

స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా

బాబు పిక్చర్స్ 'బంగారు తల్లి'

బాబు పిక్చర్స్ "బంగారు తల్లి" స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదలవుతోంది.

యీ చిత్రం ఫిబ్రవరి మార్చి మాసాలకే సిద్ధం అయిందని. కాని వేసంగి సెలవుల్లో విడుదల చేయటానికి యిష్టం లేకపోయిందని నిర్మాత శ్రీ చేగొండి హరిబాబు అన్నారు.

"ఒక్క యువకులకు యువతులకేగాదు. ప్రతి తల్లికీ, ప్రతి బిడ్డకు సంబంధించిన గాథ యిది" అన్నారు శ్రీ హరిబాబు.

చిత్రం అనేది ఒక కావ్యంలా వుండాలన్న సంకల్పంతో ఎక్కడా రాజీ అనేది లేకుండా రూపొందించబడిన 'బంగారు తల్లి' లో బంగారు తల్లిగా జమున, బిడ్డలుగా శోభన్‌బాబు, కృష్ణంరాజు, భర్తగా జగ్గయ్య, వడ్డీ వ్యాపారిగా నాగభూషణం, యితర ముఖ్య భూమికల్లో అల్లు రామలింగయ్య, వెన్నిరాడై నిర్మల, రమాప్రభ, నిర్మల, బాల సరస్వతి నటించారు. చాణక్య దర్శకత్వంలో తయారయిన యీ చిత్రానికి నిర్మాతలు: శ్రీయుతులు చేగొండి హరిబాబు, నాదు శేషగిరిరావు.

అన్నపూర్ణా కంబైన్స్

ఈమధ్య అన్నపూర్ణా కంబైన్స్‌వారి చిత్రానికి రెండుపాటల చిత్రీకరణ జరిగింది, 'మల్లెతీగనడిబిందా'నే అనేపాట శోభన్‌బాబు, కాంచనలమీద - 'సిగ్గులేని మామయ్యో రామచిలకా' అనే మరోపాట శోభన్‌బాబు, కొత్త నటి విజయలలితా శివాజీ గార్డెన్స్‌లోను, విజయా గార్డెన్స్‌లోను చిత్రీకరించారు.

ఈ చిత్రంలో గల మొత్తం ఆరు పాటల్లోను ఇంతవరకు మూడు పాటలు చిత్రీకరించారు. మిగిలిన మూడు పాటలూ జూలై మొదటి వారానికల్లా చిత్రీకరించటం జరుగుతుంది. ఈ పాటల చిత్రీకరణ పూర్తికాగానే జూలై రెండవ వారంనుంచి ఇండోర్ షూటింగ్ ఆరంభిస్తారు.

శోభన్‌బాబు, జగ్గయ్య, రాజబాబు, కాంచన, సావిత్రి, విజయ ముఖ్య భూమికలు పోషిస్తున్న యీ చిత్రానికి రచన: బొల్లిముంత శివరామకృష్ణ, సంగీతం: చక్రవర్తి, కెమెరా: జి.కె. రాము, నిర్వహణ: కె. ఛటర్జీ. దర్శకత్వం: జి. రామినీడు, నిర్మాతలు: టి. క్రాంతికుమార్, ఎ. ఎ. పి. రాఘవరావు.

జేమ్స్‌బాండ్-777

కె. యస్. ఆర్. దాసు దర్శకత్వంలో మయూర్ మూవీస్‌వారు నిర్మిస్తున్న 'జేమ్స్ బాండ్-777' చిత్ర నిర్మాణం శారదా స్టూడియోస్‌లో శరవేగాన సాగుతూంది. మే నెలలో జరిగిన 12 రోజుల షెడ్యూల్‌లో 4 ఫైట్లపై 5 రీళ్ళకు పైగా చిత్రం నిర్మించబడింది; రెండు పాటల చిత్రీకరణ జరిగింది. బొట్

తెనాలిరామకృష్ణ

ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డకు, ముచ్చటగా మూడుముళ్లు వేస్తున్న, 80ఏండ్ల ముసలి పెళ్ళికొడుకు కళ్లు తెరిపించిన సంఘ సంస్కారి శ్రీ రామకృష్ణుడు.

శ్రీ హెచ్. యం. రెడ్డి నిర్మించిన రోహిణీవారి ఈ హాస్యరస భరిత చిత్రాన్ని, క్రొంగొత్త చిత్రంగా ఆంధ్రలో జూలై నెలలో జ్యోతీఫిలింసువారు విడుదల చేస్తున్నారు.

ప్రభు ప్రొడక్షన్స్

గుడివాడలోని గౌరీశంకర్ టాకీస్ అధినేత, శ్రీ ఎం. నాగేశ్వరరావు ప్రభు ప్రొడక్షన్స్ బేనర్ తరపున దర్శకుడు ఐ. ఎన్. మూర్తి, రచయిత విశ్వప్రసాద్‌ల కాంబినేషన్‌తో తమ తొలి చిత్రాన్ని శారదా స్టూడియోస్‌లో ప్రారంభించారు. ఎస్. వి. ఎస్. ఫిలింస్ అధినేత శ్రీ ఎం. జగన్నాథరావు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, కథానాయకి పాత్రను ధరిస్తున్న విజయలలిత ముహూర్త సన్నివేశానికి క్లాప్ కొట్టింది. ఏడు రోజులపాటు నిర్విరామంగా జరిగిన తొలి షెడ్యూల్‌లో ఒక పాట కృష్ణ, విజయలలితపైనా, మరొక పాట కిన్‌మిన్‌పైనా చిత్రీకరించడం జరిగింది. హాస్య నటుడు రమణారెడ్డి మేజిక్ ప్రదర్శన, మరికొన్ని ముఖ్య సన్నివేశాలూ, ఫైటింగులనుకూడా చిత్రీకరించారు.

విశ్వప్రసాద్ కథ, మాటలు, శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి పాటలకు మాస్టర్ వేణు కూర్చిన సంగీత బాణీ, బి. ఎన్. కృష్ణ కళాదర్శకత్వం, వి. వి. ఆర్. స్వామి ఛాయాగ్రహణం, చిన్నిసంపత్ నృత్యంకూర్చారు.

కృష్ణ, విజయలలిత, రమణారెడ్డి, డా॥ రమేష్ ప్రభృతులు అనేక మంది అందమైన యువతీ యువకులూ, యింత వరకూ నిర్మించబడిన సన్నివేశాల్లో పాల్గొన్నారు. మరికొన్ని ముఖ్యపాత్రలకు నటీ నటుల ఎన్నిక జరుగుతూంది. మూడు నెలల్లో యీ చిత్రాన్ని భారీయెత్తున పూర్తి చేయాలని నిర్మాతల సంకల్పం. శ్రీ ఐ. ఎన్. మూర్తి ఈ చిత్ర దర్శకత్వాన్ని వినూత్న పోకడల్లో నెలకొల్పుతున్నారు. అసోసియేట్: దుర్గా నాగేశ్వరరావు

నమ్మకద్రోహులు జులై 8 విడుదల

ఈ నెల 8వ విడుదల కాబోతున్న యీ చిత్రంలో కృష్ణ, చంద్రకళ నాయికానాయకులు. ఇంకా సత్యనారాయణ, మిక్కిలినేని, ప్రభాకర రెడ్డి, యస్. వి. రామదాసు, త్యాగరాజు, డాక్టర్ రమేష్, మణిమాల, రాధాకుమారి, విజయశ్రీ, కల్పన, జ్యోతిలక్ష్మి, జయకుమారి వున్నారు.

ఫొటోగ్రఫీ: విజయనంజప్ప, సంగీతం: సత్యం, దర్శకుడు: కె. వి. ఎస్. కుటుంబరావు, నిర్మాతలు: డా. ఏ. సుబ్బారావు, పి. మనోహరబాబు.

ప్రేమనగర్

తన హృదయాన్ని దోచుకొన్న ప్రియురాలు-మరొకరితో వివాహమై తనకు దూరమై పోతున్నదన్న బాధతో అల్లల్లాడి పోయాడు ఆ అందమైన యువకుడు. తన ప్రియురాలి కోసం ఎంతో శృంగారంగా నిర్మించుకొన్న ప్రేమనగర్ మందిరంలోకి మతిలేనివాడిలా హృదయవేదనతో ముద్దగా తడిసి ప్రవేశించాడు. అతడి దుఃఖావేదనకు తోడుగా ప్రకృతి భీభత్సంగా విజృంభించింది. తుఫాన్ చెలరేగింది, ఉరుములు మెరుపులతో వర్షం ప్రళయంగా వీచింది. అంతకన్నా భీకరంగా ఆ భగ్నహృదయుడి ఎదలో అగ్నిపర్వతం ప్రజ్వరిల్లింది. —

"ఎవరి కోసం- ఎవరి కోసం;
ఈ ప్రేమ మందిరం- ఈ శూన్యనందనం
ఈ భగ్న హృదయం - ఈ అగ్నిగుండం
ఎవరికోసం-ఎవరికోసం-ఎవరికోసం....

అంటూ అతడి కంఠంనుంచి జ్వాలలా గీతం జ్వలించింది. విరక్తిచెందిన మనసుతో విషాన్ని త్రాగి పిచ్చిగా వాపోయాడు. మానసిక బాధతో కృంగిపోయాడు.

హృదయాన్ని కదిలించే ఈ సన్నివేశం రంగుల్లో రూపొందుతోన్న 'ప్రేమనగర్' చిత్రంలోనిది.

వాహినీ స్టూడియోలో 8వ ఫ్లోర్‌లో శోభాయమానంగా నిర్మించబడిన 'ప్రేమనగర్' సెట్‌లో ఈ సన్నివేశాన్ని, మరియు క్లయిమాక్స్‌కు సంబంధించిన సన్నివేశాలను మే నెల 28వ తేదీనుండి 30వ తేదీవరకు చిత్రీకరించటం జరిగింది. అందమైన యువకుడు జమీందారబ్బాయి కళ్యాణ్‌గా అక్కినేని నాగేశ్వరరావు ఈ సన్నివేశంలో అపూర్వంగా నటించారు.

"ప్రేమనగర్" చిత్రంలో నాగేశ్వరరావు

సాధ్యమైనంత త్వరలో ఈ నవం దైన చిత్రాన్ని అఖిలాంధ్ర ప్రజలకు అందజేయాలనే నిర్మాత శ్రీ డి. రామానాయుడు సంకల్పం. దర్శకత్వం: కె. ఎస్. ప్రకాశరావు. కథ: కోడూరి కౌసల్యాదేవి మాటలు - పాటలు: ఆత్రేయ. కెమేరా: ఎస్. వెంకటరత్నం. సంగీతం: కె వి. మహదేవన్.

నాగేశ్వరరావు, గుమ్మడి, సత్యనారాయణ, రాజబాబు, కె.వి. చలం, ధూళిపాళ, రావి కొండలరావు, వాణిశ్రీ, శాంతకుమారి, ఎస్. వరలక్ష్మి, మీనాకుమారి, అనిత, రమాప్రభ, పుష్పకుమారి, లక్ష్మీఛాయ, బొంబాయి, జ్యోతిలక్ష్మి, జయకుమారి, బేబీ బ్రహ్మాజీ మున్నగువారు నటిస్తున్న ఈ చిత్రంలో గెస్టు ఆర్టిస్టులుగా ఎస్. వి. రంగారావు, వి. నాగయ్య పాల్గొన్నారు. ప్రెస్ రిలేషన్స్: శ్రీకృష్ణ, నవయుగ విడుదల.

'ప్రియ' ప్రారంభం!

స్త్రీ ప్రేమమూర్తి, త్యాగశీలతమైన తన కుసుమ కోమల హృదయంతో ప్రేమిస్తుంది, లాలిస్తుంది. క్షమ, దయ, సహనాలు ఆమెను శోభాయమానాలు. అయితే ఆ ప్రేమమూర్తే, కళ్ళెర్ర చేస్తే విప్లవం చెలరేగుతుంది. హృదయాన్ని రాయి చేసుకుని, కాళిలా విజృంభిస్తుంది. ఏమిటీ వింత. ఏమిటీనిచిత్రం; ఈసాంఘిక యితివృత్తాన్ని. ప్రస్తుత సామాజిక కట్టుబాట్ల నడుమ..హృదయానికి హత్తుకుపోయేలా నిర్మిస్తున్న కథాంశమే 'ప్రియ'

సంతానం, సంకల్పం, బావమరదళ్ళు ఆదిగాగల చిత్రాలలో వరుసా, బరువుగల కథానాయకి పాత్రలను కమనీయంగా, పోషించి మెప్పించిన ఆనాటి కథానాయకి రమణిమాలిని 'ప్రియ' పాత్రలో ప్రేక్షకలోకాన్ని రంజింప చేయబోతున్నది. కథానాయకిగానే గాకుండా చిత్ర నిర్మాణ బాధ్యతలను కూడా వహించి.మాలిని ఆర్టు ఫిలిమ్స్ బేనర్‌లో 'ప్రియ' చిత్రాన్ని వాహినీ స్టూడియోలో ప్రారంభించారు. వాహినీ స్టూడియోస్ అధినేత శ్రీ బి. నాగిరెడ్డి, కెమేరా స్విచ్ ఆన్ చేశారు. శ్రీ పి. గంగాధరరావు క్లాప్ కొట్టారు. తొలి సన్నివేశంగా జయభారతి, కృష్ణంరాజుల వివాహ ముహూర్త సన్నివేశంగా చిత్రీకరించారు.

మలయాళంలో జైత్రయాత్ర చేసి, అనేక అవార్డులను పొంది, అఖిలభారత ఖ్యాతిగాంచిన యీ చిత్రంలో కథానాయకునిగా నటించి దర్శకత్వాన్ని కూడా నెరపిన మధు ప్రారంభోత్సవానికి విచ్చేసి, తన శుభాకాంక్షలందచేశారు.

ఎం. ఎస్. గోపీనాథ్ దర్శకత్వాన నిర్మింపబడుతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా విడుదల కాగలదు.

రచన: ఆత్రేయ, సంగీతం: కె. వి. మహాదేవన్. నటీనటులు జగ్గయ్య, కాంతారావు, మాలిని, జయభారతి, కృష్ణంరాజు, ఎస్. వరలక్ష్మి.

విజయవాడలో జరిగిన ఇష్టాగోష్ఠిలో మాట్లాడుతున్న శ్రీమతి భానుమతి, అధ్యక్షత వహించిన శ్రీమతి హేమలతా లవణం.

అసభ్యత, అశ్లీలంలేని చక్కని వినోదభరిత చిత్రాలురావాలి

విజయవాడలో శ్రీమతి భానుమతి రామకృష్ణతో జరిగిన యిష్టాగోష్ఠిలో పలువురి సూచనలు

అసభ్యత అశ్లీలాలకు తావు లేకుండా చక్కని వినోద భరిత చిత్రాలు అందించడానికి నిర్మాతలు కృషిచేయాలని జూన్ 27వ తేదీన విజయవాడ, మనోరమహోటల్లో శ్రీమతి భానుమతి రామకృష్ణతోజరిగిన ఇష్టాగోష్ఠిలో పలువురు ప్రముఖులు సూచించారు. నవయుగ ఫిలింస్‌వారు యేర్పాటుచేసిన యీ ఇష్టాగోష్ఠి కార్యక్రమానికి విజయవాడలోని పలువురు రచయిత (త్రు)లు, పత్రికా ప్రతినిధులు హాజరయ్యారు.

శ్రీ కాటగడ్డ నరసయ్య స్వాగతంతో ప్రారంభమైన యీ సమావేశానికి శ్రీమతి హేమలతా లవణం అధ్యక్షత వహించారు. శ్రీ గొల్లపూడి మారుతీరావు వక్తలను పరిచయం చేశారు.

పరిశ్రమను గురించి రెండు పక్షాల ధోరణులు-సమన్వయావశ్యకత అన్న అంశంపై శ్రీ కాటగడ్డనరసయ్య ప్రసంగవ్యాసాన్ని చదివి వినిపించారు. పరిశ్రమలో ఉన్నవారు, పరిశ్రమలో లేని వారి అభిప్రాయాలను వివరిస్తూ, మంచి, నూతన రచనలు కావాలంటే రచయితలు, పరిశ్రమలోని వారి మధ్య డైలాగ్ పెంపొందాలనీ. అందుకు ఒక ప్లాట్ ఫారం అవసరమని శ్రీ నరసయ్య పేర్కొన్నారు. ఎవరినో ఒకరిని సిఫార్సు చేయడం, ఎవరినో పరిశ్రమలోకి తీసుకువెళ్ళడం యీ గెట్‌టు గెదర్ లక్ష్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

అనంతరం, సినిమాలలోసంగీతం, అన్న అంశంపై విజయవాడ రేడియో కేంద్రం డైరెక్టరు శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు మాట్లాడుతూ సినిమాలలో సంగీతం ఎలా వుంటే బాగుంటుందని చర్చించడం తప్ప ఇలా వుండాలని నిర్ణయించడం కష్టమని అన్నారు. నేడు మన చిత్రాలలో సంగీతం పుష్కలంగా వుంటున్నదనీ, వివిధ రకాల సంగీతాన్ని అభిమానించే వారిని దృష్టిలో వుంచుకొని నిర్మాతలు కూడా అన్ని రకాల సంగీతాలు అందించడానికి ప్రయత్నిస్తున్నారని, ఆయన అన్నారు.

తర్వాత "చిత్రాల ద్వారా సందేశం" అన్న అంశంపై శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు మాట్లాడుతూ చిత్రాలు సందేశం ఇవ్వాలి అనే వాళ్ళలోనే విభిన్న అభిప్రాయాలు వున్నాయని, సందేశం వేర్వేరు దృక్కోణాల నుంచి చూసి, విభిన్న ధోరణులలో వ్యాఖ్యానించడం జరుగుతున్నదని అన్నారు.

బలమైన కథ, అందుకు అనుగుణమైన పాత్ర పోషణ ఉంటే చిత్రాల ద్వారా సందేశం ఇవ్వడం సాధ్యమౌతుందని ఆయన అన్నారు. కథల కొరతను గురించి ప్రస్తావిస్తూ అనాటి స్వాతంత్ర్య పోరాట సమయంలోని సంఘటనలలో చిత్రాలు నిర్మించవచ్చని ఆయన సూచించారు.

"సినిమాలలో ఆషామాషీ" గురించి శ్రీ రావూరి సత్యనారాయణ ప్రసంగిస్తూ హాస్యం ప్రతిచోటా ఉన్నదని, నిత్యజీవితంలో అంతులేని హాస్యం లభిస్తుందని రచయితకు తగినంత స్వేచ్ఛ ఉన్నట్లయితే సున్నితమైన హాస్యాన్ని అందజేయవచ్చునని ఆయన అన్నారు.

"సాంఘిక జీవనంపై సినిమాల ప్రభావం" గురించి శ్రీ వి. వి. నరసింహారావు ప్రసంగిస్తూ సమాజం అంటే జనం, గుంపు అన్న అర్థంతో నేటి సినిమాలు జనంకోసం తీస్తున్నారని అన్నారు" ప్రతి చిన్న విషయంలోనూ పిల్లలు సినిమాలను అనుకరిస్తున్నారని తల్లి తండ్రులను డిక్టేట్ చేసే పరిస్థితి ఏర్పడిందని, సినిమాలలో తల్లిదండ్రులను చిత్రించే ధోరణి దారుణంగాను, అవహేళనంగాను ఉన్నదని ఆయన అన్నారు.

"నైతిక జీవనంపై సినిమాల ప్రభావం" అన్న అంశంపై శ్రీ జి. కృష్ణ ప్రసంగిస్తూ నీతులు చెప్పడానికి అర్హత వుండాలని సినిమాలు నీతులు చెప్పాలని అనడం దురదృష్టకరమైనదని అన్నాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వహించని బాధ్యత సినిమాలు ఎందుకు వహించాలని ఆయన ప్రశ్నించారు; పిల్లలు సినిమాలు చూస్తే చెడిపోతారని భావించే పక్షంలో వారిని సినిమాలకు ఎందుకుపంపాలని ఆయన వ్యంగ్యంగా విమర్శించారు. అనంతరం ముఖ్య అతిథి శ్రీమతి భానుమతి మాట్లాడుతూ ప్రజలు వినోదంకోసమే చిత్రాలు చూస్తున్నారనడం తప్పేమీ కాదని అన్నారు. అయితే ఇటీవల చిత్రాలలో అసభ్యకరమైన వస్త్రాలంకరణ, అశ్లీలం వస్తున్నట్లు వారు అంగీకరించారు. సినిమాలు ఉద్ధరించాలనడం సమంజసం కాదని లక్షలు పెట్టుబడితో సినిమాలు తీసే నిర్మాతలు పెట్టుబడి తిరిగిరావాలని కోరడం జరుగుతుండడం సహజమని శ్రీమతి భానుమతి అన్నారు. నిర్మాతలు ధైర్యంచేసి, మంచి చిత్రాలను నిర్మించాలనుకున్నా, అటువంటి చిత్రాలకు రౌడీ తరహా చిత్రాల పోటీ వలన ఆ చిత్రాలు సాధారణంగా విఫలమవుతున్నాయని. అప్పుడు మంచి చిత్రాలు నిర్మించాలనుకునే నిర్మాతలు కూడా రౌడీ తరహా చిత్రాల వైపు మొగ్గడం సహజమని ఆమె పేర్కొన్నారు. నేడు కథల కొరత బాగా వున్నదన్న అభిప్రాయంతో ఆమె ఏకీభవించారు. ఇతర భాషా చిత్రాలను తెలుగులో నిర్మిస్తున్నప్పుడు సంభాషణలు సన్నివేశాలతో సహా పూర్తిగా వాటినే అనుకరించటం జరుగుతున్నదని మన వాతావరణంకు అనుగుణంగా వాటిని మలుచుకొనడం లేదని అటువంటి చిత్రాలు ఎక్కువగా విడుదల అవుతున్నాయని ఆమె అన్నారు. ఈ ధోరణి యిలాగే కొనసాగితే కొన్నాళ్ళతర్వాత మనం డబ్బింగ్ చిత్రాలు చూస్తున్నామా లేక తెలుగు చిత్రాలు చూస్తున్నామోకూడా తెలియకుండా పోతుందని ఆమె అన్నారు.

ఈ రకం కథా వస్తువు ఎన్నుకొంటే చిత్రం విజయవంతమవుతుందని ఖచ్చితంగా చెప్పలేమని. అసభ్యత, అశ్లీలం లేని "మట్టిలో మాణిక్యం" విజయం సాధించడం దృష్టిలో పెట్టుకొని నిర్మాతలు అటువంటి సందర్భాలలో ఆయా చిత్రాలు ఎందుకు విజయవంతమవుతున్నాయో గ్రహించడానికి అటువంటి మంచి చిత్రాలు అందించడానికి కృషి చేయాలని శ్రీమతి భానుమతి సూచించారు.

శ్రీమతి హేమలతా లవణం ప్రసంగిస్తూ చిత్రాలు వినోదాన్ని ఇచ్చేవిగానే భావించడం సమంజసమని, అయితే ఆ వినోదం మన్నికకరమైనదీ, హాయినీ, ప్రశాంతతనీ యిచ్చేది అయివుండాలని అన్నారు. క్షణికమైన భావోద్రేకాలను ప్రేరేపించేవిగా చిత్రాలు ఉండకూడదని ఆమె అన్నారు. చిత్రాలు హింసా దౌర్జన్యాలు రెచ్చగొట్టకూడదని పేర్కొన్నారు.

శ్రీ నరసయ్య వందన సమర్పణతో యీ ఇష్టాగోష్ఠి కార్యక్రమం ముగిసింది.

'పారస్' చిత్రంలో ఫరీదాజలాల్

"శ్రీమంతుడు" చిత్రంలో నాగేశ్వరరావు, జమున

చిత్రసీమలో ...

'అమ్మ మాట'

ఈ పాడు బ్రతుకు బ్రతకలేకున్నాను. అందం, ఐశ్వర్యం, అధికారం అన్నీ ఉన్నాయ్, కానీ ఏం లాభం; జీవితానికి విలువైన అర్థాన్నీ, ఆనందాన్నీ యిచ్చే అన దిక్కు లేకుండా చేశాడా భగవంతుడు ఎందుకీ ఎడారి బ్రతుకు.' అని వాపోయాడు జాలిగా పుణ్యమూర్తి.

ఆ ముసలి కన్నీళ్ళను చూచి, లక్ష్మి మనస్సు చివుక్కుమనిపోయింది. 'పోనీ మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదా' అంది. అంది ఎడారి బ్రతుక్కి జాలిపడుతూ.

'చేసుకోవాలనుకుంటే మాత్రం నీలాంటి అప్సరసదొరుకుతుందా; అన్నట్లు నీ పాట నన్ను చాలా ముగ్ధుణ్ణి చేసింది. ఇదిగో భక్తుడు తెచ్చుకున్న చిన్న కానుక' అంటూ అందివ్వబోయాడు.

'నాకే కానుకలు అక్కర్లేదు. దయచేసి తీసుకు వెళ్ళండి.' అందామె జాలి గౌరవంతో మాట్లాడిన మాటలను అతడు దుర్బుద్ధితో గ్రైకొన్నాడనే బాధతో.

'అలా అంటే యెల్లా- మనసు పడి యిస్తున్నాను. కరుణిస్తే లక్షలు కురిపిస్తాను' అంటూ మైకం కమ్మిన కళ్ళతో తినేసినట్లు చూస్తున్నాడు.

"ఆఁ ఏవో పెద్దవారు - మంచివారూ అని లోపలికి రానిచ్చినందుకు ఇంత అసభ్యంగా మాట్లాడితారా - ముందు బయటకు వెళ్ళండి" అంది అబల కాబట్టి ఆక్రోశపులను విడుస్తూ.

"కృష్ణ కృష్ణ - నేనిప్పుడేమన్నానని అంత కోపం, పాట బాగుందనడంకూడా తప్పే - మంచివాళ్ళకీ లోకంలో చోటు లేదా స్వామీ; హరిహరీ నా తల తిరుగుతూంది. మంచినీళ్ళు అంటూ అర్ధరహితంగామాట్లాడుతూం టేలక్ష్మి లోపల తలుపులు వేసుకుంది.

లక్ష్మీ; లక్ష్మీ; ఏమిటిది - తలుపు తెరు అరిచాడు.

'ఆ తలుపులు మూసింది తెరవడానికి కాదు. నీదొంగ బ్రతుకును నలుగురికీ తెలియపరచడానికి, చెవుల్లో పువ్వు పెట్టుకుని దొంగ జపాలు చేస్తూ, కొంపలు కూల్చడానికి తయారవుతావు.'

ఇక పుణ్యమూర్తికి మార్గం తోచలేదు. రంకు నేర్చినవాడు బొంకనేర్చినట్లు - అఁ అఁ ఏటీ దారుణం. రామ రామ నా కసలే చత్వారం. నీవిలోకి వెడుతున్నాననుకుని వంటింట్లోకి వచ్చాను. అందుకోసం తలుపులుమూసి అభాండాలు వేస్తావా; లక్ష్మీ; నన్ను బజారు పాలు చేయకు. ఏదో బుద్ధి గడ్డితిని వచ్చాను. ఇంకెప్పుడూ ఈ దాయలకు రాను. కాదంటే యిప్పుడే- యిక్కడే బుర్రబద్దలు కొట్టుకు చచ్చిపోతాను, నా ఉసురు నీకూ, నీ పిల్లలకూ తప్పకుండా తగుల్తుంది. ఇదిగో చచ్చిపోతున్నాను.' అనేసరికి ఆ అబలమదిలో కంగారు బెదురూ పుట్టింది, వెంటనే తలుపులు తెరిచింది.

అగజన్మచిత్రాన్ని నిర్మించిన విజయలక్ష్మి మూవీస్‌వారు నిర్మిస్తున్న "అమ్మమాట" చిత్రంలోనిదీ సన్నివేశం.

భమిడిపాటి రాధాకృష్ణ మాటలు వ్రాస్తున్నారు.

సావిత్రి, నాగభూషణం పై సన్నివేశానికి పరిపుష్టిని కూర్చారు. ఇంకా శోభన్ బాబు, వాణిశ్రీ, పీలారాజ, ప్రభాకర రెడ్డి, రాజబాబు, తదితరులు నటించిన ఈ చిత్రంలో యిప్పటికిరికార్డయిన 6 పాటల్లోనూ 3 పాటలు చిత్రీకరించారు. సెప్టెంబరు నాటికి నిర్మాణం పూర్తి కాగలదు.

వి. రామచంద్రరావు దర్శకత్వంలో డి. వి. ఎస్. రాజా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అవిర్ప్రభాస్ ఎంటర్‌ప్రైజెస్ వారు నవయుగ ద్వారా విడుదల చేయనున్నారు.

"తాసిల్దారుగారి అమ్మాయి"

ప్రత్యక్ష చిత్ర సంస్థ నిర్మిస్తున్న సాంఘిక చిత్రానికి "తాసిల్దారుగారి అమ్మాయి" అని పేరు పెట్టారు. ఇటీవల ఎనిమిది రోజుల పాటు జరిగిన షూటింగ్ షెడ్యూల్‌లో తాసిల్దారు ఇంటి సెట్ వేసి - లోపలా, బయటా ముఖ్యమైన దృశ్యాలు కొన్నిటిని చిత్రీకరించారు. ఈ షెడ్యూల్‌లో ఈ చిత్రంలో వున్న ముఖ్య నటీనటులు - జమున, శోభన్ బాబు, నాగభూషణం, రాజబాబు, చంద్రకళ, రావి కొండలరావు, సాక్షి రంగారావు, గోకిన రామారావు, మాస్టర్ రాజ్‌కుమార్, వరలక్ష్మి, నిర్మల, ఝాన్సీ, పుష్పకుమారి పాల్గొన్నారు.

శ్రీమతి కావిలిపాటి విజయలక్ష్మి రాసిన 'విధి విన్యాసాలు' నవల ఆధారంగా నిర్మితమవుతున్న ఈ చిత్రం ఇంతవరకు సగం షూటింగ్ పూర్తి అయింది. సంభాషణలు: ఎన్. ఆర్. నంది, సంగీతం: కె. వి. మహాదేవన్, ఫొటోగ్రఫీ: ఎస్. వెంకటరత్నం, దర్శకత్వం: కె. యస్. ప్రకాశరావు.

శ్రీయుతులు సత్యనారాయణ, సూర్యనారాయణ నిర్మిస్తున్న యీ చిత్రానికి క్రొత్త పంపిణీ సంస్థ-లక్ష్మీ కంబైన్స్ వారే డిస్ట్రిబ్యూటర్లు, రిలీజ్: లక్ష్మీ ఫిలింస్.

"బొమ్మా-బొరుసా" చిత్రంలో రామకృష్ణ

డి.వి.ఎస్. చిత్రంలో పాతనూరు ఔట్‌డోర్ దృశ్యాలు చిత్రీకరణ

మద్రాసు సమీపానవున్న పాతనూరు ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టు. పచ్చని ప్రకృతి కళకళలాడుతుంటే, రమణీయమైన జలప్రవాహం కన్నుల పండువగా వుంటుంది.

డి. వి. ఎస్. ప్రొడక్షన్‌వారు తమ తాజా చిత్రానికి ఇటీవలనే వారంరోజులపాటు పాతనూరు ప్రాంతంలో షూటింగ్ జరిపారు. శోభన్‌బాబు, వాణిశ్రీల యుగళగీతాలు, మరికొన్ని దృశ్యాలు చిత్రీకరించటం జరిగింది. ఫ్లయిట్ లెఫ్టినెంట్ రవిగా శోభన్‌బాబు ఒక కొత్త భూమికలో, అతని ప్రేయసిగా వాణిశ్రీ ఒక కొత్త తరహా పాత్రలో నటించారు.

డి. వి. యస్. రాజా నిర్మిస్తున్న యీ చిత్రానికి దర్శకులు శ్రీ కె. విశ్వనాథ్, యీ చిత్రంలో ముఖ్యభూమికల్లో ఎన్. టి. రామారావు, జగ్గయ్య, శోభన్‌బాబు, రాజనాల, రాజబాబు, అల్లు రామలింగయ్య, వాణిశ్రీ, దేవిక, శాంతకుమారి, రమాప్రభ వున్నారు.

'నమ్మకద్రోహులు' చిత్రంలో హరనాథ్, విజయశ్రీ

యాహ్యాకు మద్దతుపై పాక్ ప్రజలు పునరాలోచించాలి

—గఫర్‌ఖాన్ విజ్ఞప్తి

నాగపూర్, జూలై 2

పశ్చిమ పాకిస్తాన్ పెట్టుబడి దార్లకూ పశ్చిమ పంజాబ్ బడా పెత్తందారీ దొరలకూ అధికారం కట్టబెట్టడానికి బంగ్లాదేశ్ పై యుద్ధం ప్రకటించిన యాహ్యాఖాన్ ప్రభుత్వాన్ని బలపరచాలో లేదో పాకిస్తాన్ ప్రజలు ఒక్కసారి ఆలోచించుకోవాలని సరిహద్దుగాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ విజ్ఞప్తి చేశారు.

సర్వోదయపత్రిక "సర్వోదయ సాధనలో ఆయన ఒకవ్యాసం వ్రాశారు. యాహ్యాఖాన్ చేస్తున్న దారుణాలు దేశ ఐక్యతకుగానీ, ఇస్లాం రక్షణకుగానీ కాదని ఆయన స్పష్టీకరించారు.

పక్తూన్ ప్రాంతంలో ప్రజాబలంగలపార్టీ ఎన్నికైనప్పుడు కూడా పాక్ ప్రభుత్వం ఇదే విధంగా ప్రవర్తించింది అప్పుడుకూడా ముస్లిం లీగ్ నాయకత్వాన మైనారిటీ ప్రభుత్వాన్ని జిన్నా ఏర్పాటుచేశారు. దారుణాలు అంతు లేకుండా సాగించారు. ఖుదాయేఖిద్మత్‌గార్ ఉద్యమాన్ని నిషేధించారు.

కాని తూర్పు బెంగాల్ ప్రజలు తమ ప్రాంతంలోనేగాక నేషనల్ అసెంబ్లీలోనే మెజారిటీ సంపాదించారు అని గఫార్‌ఖాన్ తెలిపారు.

ఖాళీగాపడున్న పాక్ 'శరణార్థుల శిబిరాలు'

ముజిబ్‌నగర్, జులై 2

పాక్‌కు శరణార్థులు తిరిగివస్తారన్న భావనతో పశ్చిమ పాక్ నియంతలు ఏర్పాటు చేసిన శిబిరాలు, శరణార్థుల కేంద్రాలు ఖాళీగా-పడివుండటంతో పాక్ పాలకులకు మతిపోతున్నది

భారత్ నుండి శరణార్థులు తిరిగి వచ్చేస్తున్నారని ప్రచారం చేసుకుంటున్న పాకిస్తాన్‌కు ఆ ప్రచారాన్ని ఎలా నిలబెట్టుకోవాలో తెలియక తల్లకిందులౌతున్నదని విముక్తి సేన వర్గాలకు వార్తలందాయి.

బ్రిటన్ ఎం.పి.ల పర్యటన ముగింపు

న్యూఢిల్లీ, జూలై 2

బంగ్లాదేశ్ సమస్యపై రాజకీయ పరిష్కారం అవసరం అనే అభిప్రాయాన్ని బ్రిటన్ ప్రజలకు ప్రభుత్వానికి నచ్చజెప్పగలమన్న ఆశాభావాన్ని బ్రిటన్ పార్లమెంటరీ ప్రతినిధివర్గం వ్యక్తపరిచింది

ఈ ప్రతినిధివర్గం శరణార్థుల శిబిరాలను దర్శించి ఢిల్లీ చేరుకుంది. వారు స్వదేశం వెడుతున్నారు.

నౌఖాలీ రంగంలో 2 బ్రిడ్జీల ధ్వంసం

అగర్తాలా, జూలై 2

నౌఖాలీ రంగంలో రెండు రైలు వంతెనలను విముక్తిసేనలు గతవారం పేల్చివేశారు. ఇదేప్రాంతంలో జరిగిన పోరాటంలో 50 మంది పాక్ సైనికులు హతమయ్యారని విముక్తి సేన వర్గాలు తెలిపాయి.

ఫెని, చిట్టగాంగ్ మార్గంపై సోనాయ్ మురివద్ద గెరిల్లాలు గ్రేనేడ్లు విసరగా మరొక రైల్వేవంతెన ధ్వంసమయింది. ఇక్కడే మరొక గ్రామంలోని వంతెన పేల్చివేశారు.

సోనాయ్‌మురి దక్షిణ ప్రాంతంలో రెండు పాకిస్తాన్ వాహనాలు పేల్చివేయబడ్డాయి. ఒక అధికారితోపాటు 30 మంది పాక్ సైనికులను గెరిల్లాలు మట్టుపెట్టారు. పాజావా వద్ద గెరిల్లాలు 15 మంది సైనికుల్ని కాల్చి చంపారు.

నెహ్రూ జూలాజికల్ వేళలలో మార్పు

హైదరాబాదు, జూన్ 30

నెహ్రూ జూలాజికల్ పార్కు ఇకనుంచి ఉదయం 8-30 గంటల నుండి సాయంత్రం 6-30 గంటల వరకు తెరచి ఉంటుంది.

ఈ పనివేళలు జూలై 1, 1971 నుండి మార్చి 31, 1972 వరకు అమలులో ఉంటాయి

నెహ్రూ జూలాజికల్ పార్కు డైరెక్టరు ఈ విషయాన్ని తెలిపారు. దీనివలన పార్కును చూడటానికివచ్చేవారు సూర్యాస్తమయం వరకు ఉండటానికి వీలు కలిగింది.

హైదరాబాద్‌లో నేడు

ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘంవారు ఈ నెల 4 వ తేదీ ఉదయం న్యూసైన్సు కాలేజీలో సమావేశం అవుతారు. సమావేశానికి డాక్టర్ నాయని కృష్ణకుమారి ముఖ్య అతిథిగాను, శ్రీ శశాంక అధ్యక్షులుగాను వ్యవహరిస్తారు.

సమావేశంలో కవితా పఠనం, కథానికా పఠనం, లలిత సంగీతం ఉంటాయి.

సభలు- సమావేశాలు

ఒంగోలు జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం జూలై 6 ఉదయం 10 గం॥ నుండి ఒంగోలులో జరుగుతుంది. రాష్ట్ర నాయకులు శ్రీ ఎల్లమందారెడ్డి హాజరౌతారు.

బంగ్లాదేశ్ గ్రంథం ఆవిష్కరణ

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, జులై 2

నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాటం జరుపుతున్న బంగ్లాదేశ్ ప్రజలకు ఆయుధాలను అందజేయాలని, అక్కడ ప్రజాస్వామిక పరిపాలన ఏర్పడేందుకు సహాయపడాలని నేటి సాయంత్రం విశాలాంధ్ర ప్రచురణాలయం మేడమీద శ్రీ కంభంపాటి సత్యనారాయణ రచించిన 'బంగ్లాదేశ్ ఉద్యమ చరిత్ర' అనే గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ రాజ్యసభ సభ్యులు శ్రీ కాట్రగడ్డ శ్రీనివాసరావు అన్నారు

ఈ సందర్భంలో జరిగిన సభకు విశాలాంధ్ర ప్రధాన సంపాదకులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ అధ్యక్షత వహించారు

సభా ప్రారంభాన విశాలాంధ్ర ప్రచురణాలయం తరపున శ్రీతుమ్మల వెంకట్రామయ్య స్వాగతం చెప్పారు

గ్రంథకర్త శ్రీ కంభంపాటి సత్యనారాయణ ప్రసంగిస్తూ తూర్పుబెంగాల్ పూర్వాపరాలను తెలుసుకోవాలంటే అతిస్వల్ప సమాచారం మాత్రమే లభ్యమవుతున్నదని, 1947 సంవత్సరంనుండి కూడా అనేక ఘటనలు అక్కడ జరిగాయని అన్నారు

1947 సంవత్సరంలోనే రాజ్యాంగ నిర్మాణ సభ ఒకసారి లాహోర్‌లోనూ మరొకసారి ఢాకాలోనూ జరపాలనే ఒక సభ్యుని లేవనెత్తిన సమస్యను, అప్పటి లియాఖత్ అలీఖాన్ వ్యతిరేకించడం జరిగిందని, ఆనాడే ఈ సమస్యకు అంకురార్పణ జరిగిందని అన్నారు.

ఆ తరువాత అగర్తాల కుట్రకేసు జరిగింది. అందులో ముద్దాయి శ్రీ ముజిబుర్ రహిమాన్ అన్న విషయం గమనించాలని వివరించారు.

సియాటో, సెంటో కూటమికి చెందిన పాకిస్తాన్‌లో వయోజన వోటింగు ద్వారా ఎన్నికలు జరగడము, ఆ ఎన్నికలలోఅవామీ లీగ్ అత్యధిక మెజారిటీని సంపాదించడం ఈ పరిణామాలన్నీ అక్కడి ప్రజల వాంఛితాలను పునాదులుగా ఎంచాలని అన్నారు

బంగ్లాదేశ్ ప్రజా పోరాటానికి తృణమో పణమో తన వంతు బాధ్యతను ఈ గ్రంథ రచనద్వారా తీర్చుకుంటున్నానని అన్నారు.

ఆ తరువాత విశాలాంధ్ర సంపాదకులు శ్రీ ఏటుకూరి బలరామమూర్తి ప్రసంగిస్తూ బంగ్లాదేశ్ సమస్య కేవలం బంగ్లాదేశ్‌కు, పాకిస్తాన్‌కు, భారత దేశానికి మాత్రమే పరిమితం గాదని, ఇది యావత్ ఆగ్నేయాసియాకు సంబంధించిన సమస్య అని, ప్రజాతంత్ర శక్తులపై సామ్రాజ్యవాదులు జరుపుతున్న ఎదురు దాడి అని ఈ పోరాటంలో ప్రజాతంత్ర శక్తులు విజయం సాధించాలని అన్నారు.

సభాధ్యక్షులు శ్రీ శ్రీకృష్ణ మాట్లాడుతూ శ్రీ కంభంపాటి రచించిన "బంగ్లాదేశ్"తోపాటు త్వరలో మరికొన్ని పుస్తకాలు ప్రచురించుటకు, ప్రజలకు యీ సమస్యను విపులంగా తెలియజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలియజేశారు.

తూర్పు బెంగాల్‌లో కమ్యూనిస్టుపార్టీని నిషేధించడంవలన, కమ్యూనిస్టు శక్తులు గణతంత్రవాదులతో కలిసి అద్భుతంగా పనిచేస్తున్నాయని, దేశ విముక్తికోసం, ప్రజాస్వామ్య రక్షణకోసం అన్ని పార్టీల ఐక్యపోరాటం జరపాలని పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు

బంగ్లాదేశ్ పోరాటం జాతీయ విముక్తి పోరాటమని, సామ్రాజ్యవాదులు, జాతీయ దురహంకారులైన చైనాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటమని అన్నారు.

ఆ ప్రజలకు ఆయుధాలను అందజేసేందుకు కమ్యూనిస్టుపార్టీ ఇప్పటికి రు. 40 వేల ప్రజలనుండి సేకరించిన విషయం గుర్తు చేశారు.

సభలో శాసనసభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ఇది కేవలం మానవత్వానికి సంబంధించిన అంశంకాదని రాజకీయ సమస్య అని పాక్ నియంతృత్వం అంతమైతేగాని ఇది పరిష్కారం కాదని అన్నారు.

భారత్ వైఖరి పునః పరిశీలన

స్వరణ్‌సింగ్ సమాధానం

న్యూఢిల్లీ, జులై 2

తూర్పుబెంగాల్లో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనని బెదిరిస్తూ, పాక్ అధ్యక్షులు యాహ్యాఖాన్ చేసిన రేడియో ప్రసంగందృష్ట్యా, బంగ్లాదేశ్ సమస్యపట్ల భారత్ తన వైఖరిని పునః పరిశీలించుకోవలసివున్నదని విదేశాంగశాఖ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

బంగ్లాదేశ్ ప్రజలు ప్రజాస్వామ్య హక్కులు పునరుద్ధరింపబడ గలవన్న ఆశలను, యాహ్యాఖాన్ ప్రకటన కూకటి వ్రేళ్ళతో పెకలించి వేసిందని తెలిపారు

సరిహద్దులలో కొనసాగుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించే నిమిత్తం వివిధ దేశాల పార్లమెంటరీ ప్రతినిధి వర్గాలను ఆహ్వానించాలన్న సూచనను ఆయన అంగీకరించారు.

బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించాలని డిమాండ్‌చేస్తూ పి. యస్. పి. సభ్యులు శ్రీ సమర్‌గుహ ప్రవేశపెట్టిన తీర్మానంపై రెండుగంటలపాటు జరిగిన చర్చ సందర్భంగా శ్రీ స్వరణ్‌సింగ్ జోక్యం చేసుకుంటూ పై విధంగా తెలియజేశారు

బంగ్లాదేశ్‌ను గుర్తించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం వ్యతిరేకించటంలేదని, అయితే తగిన సమయం రావాలని శ్రీ సింగ్ తెలియజేశారు. బంగ్లాదేశ్‌ను గుర్తించటానికి ప్రస్తుతం పరిస్థితులు సక్రమంగా లేవని శ్రీ సింగ్ అన్నప్పుడు ప్రతిపక్ష సభ్యులు సిగ్గు, సిగ్గు అంటూ నినాదాలు చేశారు.

పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానంలో బంగ్లాదేశ్ ప్రజలకు భారత ప్రభుత్వం పూర్తిమద్దతు, సానుభూతిని ప్రకటించిన విషయాన్ని శ్రీ సింగ్ ప్రస్తావించారు. అయితే బంగ్లాదేశ్‌ను గుర్తించటమే సరైన పద్ధతిఅని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారని ఆయన విజ్ఞప్తి చేశారు.

ముజిబుర్ రహమాన్ ఆరోగ్య పరిస్థితి పట్ల సభ్యులు వెల్లడించిన ఆందోళనలో ఆయన పాలు పంచుకున్నారు ముజిబుర్ రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్న సభ్యుల అభిప్రాయంతో ఆయన ఏకీభవించారు

యాహ్యాఖాన్ రేడియో ప్రసంగం స్వాతంత్ర్య పోరాటాన్ని కొనసాగించాలన్న బంగ్లాదేశ్ ప్రజల కృత నిశ్చయాన్ని ఇనుమడింప జేయగలదని ఆయన అన్నారు

శ్రీయుతులు వి. కె. కృష్ణమీనన్, ఇంద్రజిత్‌గుప్తా, మధు దండావతే తదితరులు చర్చలో పాల్గొంటూ యాహ్యాఖాన్ ప్రకటన బంగ్లాదేశ్‌ను భారతప్రభుత్వం గుర్తించవలసిన అవసరాన్ని సృష్టించిందని తెలియజేశారు.

చర్చ వాయిదా

బంగ్లాదేశ్ సమస్యపై లోక్‌సభలో జరుగుతున్న చర్చను నిరవధికంగా వాయిదా వేశారు

ప్రైవేటు సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానంపై జరుగుతున్న చర్చను ప్రభుత్వం చొరవతో వాయిదా వేయుటం చాలా అరుదైన విషయం

పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి శ్రీ రాజబహదూర్ చర్చను నిరవధికంగా వాయిదా వేయాలని సావధాన తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా సభ ఆమోదించింది.

యు.పి. ప్రభుత్వంచే 12 చక్కెరమిల్లుల స్వాధీనం

రు. 3 కోట్ల 26½ లక్షల నష్టపరిహారాన్ని చెల్లించటానికి నిర్ణయం

లక్నో, జులై 2

రాష్ట్రంలోని 12 పంచదార మిల్లులను స్వాధీనం చేసుకొనడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నేటి రాత్రి నిర్ణయించింది

పంచదార మిల్లు యజమానులకు ప్రభుత్వం నష్టపరిహారంగా రు 3 కోట్ల 26½ లక్షలు చెల్లిస్తుందని ముఖ్యమంత్రి శ్రీకమలాపతి త్రిపాఠీ నేటిరాత్రి ఇక్కడ విలేకరులకు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న పంచదార మిల్లులను కార్పొరేషన్ నిర్వహిస్తుంది. ప్రభుత్వానికి కట్టవలసిన బాకీలను చెరకు ధర బకాయిలను, కార్మికులకు, రైతులకు ఇవ్వవలసిన బకాయిలను పంచదార మిల్లు యజమానులు చెల్లించవలసి వుంటుందని ముఖ్యమంత్రి శ్రీ త్రిపాఠీ అన్నారు

ప్రభుత్వం వారిచ్చే నష్టపరిహారం నుంచే మిల్లు యజమానులు తమ బాకీలను చెల్లించవలసి వుంటుందని ఆయన వివరించారు

చక్కెర పరిశ్రమ జాతీయానికి ఇది ప్రథమ చర్యా అని ఒక విలేకరి ప్రశ్నించగా, "కొన్ని చక్కెర మిల్లులను స్వాధీనం చేసుకుంటున్నాము అని ఆయన సమాధానమిచ్చారు

డ్రైనేజి సెస్సు వసూలు వాయిదాకు మంత్రి తిరస్కృతి

హైదరాబాద్ జూలై 3

డ్రైనేజిసెస్సు వసూలును వాయిదా వేసేందుకు ఆర్థికమంత్రి శ్రీ [illegible] రెడ్డి తిరస్కరించారు

కాకినాడకు 12 మైళ్ళ దూరంలోని వేళంగివద్ద తుల్యభాగ డ్రెయిన్‌కు జూన్ 30 న ప్రారంభోత్సవం చేస్తూ డ్రెయిన్ సెస్సు వసూలును వాయిదా వేయటంసాధ్యం కాదని ఆయన చెప్పారు.

అంతకుముందు రైతులు ఆర్థిక మంత్రిని కలుసుకుని పంటలు వరుసగా దెబ్బ తింటున్నందున డ్రయినేజి సెస్సు వసూలు వాయిదా వేయాలని అభ్యర్థించారు సభకు అధ్యక్షత వహించిన జిల్లాకలెక్టరు శ్రీ సుర్, మాలకొండయ్యగూడ సెస్సువసూలు వాయిదా వేయాలని కోరవద్దని రైతులను కోరారు. కాల్వల త్రవ్వకం జరుగుతున్నందున రెండవ పంటను వేయవద్దని కోరారు.

సూపరింటెండెంట్ ఇంజనీరు శ్రీ మహమ్మద్ హుస్సేన్ ప్రసంగిస్తూ గోదావరి తూర్పు డెల్టాలో తుల్యభాగ ప్రధానమైన డ్రెయిన్ అని దీని పొడుగు 29 మైళ్ళని [illegible] ఉంటుందని తెలియజేశారు. దీనివలన 73 వేల ఎకరాలకు లాభం చేకూరగలదన్నారు.

యుద్ధం అనివార్యమైనా బంగ్లాదేశ్‌ను గుర్తించాలి

శ్రీ జయప్రకాశ్ డిమాండ్

న్యూఢిల్లీ, జూలై 2

పాకిస్తాన్‌తో దీర్ఘకాల యుద్ధానికి దారి తీసినాసరే బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని భారత ప్రభుత్వంతక్షణమే గుర్తించాలని సర్వోదయ నాయకులు శ్రీ జయప్రకాశ్‌నారాయణ్ నేడిక్కడ డిమాండ్ చేశారు.

నేటి సాయంత్రం ఇక్కడ జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆయన పైవిధంగా డిమాండ్‌చేశారు. ఈ విషయమై, ఇతరదేశాల అభిప్రాయాలకోసం వేచిచూడకుండా భారతప్రభుత్వం సొంతంగా నిర్ణయం తీసుకోవాలని అలాచేస్తే ఇతర దేశాలు కూడా భారతదేశమార్గాన్నే అవలంబిస్తాయని ఆయన అన్నారు.

పాక్ సైనిక ప్రభుత్వంపై ప్రపంచ దేశాల ఒత్తిడి పనిచేయలేదని తన ప్రపంచ పర్యటన ద్వారా తెలిసిందని, కాబట్టి బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని వెంటనే గుర్తించి దానికి సాధ్యమైనంత సాయం చేయడం మినహా మరో ప్రత్యామ్నాయ మార్గంలేదని శ్రీ జయప్రకాశ్ అన్నారు.

పాకిస్తాన్‌కు సైనిక, ఆర్థిక సహాయం చేయనని ఇచ్చిన వాగ్దానాన్ని అమెరికా ఉల్లంఘిస్తున్నదని ఆయన విమర్శించారు.

బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని గుర్తించాలని డిమాండ్ చేస్తూ కోటి సంతకాలు సేకరించి ప్రభుత్వానికి సమర్పించవలసిందిగా శ్రీజయప్రకాశ్ దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను కోరారు.

సహాయం పునరుద్ధరణకు వ్యతిరేకత

న్యూఢిల్లీ, జూలై 2

పాక్ సైనిక నియంత యాహ్యాఖాన్ ప్రకటిత ప్రాతిపదికపై గాని లేక ప్రస్తుత పరిస్థితులలోగాని పాకిస్తాన్‌కు బ్రిటన్ సహాయాన్ని పునరుద్ధరించటానికి తాను వ్యతిరేకినని బ్రిటన్ పాలకపార్టీ సభ్యులు టాబిడెన్సెర్ నేడిక్కడ తెలియజేశారు.

బ్రిటన్‌కు వెళ్ళే ముందు తన సహచరులు ఆర్థర్ బాటమ్లీ రీజినాల్డ్ ప్రెంటిస్‌లతోపాటు టెలివిజన్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన పై విధంగా తెలియజేశారు. యాహ్యాఖాన్ ప్రకటనలో బంగ్లాదేశ్ సమస్యకు రాజకీయ పరిష్కార మార్గం సూచింపబడలేదని అందుచేత పాకిస్తాన్‌కు సహాయాన్ని పునరుద్ధరించటన్యాయసమ్మతంకాదని అన్నారు.

యాహ్యాఖాన్ ప్రకటన రాజకీయ పరిష్కారానికి ప్రారంభ ప్రాతిపదికను కూడా సూచించలేదని ప్రతినిధివర్గం సభ్యులు ముగ్గురు అభిప్రాయపడ్డారు.

బంగ్లాదేశ్ సమస్యకు సాధించబడే ఎలాంటి పరిష్కార మార్గమైనా అది బంగ్లా ప్రజలకు ఆమోదయోగ్యమైనదిగా వుండాలని తెలియజేశారు.

విశాఖలో నిర్మించే నౌకలకు సబ్సిడీ

ప్రభుత్వ పరిశీలన

న్యూఢిల్లీ, జులై 3

విశాఖపట్నం హిందుస్తాన్ నౌకా నిర్మాణ కేంద్రంలో తయారు చేయబడే నౌకలకు ధరలు నిర్ణయించటం, సబ్సిడీ ఇవ్వటానికి సంబంధించిన నూతన విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, త్వరలో ఒక నిర్ణయం తీసుకోవటం జరుగుతుందని నౌకాయాన మంత్రి శ్రీ రాజబహదూర్ నిన్న లోక్‌సభలో తెలియ చేశారు.

అంతర్జాతీయ ధరలకు విశాఖపట్టణంలో తయారైన నౌకలు భారత నౌకా యజమానులకు ఇప్పటివరకు లభ్యమయ్యాయని ఆయనన్నారు.

అమ్మకం ధరలకన్న ఉత్పత్తి వ్యయం ఎక్కువగా వుంటున్నందువల్ల, ఈ రెంటి మధ్యగల తేడాను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో నౌకా నిర్మాణ కేంద్రానికి చెల్లించిందని మంత్రి చెప్పారు

"ప్రపంచ ప్రజల హృదయాలను కలచివేసిన ఘటన"

న్యూఢిల్లీ, జులై 2

వ్యోమగాముల మృతి ప్రపంచ ప్రజల, సోవియట్ ప్రజల హృదయాలను కలచివేసిందని అంత్యక్రియల సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో పొలిట్‌బ్యూరో సభ్యులు ఆండ్రీ కిరిలెంకో గద్గద స్వరంతో అన్నారు.

"అంతరిక్షంలో ప్రప్రథమంగా శాల్యూట్ సోయుజ్ నౌకలను కలిపి పరిశోధించినదివారే వారి కృషి ఫలితాలు శాస్త్రజ్ఞానానికి భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలకూ, మానవ జాతికే అమూల్యమైన సేవచేశాయి అని కిరిలెంకో అన్నారు

అనంతరం వ్యోమగామి వాకిమిర్ షటలోవ్ ప్రసంగించారు.

"అంతులేని విజ్ఞాన దాహం, వారి లక్ష్యసాధనకై తమ ఆత్మశక్తినంతటినీ అంకితంచేసే అనన్య సామాన్యశక్తి, నిరంతరకృషి కమ్యూనిస్టులైన దోబ్రోవోల్‌స్కీ, వాల్కోవ్, పత్సయేవ్‌ల విశిష్టలక్షణాలు" అన్నారు

సోవియట్ శాస్త్రీయ అకాడమి అధ్యక్షులు మిస్తిస్లావ్ కెల్డిష్‌కూడా ప్రసంగించారు

వేలాది మాస్కో పౌరుల శ్రద్ధాంజలి

రెడ్ స్క్వేర్‌లో నేడు వ్యోమగాములకు అంత్యక్రియలు జరిపిన సందర్భంగా వేలాది మంది మాస్కో పౌరులు అవనతవదనులై శ్రద్ధాంజలి ఘటించారు.

రెడ్‌స్క్వేర్‌లో సంతాప సభకు కమ్యూనిస్టు నాయకులు బ్రెజ్నేవ్, పొడ్గోర్నీ, కోసిగిన్ తదితర అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. చారిత్రాత్మకమైన క్రెమ్లిన్ గోడవద్ద సోవియట్ నాయకులున్న పీఠల సమాధుల సరసన వ్యోమగాముల చితాభస్మాన్ని వుంచారు.

సంతాప సభకు అమెరికా అధ్యక్షుడు నిక్సన్ ప్రతినిధి వ్యోమగామి అయిన థామస్ స్టాఫోర్డ్ హాజరయ్యారు

విషాద ప్రదర్శన

అంతకుముందు వేలాదిమంది మాస్కో పౌరులు భిన్నవదనులై నిశ్శబ్దంగా "కమ్యూన్‌స్క్వేర్‌కు వెళ్ళారు. వారందరూ కమ్యూన్‌స్క్వేర్‌కు వెళ్ళడానికి 2 గంటలు పట్టింది.

అనంతరం సోవియట్ సైన్యం సెంట్రల్ హాల్‌వద్దనుండి సుదీర్ఘమైన వరుసలలో నిలుచుని వ్యోమగాముల గౌరవార్థం పుష్పమాలలు, గుచ్ఛాలు వుంచారు

12 గంటలకు సోవియట్ సైన్యం సెంట్రల్‌హౌస్‌లోని "రెడ్ బ్యానర్ హాల్"నుండి ప్రజలందరూ నిష్క్రమించారు శోకతప్తులైన వ్యోమగాముల కుటుంబ సభ్యులు మాత్రం అక్కడే ఉండి పోయారు.

ఆ తర్వాత వ్యోమగాముల చితాభస్మాన్ని కమ్యూన్ స్క్వేర్‌కు కొనిపోయారు ప్రదర్శన మాస్కో వీధులగుండా వెళ్తుంటే విషాద సాగరంలో మునిగిన మాస్కో నగరం నిశ్శబ్దంగా తలవాల్చింది.

"హౌస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్" వద్ద ప్రదర్శన ఆగింది ఆండ్రీకిరిలెంకో నికొలావ్ కెల్డిష్, ఆండ్రీగ్రెచ్‌కో, వ్లాదిమిర్ షటలోవ్ తదితరులతోకూడిన అంత్యక్రియల కమిషన్ సభ్యులు చితాభస్మాన్ని తుపాకులు ధరించిన సైనిక దళాలకు అందించారు.

మాస్కో సైనిక దళాలు నిశ్చలంగా వరుసలలో నిలిచాయి. వారి యుద్ధ పతాకాలను అవనతం చేశారు. అక్కడి వేదికపైన మాస్కో ప్రజా ప్రతినిధులు, శాస్త్రజ్ఞులు తదితర ప్రముఖులున్నారు. దౌత్యప్రతినిధులందరూ ఈ సందర్భంగా ఉన్నారు.

డీసిల్ ఆయిల్ స్థానే కిరోసిన్ వాడకం

నివారించాలని రాష్ట్రాలకు కేంద్రమంత్రి లేఖలు

న్యూఢిల్లీ, జూలై 2

డీసిల్ ఆయిల్‌స్థానే పెద్ద మొత్తంలో కిరోసిన్ ఉపయోగిస్తున్నందువల్ల నానాటికి క్షీణిస్తున్న పరిస్థితిని పరిష్కరించటంలో రాష్ట్రాలుసహకరించాలని కేంద్రపెట్రోలియం రసాయనాలమంత్రి శ్రీ పి. సి. సేథీ కోరారు

వివిధ రాష్ట్రాల ముఖ్య మంత్రులకు, రాష్ట్రపతి పాలనవున్న రాష్ట్రాల గవర్నర్లకు వ్రాసిన లేఖలో మంత్రి పై విధంగా కోరారు

డీసిల్ ఆయిల్ బదులు కిరోసిన్ ఉపయోగిస్తున్న జాతీయ రహదారి మార్గంలోని కిరోసిన్ డిపోలపై దాడిచేసి ఆ డిపోల లైసెన్సులను రద్దు చేయాలని ఆయన కోరారు

టోక్యో, జూలై 2

జపాన్ మంత్రివర్గం నేడు రాజీనామా చేసింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ సరిపేందుకు వీలుగా ఈ రాజీనామాలు సమర్పించారు.

పడతుల్ని అమ్ముకుంటున్న థాయ్‌లాండ్ పేదలు

బ్యాంకాక్, జూలై 2

ఉత్తర థాయిలాండ్‌లో 4 వేల మంది యువతులను నిర్బంధంగా, ఆ యువతుల తల్లి దండ్రులే స్వయంగా అమ్ముతున్న విషాదవృత్తాంతాన్ని థాయ్‌లాండ్ మహిళల సంఘం తెలిపింది.

ఈ యువతులను పడుపువృత్తిలో ప్రవేశపెట్టేవారు కొనుక్కున్నారు పేదరికంవల్ల ఆ తల్లిదండ్రులు తమ బిడ్డలను ఈ విధంగా అమ్ముకున్నారు. ఈ యువతుల్ని తిరిగి కొనుగోలుచేసి ఆ వేశ్యావృత్తినుండి విముక్తి చేయాలని ఈ మహిళాసంస్థ ఆలోచిస్తున్నది.

థాయిలాండ్‌లో 70వేల మందిగల ఒకే జిల్లాలోనే వీరందరూ ఉన్నారు. ఇక్కడినుండే మొత్తందేశానికి కావల్సిన వేశ్యలు సరఫరా చేయబడుతున్నారని, ఆ ప్రాంతంలో పర్యటించిన మహిళా సంస్థ నాయకురాలు చెప్పారు. ఈ యువతుల్ని కొనుగోలు చేసి వారికి ఉద్యోగవసతి కల్పించాలని ఆమె ఆలోచిస్తున్నారు

భారత చలన చిత్రాల ఎగుమతి ద్వారా రు.6 కోట్లఆదాయం

మద్రాసు, జులై 3

గత సంవత్సరంలో భారతీయ చిత్రాల ఎగుమతులవల్ల రూ 6 కోట్లు ఆదాయము వచ్చిందని భారత ఫిలిం ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, దక్షిణ భారత ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులయిన శ్రీ ఎస్. శ్రీనివాసన్ తెలిపారు.

వీటిలో మద్రాసు రేవుద్వారా ఎగుమతి అయిన చిత్రాల విలువ దాదాపు రెండుకోట్ల రూపాయ లుంటుందని యునె ఏ. టి. బి. విలేకరికి తెలియజేశారు

సోవియట్, యుగోస్లావియా, హాలెండ్, ఫ్రాన్సు ఇటలీ మున్నగు దేశాలు భారతీయ చిత్రాలను దిగుమతి చేసుకోవడంలో అత్యంతాసక్తిని కనబరుస్తున్నాయి

భారత్ తీసుకొంటున్న ప్రతి ఫ్రెంచి చిత్రానికి ప్రతిఫలంగా ఫ్రాన్సు 5 భారత చిత్రాలను తీసుకొంటున్నదని ఆయన తెలియజేశారు

అమెరికాచే లాభాల తరలింపు

అమెరికా ప్రభుత్వంతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం అనేక అమెరికన్ చిత్రాలు భారత్‌లోకి దిగుమతి అవుతున్నాయని, దాని వలన అమెరికా కంపెనీలకు 10 కోట్ల రూపాయలు సంవత్సరాదాయంగా లభిస్తుందని, వాటి ప్రతిగా భారత్ చిత్రాలు అమెరికాకు ఎగుమతి అవడం లేదని శ్రీ శ్రీనివాసన్ అన్నారు.

జూన్ 30 తో ముగిసిన భారత-అమెరికా ఒప్పందం, తిరిగి జరిగే పొడిగింపు సందర్భంలో అమెరికాలో కూడా భారత చిత్రాలను ప్రదర్శించు నిమిత్తం అమెరికా కంపెనీలను అడగాలని ఆయన అన్నారు.

అమెరికా చిత్రాల దిగుమతులు, భారత చిత్రాల ఎగుమతులు భారత చలన చిత్రాల ఎగుమతుల కార్పొరేషన్ ద్వారానే జరగాలని కూడా శ్రీ శ్రీనివాసన్ అన్నారు.

బలహీన వర్గాలకు తక్కువ వడ్డీపై రుణాలు

న్యూఢిల్లీ, జూలై 3

బలహీనవర్గాల వారికి తక్కువ వడ్డీపై రుణాలు యివ్వాలని రిజర్వు బ్యాంకుకు చెందిన వడ్డీరేట్ల నిర్ణాయక కమిటీ సిఫారసు చేసింది.

వ్యవసాయరంగం చిన్నతరహా పరిశ్రమలు, చిన్నపాటి వాణిజ్యవర్గం, రవాణా ఆపరేటర్లను యీ బలహీనవర్గం క్రింద యీ కమిటీ చేర్చింది. వీరికి యిచ్చే రుణాలపై వడ్డీలను 8 శాతంకన్న తక్కువగాకుండానూ, 10 శాతానికి ఎక్కువగాకుండాను వసూలు చేయాలని కమిటీ సూచించింది.

వడ్డీ రేటును తీసుకొనే అప్పు ప్రాతిపదికపై నిర్ణయించాలి.

ఆర్థికమంత్రి శ్రీ వై. బి. చావన్ ఆదేశంపై గత సంవత్సరం ఏర్పాటైన యీ కమిటీ నేడు తన నివేదికను విడుదలచేసింది.

చిన్నతరహా వర్గాలవారికి గాక మిగతా వర్గాల కిచ్చే రుణాలపై అధికవడ్డీని వసూలు చేయాలని కమిటీ కోరింది

రు. 9 వేలు గల్లంతు

భీమవరం స్టేట్ బ్యాంకు నుండి

భీమవరం, జులై 2

భీమవరం స్టేట్ బ్యాంకులో నిన్న రు. 9 వేలు గల్లంతు అయ్యాయి

ఈ విషయాన్నిగురించి బ్యాంకు ఏజంటు ఈ రోజు పోలీసులకు రిపోర్టు యిచ్చారు. డబ్బు ఎలా గల్లంతు అయిందో తెలియలేదు. ఈ విషయంపై దర్యాప్తు ఇంకా ప్రారంభం కాలేదు

బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, జూలై 2

ఆంధ్రప్రదేశ్ సంక్షేమనిధి మాజీ గౌరవ కార్యదర్శి ఠాకూర్ వి. హరిప్రసాద్‌కు బెయిల్ యివ్వటానికి పట్టణ మేజిస్ట్రేటు శ్రీ వెంకట నారాయణరెడ్డి నేడు తిరస్కరించారు.

మెల్బోర్న్‌లో 3 వేల మంది ప్రదర్శన: లాఠీచార్జి

దక్షిణాఫ్రికా జాత్యహంకార విధానాలకు నిరసనగా

మెల్‌బోర్న్, జూలై 3

దక్షిణాఫ్రికా జాత్యహంకార విధానాలను నిరసిస్తూ నేడిక్కడ ఒలింపిక్ పార్కువద్ద 3000 మంది బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు.

ఇక్కడ పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా స్ప్రింగ్ బోక్స్ ఆటగాళ్ళరాక సందర్భంగా ఈ నిరసన ప్రదర్శన జరిగింది

ప్రదర్శకులపై పోలీసులు లాఠీచార్జి జరిపారు. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఆడవలసి ఉన్న స్థలంలోకి ప్రవేశించడానికి ప్రదర్శకులు తీవ్ర ప్రయత్నం చేశారు. ఒలింపిక్ పార్కు గ్రౌండ్ గేట్లు వద్ద పెద్ద ఎత్తున రెండు వరుసలలో నియమించబడ్డ పోలీసులు ప్రదర్శకులపై దాడి జరిపారు.

కోపోద్రిక్తులైన ప్రదర్శకులు పోలీసుల దాడిని తీవ్రంగా ప్రతిఘటించారు. ముందుగా పోలీసులు లాఠీచార్జి చేయడంతో ప్రదర్శకులు రెచ్చిపోయారు. ప్రదర్శకులు లోనికి వెళ్ళడానికి ప్రయత్నించడం, పోలీసులు ముందుగానే రెచ్చగొట్టడంవల్ల పెద్ద ఘర్షణ జరిగింది

ప్రదర్శకులను తరిమి వేయడానికి సాయుధ పోలీసులు గుర్రాలపై వచ్చారు. కొంతమంది ప్రదర్శకులు గుర్రాల క్రిందపడి నలిగిపోవడం కనిపించింది.

వియత్నాం నుండి అమెరికా సేనల ఉపసంహరణ

కీ ప్రకటన

సైగాన్, జూలై 3

వియత్నాం నుండి అమెరికా సేనలు వైదొలగటానికై ఒక తేదీని నిర్ణయించటానికి తమ కెలాంటి అభ్యంతరం లేదని దక్షిణ వియత్నాం కీలుబొమ్మ ప్రభుత్వ ఉపాధ్యక్షుడు యన్‌గుయాన్ కావో కీ నేడిక్కడ ప్రకటించారు.

వియత్నాంనుండి అమెరికా సేనల ఉపసంహరణపై దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వ విదేశాంగమంత్రి మేడమ్‌బిన్ చేసిన సప్తసూత్ర ప్రతిపాదనపై కీ నేడీ ప్రకటన చేశారు.

పాలసీ పోయినది

జీవితభీమా కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
డివిజనల్ ఆఫీసు, మచిలీపట్నం

తోట అదియ్యాగారి జీవితముపై మచిలీపట్నం డివిజనల్ ఆఫీసు జారిచేసిన నెం. 12810089 గల పాలసీపోయినదని తెలిసినందున యీ తేదీనుండి ఒకనెలలోపుగా ఏటి అభ్యంతరములు మావద్ద దాఖలుకానిచో డూప్లికేటు పాలసీ జారీ చేయబడును.

(సం.) ఎం. రామారావు
సీనియర్ డివిజనల్ మేనేజరు
మచిలీపట్నం
2-7-1971

టెండరు నోటీసు

పిడుగురాళ్ళ గ్రామపంచాయతీ

పల్నాడు తాలూకా, పిడుగురాళ్ళ గ్రామ పంచాయతీకి 1971-72 సం॥ నకు స్టేషనరీ సామానులు, పి హెచ్. సామానులు సప్లయి చేయుటకు యీ క్రింది సంతకము చేయుబడిన వారిచేగాని, లేక వారిచే అనుమతి పొందిన వారిచేగాని ది 12-7-71 సా॥ 2 గం॥ వరకు సీల్డుకొటేషన్లు తీసికొనబడి అదేరోజు 2 గం॥ 10ని॥ లకు తెరువబడును, టెండరుడిపాజిట్టు రూ 50/- చెల్లించవలెను. డిపాజిట్టు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. మిగతా వివరములు ఆఫీసు పని చేయుకాలమందు తెలుసుకొన వచ్చును.

(సం) కె రామిరెడ్డి.
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు
గ్రామపంచాయతీ
పిడుగురాళ్ల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పబ్లిక్ హెల్తు ఇంజనీరింగు డిపార్టుమెంటు

అమెండుమెంటు

పైన పేర్కొనబడిన ఒరిజనల్ టెండరు నెంబరు 2607/71-3/డిబి/డి3/ తేదీ 20 3-71 ఈ క్రింది విధముగా మార్చబడినది

1.	టెండరు షెడ్యూలు అమ్మబడు కడపటి తేదీ	30-7-71
2.	టెండరు షెడ్యూలు అమ్మకమునకు లభించు తేదీ	20-7-71
3.	టెండరు చేరుటకు ఆఖరు తేదీ	25-8-71 3-30 గం॥ వరకు

మిగతా టెండరు కండిషనులు అన్నియు ఒరిజనల్ టెండరు నోటీసులో ఉదహరించబడినట్లే యుండును.

(సం) సి సుధాకరరావు,
సూపరింటెండింగ్ ఇంజనీర (P. H.) విశాఖపట్నం.

R. O. C. No. 110/71 Dt. 1—7—71

టెండరు ప్రకటన

కృష్ణాజిల్లా, దివి తాలూకా కోసూరు గ్రామ పంచాయతీకి ఈ దిగువ నుదహరించిన పనులు చేయుటకు మరియు అయిటములు సప్లయి చేయుటకుగాను సదరు గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచే ది. 10-7-71 వ తేదీ సాయంత్రం 4-00 గంటలలోగా సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. దాఖలు కాబడు టెండర్లు అదే రోజు సాయంత్రం గం. 4-15 ని॥లకు హాజరు గానున్న టెండరుదార్ల సమక్షమున తెరువబడును టెండరు దాఖలు చేయువారు ఈ క్రింది వివరముల కెదురుగా చూపబడిన టెండరు డిపాజిట్టు చెల్లించి సదరు రశీదు టెండరుతో జతపర్చవలెను సదరు టెండరు షరతులు, వివరములు ఆఫీసు పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ. నెం.	వివరము	ఎస్టిమేటు మొత్తము	టెండరు డిపాజిట్టు
1.	విశ్వనాధ చెరువు తూర్పు వైపున రేవు రిపేరు చేయుటను గురించి	రు 500/-	రు. 25/-
2.	విశ్వనాధ చెరువుకు పడమర వైపున రేవుకు రిపేరు చేయుటను గురించి	రు. 500/-	రు. 25/-
3.	నాగరాజు చెరువు దక్షిణ వైపున రేవు మరమ్మత్తు చేయుటను గురించి	రు 500/-	రు. 25/-
4.	నాగరాజు చెరువు ఉత్తరపు వైపున రేవు మరమ్మత్తు చేయుటను గురించి	రు. 500/-	రు 25/-
5.	1971-72 సంవత్సరమునకు స్టేషనరీ సప్లయి చేయుట		రు. 25/-
6.	.. ట్యూబ్ లైట్ స్పేరు పార్ట్సు సప్లయి చేయుట		రు. 50/-
7.	స్క్రూ బల్బులు 40 Volts		రు. 25/-

(సం.) ఎ. వి. సుబ్బారావు,
ఎగ్జిక్యూటివ్ అఫీసరు,
గ్రామ పంచాయతీ
కోసూరు (దివి తాలూకా).



తాళికట్టవలసిన దానికి-
కన్నుకొట్టి కిరాయికి పిలిచే
మగవాడిని ఏమనాలి?

జూలై 16 విడుదల!
ఉదయం ఆటతో ప్రారంభం

విశ్వభారతి ప్రొడక్షన్స

శ్రీమంతుడు

దర్శకత్వం
కె. ప్రత్యగాత్మ
నిర్మాత
జి. రాధాకృష్ణమూర్తి
కథ, మాటలు: ముళ్ళపూడి వెంకటరమణ
సంగీతం: టి. చలపతిరావు
కెమెరా: కె. యస్. రామకృష్ణారావు

నవయుగ

మైసూరు: వాలో
ఒరిస్సా: నాగేశ్వరపిక్చర్స్

---

25 వ, వారం

విజయవాడ శ్రీ విజయా టాకీస్
హైదరాబాద్ శాంతి థియేటర్ (A.C)
గుంటూరు లిబర్టీ థియేటర్
తిరుపతి ప్రతాప్ టాకీస్

జగపతి ఆర్ట్ పిక్చర్స

దసరాబుల్లోడు

(పూర్తి రంగుల చిత్రం)

నిర్మాత-దర్శకుడు:
వి.బి. రాజేంద్రప్రసాద్ B.Sc.
పాటలు-మాటలు: ఆచార్య ఆత్రేయ
సంగీతం: కె.వి. మహదేవన్
కెమెరా: ఎస్. వెంకటరత్నం W.I.C.A

లక్ష్మీ ఫిలింస్

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్: టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్: వేములపల్లి శ్రీకృష్ణ, ముద్రణ: స్వతంత్ర ఆర్ట ప్రింటర్స్. విజయవాడ-4. R. No. 1138/57